# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

2020 అక్టోబర్ 1-31

1-2


సలలిత స్వర రాగ గంగా ప్రవాహమే బాలు

వైరస్‌లా మతవిద్వేషం

హిందూ పురాణాలన్నీ బుద్ధుడి తర్వాత రాసుకున్నవే!

అయోధ్య రాముడు గాంధీ రాముడేనా ?

ఒక్కరికీ నిజం చెప్పే ధైర్యం లేదా?

కొత్త 'వ్యవసాయ' విపత్తులు!

కార్పొరేట్లకు రాష్ట్రాల రాజ్యాంగ హక్కులు తాకట్టు

కార్పొరేటు కంపెనీల లాభాలకు రైతుల్ని బలి చేసే వ్యవసాయ చట్టాలు

కమ్యూనిస్టు నీతే తన జీవన విధానం ఉద్యమకారుడు - "కొల్లి"

బాబా సాహెబ్ అంబేద్కర్ మార్క్స్ వాద మిత్రుడే

కేపిటలిజం గుట్టు!

మార్క్సిజం-సాంస్కృతిక-సిద్ధాంతాలు

జాతీయ **స్వారి** పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2020 అక్టోబర్ 1-31 సంపుటి : 29 సంచిక : 1,2

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

## ఈ సంచికలో...

4 సలలిత స్వర రాగ గంగా ప్రవాహమే బాలు - మాడభూషి శ్రీధర్
6 వైరస్‌లా మతవిద్వేషం - రాజ్‌దీప్ సర్దేశాయి
8 హిందూ పురాణాలన్నీ బుద్ధుడి తర్వాత రాసుకున్నవే! - డాక్టర్ దేవరాజు మహారాజు
11 అయోధ్య రాముడు గాంధీ రాముడేనా? - కొప్పర్తి వెంకటరమణమూర్తి
13 ఒక్కరికీ నిజం చెప్పే ధైర్యం లేదా? -మాడభూషి శ్రీధర్
15 కొత్త 'వ్యవసాయ' విపత్తులు! - వడ్డే శోభనాద్రీశ్వర రావు
17 కార్పొరేట్లకు రాష్ట్రాల రాజ్యాంగ హక్కులు తాకట్టు - సారపల్లి మల్లారెడ్డి
19 కార్పొరేటు కంపెనీల లాభాలకు రైతుల్ని బలి చేసే వ్యవసాయ చట్టాలు - డా॥ సోము
21 కమ్యూనిస్టు నీతే తన జీవన విధానం ఉద్యమకారుడు - అధ్యయనశీలి "కొల్లి" - టి.లక్ష్మీనారాయణ
30 బాబా సాహెబ్ అంబేద్కర్ మార్క్సువాద మిత్రుడే - ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా
34 కేపిటలిజం గుట్టు! - బి.ఎస్.రాజు
36 మార్క్సిజం–సాంస్కృతిక–సిద్ధాంతాలు - వి. విజయకుమార్
38 గ్రాంసీ వెలుగులో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై విశ్లేషణ - డి. సోమ సుందర్
41 రాష్ట్రంలో రాజకీయ ప్రయోగాలు ప్రత్యామ్నాయ ఆధిపత్య అన్వేషణ - ఎం.సి.వెంకటేశ్వర్లు

# బీహారు ఎన్నికలు ఏ దారి చూపిస్తాయి ?

**సంపాదకీయం**

బీహారులో ఎన్నికల సమరం ప్రారంభమైంది. తొలి దశ ఎన్నికలకు రెండు వారాల సమయం కూడా లేదు. నవంబరు 10న ఫలితాలు రానున్నాయి. ఈ ఎన్నికల మీద ప్రత్యేక ఆసక్తి ఉండడం సహజం. ఎందుకంటే బీహారు ఒక ఉత్తరాది రాష్ట్రం. 10 కోట్ల జనాభా వున్న రాష్ట్రం. 15 సంవత్సరాలుగా నితీష్ కుమార్ పాలనలో వున్న రాష్ట్రం. ఇప్పుడు బిజెపితో జతకట్టి ఎన్నికల బరిలోకి దిగిన రాష్ట్రం. అందువల్ల ఈ కూటమి జయాపజయాలు భవిష్యత్ భారత ఎన్నికల మీద తప్పనిసరిగా ప్రభావాన్ని చూపుతాయి.

15 ఏళ్లు పాలించిన నితీష్‌కుమార్ పార్టీకి ప్రజా వ్యతిరేకత ఉండడం సహజం. ఇటీవల జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అది స్పష్టంగా కనిపిస్తున్నది. మరో పక్క ప్రధాని మోదీ, ఆయన ఆరేళ్ల పాలన ఈ ఎన్నికల్లో పాత్ర వహించనుంది. నితీష్‌కుమార్ ఆశలన్నీ మోదీ సమ్మోహనం మీదే వున్నట్టు కనిపిస్తున్నది. దేశవ్యాపితంగా మోదీ సమ్మోహనం కొనసాగుతున్నా గతంలో రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో ఆ పార్టీ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో పరాజయం పాలైంది. అంటే రాష్ట్రాల ఎన్నికలను ప్రజలు ప్రత్యేకంగా చూస్తున్నారనడానికి ఇది నిదర్శనం మాత్రమే. అందుకే మోదీ జమిలి ఎన్నికల ద్వారా రాష్ట్రాల ప్రత్యేక తీర్పుల్ని వదిలించుకోవచ్చునని భావిస్తున్నారు. మరోపక్క మోదీ ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ బిల్లులపై రైతులలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. కోవిడ్ కాలంలో పేదల పట్ల, వలస కార్మికుల పట్ల అనుసరించిన వైఖరిపై నిరసనలు వెల్లువెత్తాయి. ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చెయ్యడం, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేయడం, మూకదాడుల అత్యాచారాలపై కఠినంగా వ్యవహరించకపోవడం, హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోవడం, ప్రశ్నించే వానిని శిక్షించే అప్రజాస్వామిక పద్ధతులను అనుసరించడం వగైరా ప్రజా వ్యతిరేక చర్యల నేపథ్యంలో మోదీ సమ్మోహనం ఎంత మిగిలిందీ ఈ ఎన్నికలు నిర్ధారించే అవకాశం వుంది. దీనికి తోడు బిజెపి కూటమిలో చీలికలు మొదలయ్యాయి. అకాలీదళ్ దూరం అయింది. ఇప్పుడు పాశ్వాన్ పార్టీ బీహారులో ప్రత్యేకంగా పోటీ చేస్తున్నది.

మరో పక్క బీహారులో ప్రతిపక్షాలు ఒక తాటి మీదకు వచ్చాయి. ఆర్.జె.డి, కాంగ్రెస్, వామపక్ష కూటమి మహాఘట బంధన్‌గా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. అందువల్ల ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న సంస్థలు ఇప్పుడూ ఎటూ చెప్పలేని స్థితిని వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల్లో జయాపజయాలను తేల్చేది ప్రజలు. బీహారులో వారి దైనందిన జీవితం దుర్భరంగా మారింది. అక్షరక్రమంలో ముందు వరసలో వున్న బీహారు, అభివృద్ధి క్రమంలో చివరి 5 రాష్ట్రాల సరసన వుంది. నిరుద్యోగం రేటు 46గా నమోదు చేసుకుంది. దీనికి తోడు ఇప్పుడు 25 లక్షల మంది వలస కార్మికులు ఇళ్లకు చేరుకున్నారు. వారి వెతల గాయాలు ఇంకా మానలేదు. కోవిడ్ కాలంలో బీహారులో ఆరోగ్య వ్యవస్థ గుట్టు రట్టు అయ్యింది. అతి తక్కువ కోవిడ్ పరీక్షలు నిర్వహించే రాష్ట్రంలో వైద్య సౌకర్యాలు అందించలేని రాష్ట్రంగా నమోదు అయ్యింది.

ఈ నేపథ్యంలో ప్రజలు కులతత్వ, మతతత్వ రాజకీయాల చుట్టూ తిరుగుతారా? లేక నిత్య జీవన సమస్యల పరిష్కారానికి కొత్తదారి తొక్కుతారా? అన్నదే నిజమైన అంశం. బీహారు ప్రజలు ఏ దారి చూపిస్తారో నవంబరు 10 వరకు వేచి చూడాల్సిందే. ❑

# ఆంటోనియో గ్రాంసీ 130 జయంతి

## గ్రాంసీ భావజాలాన్ని విశదీకరించే వ్యాసాలకు విజ్ఞప్తి

నవంబరు 1, 2020
జాతీయ స్ఫూర్తి
ప్రత్యేక సంచిక
*(Print Edition)*



2020 ఆంటోనియో గ్రాంసీ 130 జయంతి సంవత్సరం. గ్రాంసీ ఇటాలియన్ కమ్యూనిస్టు. మార్క్సిస్టు మేధావి. లెనిన్ సారథ్యంలో నడిచిన కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌లో సభ్యుడు. 1924 లో ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ముస్సోలినీ ఫాసిస్టు ప్రభుత్వం 1926లో అరెస్టు చేసింది. 11 సంవత్సరాల తర్వాత 1937లో జైలులోనే మరణించాడు. ఆయన జైలులో రాసిన నోట్‌బుక్స్‌లో కొన్ని భాగాలను 1970లో ఇంగిలీషులో "సెలెక్షన్స్ ఫ్రమ్ ప్రిజన్ నోట్ బుక్స్" ప్రచురణ తర్వాత గ్రాంసీ భావజాలం వెలుగు చూసింది. ప్రస్తుతం మార్క్స్ రచనల తర్వాత ప్రపంచ వ్యాపిత చర్చ గ్రాంసీ భావజాలం చుట్టూ జరుగుతున్నది. తన కాలపు ప్రపంచానికి మార్క్సిజాన్ని అన్వయించి దాని పరిధిని గ్రాంసీ విస్తరింపజేసాడు. ఆయన రాజ్యవ్యవస్థ మీద, పౌరసమాజం పాత్ర మీద పాలక వర్గాలు సాధించే హెజమనీ పద్ధతుల మీద చేసిన అధ్యయనం మనకు కొత్త దృష్టిని ఇస్తుంది. పాలక వర్గాల హెజమనీకి ప్రతిగా కౌంటర్ హెజమనీ సాధించే మార్గదర్శనం చేస్తుంది.

ఈ పరిశోధనలలో ఆయన రూపొందించిన Conceptsను తెలుగు పాఠకులకు పరిచయం చెయ్యడం కోసం జాతీయ స్ఫూర్తి ఈ ప్రత్యేక సంచికను ప్రచురించాలని తలపెట్టింది ఇక్కడ మేము సూచిస్తున్న కొన్ని Concepts మీద లేదా ఉపయుక్తమని మీరు భావించిన అంశం మీద వ్యాసాలు పంపవలసిందిగా కోరుతున్నాము.

మార్క్సిస్టు భావజాల స్రవంతులకు చెందిన రచయితల వ్యాసాలతో గతంలో జాతీయ స్ఫూర్తి ప్రచురించిన ఎంగెల్స్ ద్విశత జయంతి సంచికకు విశేష ఆదరణ లభించింది. మీరు ఒక వ్యాసాన్ని పంపించి గ్రాంసీ 130 జయంతి ప్రత్యేక సంచికను అర్థవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

గ్రాంసీ భావజాలాన్ని విశదీకరించే అంశాలపై తెలుగులో మీ వ్యాసాన్ని 2020 అక్టోబర్ 15 లోగా పంపించండి

### గ్రాంసీ భావజాలాన్ని విశదీకరించే కొన్ని అంశాలు

- The Modern Prince
- Hegemony and Counter Hegemony
- Integral State : Political Society +Civil Society
- The Historic Block
- Common Sense and Good Sense
- Traditional Intellectuals And Organic Intellectuals
- Base and Superstructure
- Role of Culture
- Education and Schooling
- War of Position and War of movement
- Gramsci at Margins, on Subalterns
- The Philosophy of Praxis
- Leaders and Masses
- Role of Ideology
- Journals and Media



# సలలిత స్వర రాగ గంగా ప్రవాహమే బాలు

మాడభూషి శ్రీధర్
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

బాలు పాటలు మాట్లాడుతాయి. ఆయన మాటలు పాటలై పలుకుతాయి. కొన్ని విశిష్టపాత్రల్లో బాలును చూస్తుంటే పాటల్లో, మాటల్లో ఎంత సునాయాసంగా భావాలు పలికించాడో ముఖంలో కూడా అంతే సునాయాసంగా భావాల్ని పలికించాడీ ఈ కళా మాంత్రికుడు అనిపిస్తుంది. అన్నమయ్యలో 'నిగమ నిగమాంత వర్ణిత మనోహర రూప నగరాజ ధరుడా శ్రీ నారాయణా' అన్న అన్నమయ్య కీర్తన బాలుకు అజరామరకీర్తిని తెచ్చిపెట్టింది. అన్నమయ్య తరువాత మళ్లీ బాలు రామదాసు చిత్రాన్ని, ''అంతా రామమయం ఈ జగమంతా రామమయం'' సహా అనేక భక్తరామదాసు కీర్తనలతో సుసంపన్నం చేశారు. "నను బ్రోవమని చెప్పవే" అని దైన్యాన్ని పలికించాడు బాలు. అటువంటి గాయకులు మళ్ళీ రారు.



ఆయన గళశ్రీపతి, సంగీత పండితారాధ్యుడు, మనసంతా బాలుడు, పాములను-పాపలను సైతం తలలాడింప చేసే సుబ్రహ్మణ్యం. బాలు సమధుర సుస్వర సురాధీశుడు. సలలిత స్వర రాగ గంగా ప్రవాహం. వెంటిలేటర్ ఆయన్ను బతికించలేదు, కళా వైవిధ్యం బతికించింది. ఎక్మో సాయం చేయలేదు. ఎక్కడికీ వెళ్లనీయక ఆ స్వరం అందరినీ కట్టిపడేసేది. తన పాట అవసరం లేదనుకున్న తెలుగు పెద్దతెరను సున్నితంగా పక్కకు బెట్టి, చిన్న తెరను సొంతం చేసుకున్న పెద్దమనిషి ఈ బాలుడు. పాడుతా తీయగా అంటూ లక్షలాది గాయక చిరుదివ్వెలను వెలిగించి ప్రపంచమంతా కోటానుకోట్ల కాంతులు నింపిన 'దివి సూర్య సహస్రస్య' ఆయన. ఒక్కొక్కరి పాటను ఆయన విశ్లేషించిన తీరు, ఒక్కొక్క స్వరాన్ని సవరించిన తీరు, ఒక్కొక్క వర్ధమాన గాయకుడిని భావి సంగీతజ్ఞుడిగా తీర్చిదిద్దిన తీరు, మరొకరికి రాదు. అది అనితర సాధ్యం, సంగీత సరస్వతికి ఆయన చేసిన నైవేద్యం. బాలు మెచ్చుకోలు బలంతో గొంతులు విప్పిన కోయిలలు ప్రపంచమంతా మధుర వసంతధ్వానాలు చేస్తున్నాయి, చేస్తుంటాయి.

ఘంటసాల పాడుతూ చనిపోవాలనుకున్నాడు. అదేవిధంగా తెలుగు సినీసీమలో తీయగా పాడుతూనే పోయిన వాడు. కాని తీయగా పాడాలని ఎందరికో స్వరాలు నేర్పుతూ తీయగా పాడుతూ ఉండగా, హాయిగా పోయిన వాడు బాలసుబ్రహ్మణ్యం.

'ఏ దివిలో విరిసిన పారిజాతమో ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో' అన్న దాశరథి గేయంతో మొదలైన బాలు స్వరపథయాత్ర "ఉచ్ఛ్వాస నిశ్వాసములు వాయలీనాలతో" మనోఫలకాల్లోకి, జనపథంలోకి నడిచింది. ''శివరంజనీ నవరాగిణీ'' అనీ "సాగర సంగమమే ఒక యోగం" అని ఘోషించింది ఆయన గొంతు. బాపు తీసిన త్యాగరాజు సినిమా కోసం అనేకానేక త్యాగరాజ కీర్తనలను అలవోకగా ఆలపించిన గొంతు అది. "మాటే రాని చిన్నదాని మనసు పలికే పాటలు" అంటూ పదానికి పదానికి మధ్యగానీ, చరణానికి పల్లవికీ మధ్యగానీ శ్వాసకు చోటులేని రాగస్రవంతిని అద్భుతంగా ప్రవహింపచేసిన గంధర్వుడు. "సిరిమల్లె నీవే" అంటూ శ్రోతల మనసుల్లో మల్లెల వాసనలు గుప్పించిన సంగీత జయంతవసంతుడు. ఘంటసాలతో గొంతు కలిపి "ప్రతిరాత్రీ వసంతరాత్రి ప్రతిగాలి పైరగాలి" అని పాడుతూ ఉంటే వెన్నెల రాత్రులలో పైరులు, ప్రియులూ ఊగిపోవలసిందే కదా.

"ఏ పారిజాతమ్ము లీయగలనో సఖీ గిరిమల్లికలు తప్ప గరికపూవులు తప్ప" అని ఏకవీర సినిమాకు సినారె రాసిన ప్రయోగ గేయానికి స్వరాన్నిచ్చిన స్వరధుని. ఆఖరిపోరాటం అనే సినిమాకు లతామంగేష్కర్ తెలుగులో మధురంగా "తెల్ల చీరకు తకధిమి తపనలు రేగెనమ్మ సందె వెన్నెల్లో" అని పాడితే ఆమెతో కలిసి అంత లేతగా 'సిరిమల్లె పూలకు సరిగమ ఘుమఘుమ తాకేనమ్మ సందె నవ్వుల్లో' అని తీయని స్వరాలూదిన వాడు బాలు. ఒకసారి రవీంద్రభారతిలో వేటూరి సుందరరామమూర్తికి సన్మానం చేసిన సభలో బాలు వేటూరి రాసిన పాటల పల్లవులెన్నో పాడి ఆ కవి చరణాల మీద పడిన తీరు మరిచిపోలేము. కళాతపస్వి విశ్వనాథ్ చాలా అభిమానించే గాయకుడు.

ఆయన సినీజీవన పయనం అనేకానేక వైవిధ్యపాత్రల్లో సాగింది. పాటతో పాటు బాలు అనేక బాటల్లో నడిచాడు. కమలహాసన్ డబ్బింగ్ తెలుగు సినిమాలకు బాలు గొంతు ఎంతగా నప్పేదంటే, కమల్ ఒకసారి సొంత గొంతుతో మాట్లాడినప్పుడు

శ్రోతలకు నచ్చనేలేదు. ఆయన పాటలు మాట్లాడుతాయి. ఆయన మాటలు పాటలై పలుకుతాయి. కొన్ని విశిష్టపాత్రల్లో బాలును చూస్తుంటే పాటల్లో, మాటల్లో ఎంత సునాయాసంగా భావాలు పలికించాడో ముఖంలో కూడా అంతే సునాయాసంగా భావాల్ని పలికించాడీ ఈ కళా మాంత్రికుడు అనిపిస్తుంది. అన్నమయ్యలో 'నిగమ నిగమాంత వర్ణిత మనోహర రూప నగరాజ ధరుడా శ్రీ నారాయణా' అన్న అన్నమయ్య కీర్తన బాలుకు అజరామరకీర్తిని తెచ్చిపెట్టింది. అన్నమయ్యలో బాలు విశ్వరూపం తెర వెనుక కనిపిస్తుంది. శ్రీ వేంకటేశునికి బాలు గొంతు ఇచ్చి పలికిన తీరు ఒక అద్భుతం. అన్నమయ్యకు అడ్డుతగిలి అతన్ని మార్చిన యతిగా, పెళ్లికి ఒప్పించిన కోయదొరగా, పెళ్లి చేయించిన పురోహితుడిగా, వేంకటేశుడిగా సుమన్ పాత్రకు తన స్వర వైవిధ్యంతో వన్నె తెచ్చిన మాటగాడు ఈ పాటగాడు.


నేను ఒకసారి బెంగుళూరు విమానాశ్రయంలో బస్సులో ఆయనతో పాటు కూర్చున్నపుడు మాట కలిపాను. అన్నమయ్య పరాకాష్ఠ సన్నివేశంలో 'అంతర్యామి అలసితి సొలసితి' అన్న పాటకు ముందూ వెనుక, పాట సాగే సమయంలో బాలు అన్నింటా తానై భాసిల్లుతాడు. వెంకటేశునికి బాలు మాట్లాడిన మాటలతో అన్నమయ్యకు బాలు పాడిన పాట పోటీ పడే సన్నివేశం అది. ఆ విషయం గుర్తు చేస్తే, బాలు ఎంతో పొంగిపోయారు. అన్నమయ్య సినిమా క్లైమాక్స్ దృశ్యానికి నా విశ్లేషణ, మొత్తం సినిమాకు అది మణికిరీటం అన్న నా వ్యాఖ్య బాలుకు బాగా నచ్చింది. "మీ పాట గొప్పదే కాని పాట కన్న మీ మాట చాలా బాగుంటుందండీ" అని నేను అంటే ఆయన ఎంతో ఆనంద పడిపోయి నాకు మిత్రుడైపోయారు. నేను ఇంకో మాట అన్నాను. కన్నడసీమలో మీ పాటలకు తెలుగునాట ఉన్న దాని కన్న మిన్నగా ఆదరణ, అభిమానం ఉందంటే ఆయన అవునని అనేక దృష్టాంతాలు చెప్పారు. తమిళసీమలో కూడా తనకు అంతే ఆదరణ ఉందని చెప్పారు. మీ సినీయాత్రలో అన్నమయ్య గొప్ప మజిలీ అని, మీ ప్రతిభకు తగిన అవకాశాన్ని రాఘవేంద్రరావు ఇచ్చారన్న నా మాటను మనఃస్ఫూర్తిగా అంగీకరించి నాతో చేతులు కలిపారు. ఎయిర్‌పోర్ట్ దాటే దాకా ఒక అరగంట సేపు నాతోనే మాట్లాడుతూ ఉండిపోయారు. ఆ దృశ్యాలు ఇప్పుడే జరుగుతున్నట్టు నాకు అనిపిస్తూ ఉంటుంది. అన్నమయ్య సినిమా దిగ్విజయానికి అనేక దిగ్గజాలు కారణం కావచ్చు. కాని బాలు పాట, మాట ఆ సినిమాకు కొండంత బలం.

అన్నమయ్య తరువాత మళ్లీ బాలు రామదాసు చిత్రాన్ని, "అంతా రామమయం ఈ జగమంతా రామమయం" సహా అనేక భక్తరామదాసు కీర్తనలతో సుసంపన్నం చేశారు. "నను బ్రోవమని చెప్పవే" అని దైన్యాన్ని పలికించాడు బాలు. 70 ఏళ్ల పైబడిన తరువాత కూడా స్టేజీ మీద, అనేకానేక స్వరాలు పలికిస్తూ మిమిక్రీ చేస్తూ అంతులేని కథ సినిమాలో "తాళికట్టు శుభవేళ" అనే తన అద్భుతమైన పాట తానే పాడుతూ ఉంటే ఎంత ఆశ్చర్యం. వయసు కనబడదు, బాలుడే అనిపించేది. పాత్రకు పాత్రధారికి అనుగుణంగా మారుస్తూ బాలు ఎన్టీరామారావుకు అక్కినేని నాగేశ్వరరావుకు గొంతునిచ్చినా శోభన్‌బాబుకు, కృష్ణకు ఒకే పాటలో గొంతు మార్చినా ఆయనకే చెల్లింది.

పాటల్లో రాటుదేలుతున్నప్పుడే ఆయన చిన్నచిన్న పాత్రల్లో కనిపించి నటుడుగా ఎదిగాడు. దక్షిణాది ప్రేమికుడు ఉత్తరాది ప్రియురాలు మధ్య ప్రేమకథ ఇతివృత్తంగా మరోచరిత్ర సినిమా ఆధారంగా 'ఏక్ దూజే కే లియే' అనే హిందీ సినిమా తీశారు. ఆ హీరోకు బాలు గొంతు ఎంతగానో అమరింది. దక్షిణాది యాసతో బాలు పాడిన హిందీ పాట "తెరే మేరే బీచ్ మే కైసాహై ఎ బంధన్ అంజానా..." మొత్తం భారతదేశాన్ని అప్పట్లో ఊపేసిన పాట.

తనికెళ్ల భరణి ప్రయోగ చిత్రం 'మిథునం'లో బాలు ప్రతిభను చూడవచ్చు. అద్భుతః అనే మాటను తెలుగు నాట ప్రతినోటా నిలిపిన సినిమా అది. లక్ష్మితో కలిసి జంటగా ఆయన పాత్ర అద్భుతః. పిల్లలు అమెరికాలో ఉంటే తెలుగును, సంప్రదాయాన్ని కాపాడుతూ ఒంటరిగా బతికే జంట కథ అది. చాలా గొప్ప ప్రక్రియ. బాలు ఆ సినిమాకు జీవం పోశాడు.

బాలు వంటి గాయకులు మళ్లీ రారు. హాస్పటల్‌కు వెళ్లే దాకా బాలు గొంతు నానాటికీ అతిశయిల్లుతూనే ఉంది. మాధుర్యం అసలు తరగలేదు. కాని తెలుగు సినిమా నిర్మాతలు, దర్శకులు ఆయన ప్రతిభకు తగిన పాటల సన్నివేశాలు కల్పించక పోవడం, ఆయనతో పాడించకపోవడం బాధాకరం. అంతటి మహాగాయకుడితో ఎందుకు పాడించుకోలేదో అర్థం కావడం లేదు. కాని సమయానికి ఈటీవీ బాలుకు సరైన వేదిక కల్పించింది. ఆ చిన్నతెరను ఆయన లలిత సంగీత విశ్వ విద్యాలయంగా తీర్చిదిద్దారు. ఎందరో చిన్నారులు అక్కడ పాటకు 'పట్టా'భిషేకం చేసుకున్నారు. యువకులు గాయకులుగా ఎదిగారు. ఇవ్వాళ ఆయన స్వయంగా పాడుతూ, మాట్లాడుతూ రూపొందించిన వేలాది వీడియోలు యూట్యూబ్‌లో అందరికీ అందుబాటులో ఉంటూ బాలును ఒక్క క్లిక్‌తో సజీవంగా సాక్షాత్కరింపజేసే సాధనాలుగా మిగిలి ఉన్నాయి. సినిమాలో ఆయన పాటకు మరెవరో కనిపిస్తారు కానీ, స్వరాభిషేకం కార్యక్రమాల్లో సొంతంగా పాడుతూ బాలు మనకు ప్రతిపాటలో పలకరిస్తారు. బాలు ఈ లోకంలో లేకపోయినా ఆయన పాటలతో మాటలతో జనం పులకరిస్తారు. ❑



# వైరస్‌లా మతవిద్వేషం

**రాజ్‌దీప్ సర్దేశాయి**
సీనియర్ జర్నలిస్ట్

భిన్న మతాలవారి మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టడం ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నించే 'వార్తా వర్తకుల'పై సత్వరమే కఠినచర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం అలా వ్యవహరించినప్పుడు మాత్రమే మన జాతి జీవనంలో శాంతి సామరస్యాలకు ముప్పుగా పరిణమిస్తున్న వైరస్‌ను నిర్మూలించ డానికి ఒక వ్యాక్సిన్‌ను మనం కనుక్కోవడం సాధ్యమవుతుంది.

కరోనా విలయం ముగిసేదెన్నడు? మనలను సతాయిస్తున్న, హైరానా పెడుతున్న, భీతావహులను చేస్తున్న వైరస్ కరోనా ఒక్కటేనా? కానే కాదు. విద్వేషం అనే విషక్రిమి మన మనస్సులకు సోకుతోంది. మన ఆలోచనలను కలుషితం చేస్తోంది. సామాజిక మాధ్యమాలు కాంతి వేగంతో ఆ విషక్రిమిని వ్యాపింపచేస్తున్నాయి. విద్వేషాన్ని మనం శ్వాసిస్తున్నాం, చూస్తున్నాం, వింటున్నాం! కాదంటారా? నిష్కళంక సంఘ సేవకుడు, నిర్మల ఆధ్యాత్మికశీలి స్వామి అగ్నివేశ్ కొద్దిరోజుల క్రితం మరణించిన వేళ ఆయన గురించి విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎన్.నాగేశ్వరరావు ఏమన్నారో గుర్తు చేయనా? 'పీడ వదిలిపోయింది సుమా... నువ్వు కాషాయ వస్త్రాలు ధరించిన హిందూ వ్యతిరేకివి. హిందూ మతప్రతిష్ఠకు అపరిమిత నష్టం కలిగించావు. నువ్వు ఒక తెలుగు బ్రాహ్మిణ్‌గా పుట్టినందుకు నేను సిగ్గుపడుతున్నాను. నీకు యమపాశం విసరడానికి యమధర్మరాజు ఇంతకాలం ఎందుకు వేచిఉన్నాడో?! ఆయన చేసిన జాప్యం అనుచితమైంది. అది నన్ను ఎంతో బాధించింది. ఎట్టకేలకు మృత్యుదేవర నిన్ను తీసుకువెళ్ళాడు. చాలా సంతోషం'. సంతోషమా? తోటి వ్యక్తి చనిపోతే సంతోష పడడమా? మన సంఘంలో మానవతా సంస్కారం ఇంకా వర్ధిల్లుతోంది. కనుకనే నాగేశ్వరరావు ట్వీట్ పట్ల నిరసనలు వెల్లువెత్తాయి. అంతిమంగా ఆ ప్రమాదకర వ్యాఖ్యలను ట్విటర్ ఉపసంహరించుకోక తప్పలేదు.

నాగేశ్వరరావు ఒక సాధారణ పోలీసు అధికారి కాదు. 2018లో ఆయన సిబిఐ యాక్టింగ్ డైరెక్టర్‌గా నియమితు లయ్యారు. గత జూలైలో విశ్రాంత జీవితంలోకి ప్రవేశించే ముందు ఫైర్ సర్వీసెస్, హోంగార్డ్స్ విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. వివిధ బాధ్యతాయుతమైన పదవులను నిర్వహించిన వ్యక్తి అటువంటి ద్వేషపూరిత వ్యాఖ్య చేయడం, బహుశా, మన కాలం ధోరణులను ప్రతిబింబిస్తుందని చెప్పక తప్పదు. రాజ్యాంగానికి నిబద్ధమై ఉంటామని ప్రమాణం చేసినవారూ, శాంతిభద్రతలను సమతుల్యంగా కాపాడేందుకు సాధికారత పొందినవారూ తమ విధ్యుక్తధర్మ నిర్వహణలో విద్వేష భావజాలంతో వ్యవహరించడం సబబేనా? స్వామి అగ్నివేశ్ లాంటి ఉదాత్తవ్యక్తులను తూలనాడడం తగునా? మరింత ఘోరమైన విషయమేమిటంటే అగ్నివేశ్ గురించిన వ్యాఖ్యల విషయమై నాగేశ్వరరావులో పశ్చాత్తాపం ఏ కోశానా లేకపోవడం. పైగా తన విద్వేష వ్యాఖ్యలను ఆయన పూర్తిగా సమర్థించుకున్నారు.

నాగేశ్వరరావు ట్వీట్, అటువంటి ట్వీట్ మరొక దాన్ని గుర్తుకు తెచ్చింది. 2017లో పాత్రికేయురాలు గౌరీలంకేశ్‌ను గుర్తు తెలియని దుండగులు హతమార్చిన సందర్భంలో వైరల్ అయిన ట్వీట్ అది. సూరత్‌కు చెందిన వ్యాపారి నిఖిల్ దధీచ్ చేసిన ట్వీట్ అది. 'ఒక దుష్టురాలు కుక్క చావు చచ్చింది, ఆమె మరణం పట్ల ఇప్పుడు అందరూ ఒకే రాగంలో రోదిస్తున్నారు'. అనేది ఆయన ట్వీట్ ఇదొక ఆమోదరహిత, అసహ్యకర వ్యాఖ్య అనడంలో సందేహం లేదు. సాధారణంగా అయితే ఈ ట్వీట్ ఎవరి దృష్టికి వచ్చి ఉండేది కాదు. కానీ ఒక ఇబ్బందికరమైన సత్యం ఆ ట్వీట్‌ను విశాల ప్రపంచం దృష్టికి తీసుకువెళ్ళింది. నిఖిల్ ట్వీట్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ సదా అనుసరిస్తూ ఉంటారట! నిఖిల్ సైతం తన వ్యాఖ్యలకు ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. క్షమాపణలు చెప్పలేదు. ప్రధానమంత్రి అంతటి వ్యక్తి తన ట్వీట్‌లను అనుసరిస్తుండడం తనకెంతో 'గర్వకారణ'మని నిఖిల్ చెప్పుకొచ్చాడు.

నాగేశ్వరరావు, నిఖిల్ లాంటి వారు ఇంకా చాలా మంది ఉన్నారు. అజ్ఞాత ట్విటర్ హేండెల్స్, ఫేస్‌బుక్ పోస్ట్‌లు, వాట్సాప్ గ్రూపులు వేల సంఖ్యలో ఉన్నాయి. ఇవన్నీ వ్యక్తుల మధ్య, విభిన్న మతవర్గాల మధ్య తీవ్ర పగ, ప్రతీకారాగ్నులు రెచ్చగొట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నవే కావడం గమనార్హం. బహిరంగ వేదికల

ముసుగులో సామాజిక మాధ్యమాల జగత్తు సొంత ప్రవర్తనా నియమావళిని సృష్టించుకుంది. ఆ నియమావళిలో వాక్ స్వాతంత్ర్యానికి, విద్వేష ప్రసంగాలకు మధ్య రేఖలు అస్పష్టమై పోయాయి. ఈ సామాజిక మాధ్యమాల వేదికలు మన కాలం 'డిజిటల్ ఫ్రాంకెన్ స్టైయిన్స్ 'అని నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ 'ది సోషల్ డైలమా' వ్యాఖ్యానించింది. ఈ నీతిబాహ్య మృగాలు సామాజిక మాధ్యమాల చిట్టడవిలో ఉన్మాదంతో వ్యవహరిస్తూ విద్వేషాన్ని, విభజనలను రెచ్చగొట్టేందుకు సకల నిబంధనలను కాలరాచివేస్తున్నాయని కూడా ఆ డాక్యుమెంటరీ ఫిల్మ్ వ్యాఖ్యానించింది.

సామాజిక మాధ్యమాలలో అవధులు లేకుండా వ్యక్తమవుతున్న విద్వేషం నిరంతరాయంగా వార్తాప్రపంచానికి సంక్రమిస్తోంది. కనుక విద్వేషాగ్నులను రెచ్చగొడుతున్న పాపం సామాజిక మాధ్యమాలది మాత్రమే అని భావించడం సరికాదు. అలా భావించడమంటే విద్వేష వైరస్ స్వభావాన్ని అర్థం చేసుకోకపోవడమే. విద్వేషం ఒక భయంకర సాంక్రమిక వ్యాధి. ఇటీవలి సంవత్సరాలలో సంభవించిన పరిణామాలు ఈ విషయాన్ని నిరూపించాయి. మైనారిటీ వర్గాల, ముఖ్యంగా మత మైనారిటీల వ్యతిరేక రాజకీయ సందేశాలు సామాజిక మాధ్యమాల ద్వారా సర్వత్రా వ్యాపిస్తున్నాయి. ఇదొక నిత్య వ్యవహారమై పోయింది. భారతీయ ముస్లింలు జాతి–వ్యతిరేకులు అనే కథనాన్ని అధికార శ్రేణులలోని ఒక వర్గం ఉద్దేశపూర్వకంగా, పదే పదే ప్రచారంలో పెడుతోంది. సదరు ప్రచారం ద్వారా ఆ కథనం ఒక విశ్వసనీయతను సంతరించుకోగలదని ఆ పాలక కులీనులు భావిస్తున్నారు. తరచు వివాదాస్పద వ్యాఖ్యలు చేసే కేంద్రమంత్రి ఒకరు ఒక ఎన్నికల సభలో 'దేశ్ కె గద్దరోన్ కో' అని బిగ్గరగా అన్నప్పుడు 'గోలీ మారో సాలోం కో' అని జనం మహోద్రేకంతో ప్రతిస్పందించారు. అయినప్పటికీ అధికార పార్టీ పెద్దలు, అటువంటి ఉద్రిక్తతలను సృష్టించకుండా ఆ మంత్రిని నిరోధించేందుకు శ్రద్ధ చూపనే లేదు. అలాగే పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసనకారులను, వారు ధరించిన వస్త్రాల ఆధారంగా గుర్తించడమూ, అక్రమ వలసకారులను 'చెద పురుగులు'గా, తబ్లీఘీలను 'కరోనా వాహకులు'గా ప్రస్తావించడమూ మత దురభిమానాలను నిస్సిగ్గుగా రెచ్చగొట్టే ప్రయత్నాలలో భాగమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత, మతోన్మాద కథనాలు ఎంతగా సాధారణ వ్యవహారాలు అయిపోయాయో ఇటీవలి సుదర్శన్ టీవీ కేసు ఉదంతం విశదం చేసింది. సివిల్‌సర్వీస్‌లలో అత్యధికంగా ప్రవేశించే లక్ష్యంతో జరిగిన ఒక 'ముస్లిం కుట్ర' గురించిన నిశిత దర్యాప్తుపై ఆ టీవీ ఛానెల్ రూపొందించిన కార్యక్రమాలకు సంబంధినదే ఆ కేసు. ఆ కార్యక్రమాల ప్రమోషనల్ వీడియోను 'యుపి ఎస్ సి జిహాద్'అనే విద్వేషపూరిత నినాదంతో ప్రచారంలో పెట్టారు. ముస్లింలను అపఖ్యాతి పాలు చేసేందుకు ఉద్దేశించిన ఆ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వెనువెంటనే చర్య తీసుకోకపోగా వాటి ప్రసారానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. ఆ కార్యక్రమాలను ప్రీ–సెన్సార్ చేసే ఉద్దేశం తమకు లేదనే వాదనతో వాటి ప్రసారానికి సమ్మతించింది. అయితే భిన్న మతవర్గాల వారి మధ్య విద్వేషాన్ని, దుర్భావాలను పెంపొందించే కార్యక్రమాలను నిషేధించాలని టీవీ కార్యక్రమాల నిబంధనావళి నిర్దేశించింది. అయినప్పటికీ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఈ నిబంధనను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇదెంతవరకు సబబు? మతాలు, సామాజిక సమూహాలపై దాడుల దృశాలు, లేదా మతతత్వ వైఖరులను పెంపొందించే దృశ్యాలు, సంభాషణలు ఉన్న కార్యక్రమాలను నిషేధించాలని కూడా ఆ నిబంధనావళి స్పష్టంగా నిర్దేశించింది. నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ సుదర్శన్ టీవీ కార్యక్రమాలను నిషేధించడంపై సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఒక కచ్చితమైన నిర్ణయం తీసుకోలేకపోయింది. ఫలితంగా ఆ కార్యక్రమాల ప్రసారంపై ఆంక్షలు విధించేందుకు తొలుత ఢిల్లీ హైకోర్టు, ఆ తరువాత సుప్రీం కోర్టు రంగ ప్రవేశం చేయవలసివచ్చింది.

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా క్రమబద్ధీకరణకు తగిన విధానాలు ఉన్నాయని, ఒక సరికొత్త క్రమబద్ధీకరణ విధాన రూపకల్పనకు మార్గదర్శక సూత్రాలను నిర్దేశించదలుచుకుంటే డిజిటల్ మీడియా, న్యూస్‌పోర్టల్స్ విషయమై తొలుత శ్రద్ధ చూపాలని సర్వోన్నత న్యాయస్థానానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నివేదించడం ఒక ఆసక్తికరమైన విషయం. టీవీ కార్యక్రమాల నిబంధనావళిని ఘోరంగా ఉల్లంఘించిన ఒక ఛానెల్‌పై తన అధికారాలను ఉపయోగించలేని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అసలైన సమస్య విశృంఖలమైన, అరాచక డిజిటల్ మీడియా ప్రపంచంలో ఉందని సుప్రీంకోర్టుకు చెప్పడం. బహుశా,

☞ మిగతా 10వ పేజీలో

# హిందూ పురాణాలన్నీ బుద్ధుడి తర్వాత రాసుకున్నవే!

డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్



ఎరుక బ్రహ్మ మనియె యిల శంకరార్యులు
తెలివి బ్రహ్మమనుచు దెలిపె వ్యాసు
లెరుక తెలివి రెంటి నెరుగడు వేమన
విశ్వదాభిరామ వినురవేమ!

ఇది విశ్వాసాల యుగం కాదు. వాస్తవాల యుగం నిజ నిర్ధారణల యుగం. అన్వేషించి, శోధించి, సాధించే యుగం. వైజ్ఞానికంగా అన్నింటికీ అన్ని సాక్ష్యాధారాలు సంపాదించుకోగల యుగం. అబద్ధాల పొరలు తొలగిపోయి, నిజాలు ప్రకాశిస్తున్న కొద్దీ మనిషి వివేకం పెరుగుతూ వస్తోంది. “ఉపనిషత్తులు, వేదాలు, పురాణాలు అన్నీ భగవదనుగ్రహంతో ఈ మానవజాతికి అందాయి” అని చెప్పే కట్టుకథలకు ఆధారాలు లేవు. కామన్ ఎరాకు ముందు కాలాన్ని Divatashitiva Jasiaasia Jutiaగా, ఆ తర్వాత కాలాన్ని Jasiaasia Jutia గా మనం విభజించు కున్నాం. దీన్నే లోగడ క్రీ.పూ – క్రీ.శ. అని వ్యవహరించే వాళ్ళం. దాని ప్రకారం జీవ పరిణామం ఏర్పడి మనిషిగా రూపొందిన నాటి నుంచి నేటి వరకు ప్రపంచంలో జరుగుతూ వచ్చిన సామాజిక, చారిత్రక, రాజకీయ, ధార్మిక అంశాలనన్నింటినీ దాదాపు ఖచ్చితంగా బేరీజు వేసుకోగలుగుతున్నాం. ఇక మన దేశానికి మాత్రమే పరిమితమై చూసుకుంటే కాలాన్ని ఐదు విభాగాలుగా చేసుకోవచ్చు.

1. సింధూ నాగరికతకు, పూర్వకాలం (3300 బీసీఈకి పూర్వం)

2. సింధూ నాగరికత కాలం (3300–1300 బీసీఈ)

3. అంధకార కాలం (1300–563 బీసీఈ)

4. బౌద్ధుల కాలం (563–480 బీసీఈ)

5. బ్రాహ్మణవాద ప్రారంభ కాలం (700–750 బీసీఈ).

హరప్పా, మొహంజోదారోలో దొరికిన ఆధారాలు సింధూ నాగరికతను తేటతెల్లం చేశాయి.

సింధూనాగరికతకు, బుద్ధుడి కాలానికి మధ్య చాలా కాలం గడిచిపోయింది. దాన్ని చరిత్రకారులు అంధకార కాలంగా గుర్తించారు. ఎందుకంటే ఆ కాలానికి సంబంధించిన ఏ ఆధారమూ ఇప్పటి వరకు దొరకలేదు. తర్వాత వచ్చింది బుద్ధుడి కాలం. మనకు తవ్వకాల్లో లభించిన శిల్పాలు, స్థూపాలు, ఆరామాలు, గుహలు వంటి ఆధారాలన్నీ బుద్ధయుగానికి సంబంధించినవే. తర్వాత బ్రాహ్మణవాద యుగం ప్రారంభమైంది. బుద్ధుడి ఆరామాలు విగ్రహాలు మార్చి మార్చి ఏ విధంగా హిందూ ఆలయాలుగా, దేవతా విగ్రహాలుగా ప్రకటించుకున్నారో చరిత్ర చెపుతూ ఉంది. వాటి ప్రకారం హిందూ పురాణాలు ఎప్పుడు రాయబద్ధాయన్న దానికి ఆధారం దొరికింది.

హిందువుల వేదాలు 1700–1100 బీసీఈ ప్రాంతంలో, ఉపనిషత్తులు 1250–600 బిసీఈ మధ్యలో రాయబద్ధ తర్వాత.. జైన తీర్థంకరుడు మహావీరుడు 599–527 బీసీఈ మధ్య కాలంలో జీవించాడు. గౌతమ బుద్ధుడు 563–480 బీసీఈ మధ్య కాలంలో జీవించాడు. తర్వాత చాలా కాలానికి మౌర్య సామ్రాజ్యం విస్తరించింది (322–180 బీసీఈ). అశోకచక్రవర్తి 250 బీసీఈ ప్రాంతంలో రాజ్యమేలాడు. బౌద్ధాన్ని స్వీకరించి, దానికి విస్తృత ప్రచారం తీసుకొచ్చాడు. ఇప్పటికీ మన ప్రభుత్వ చిహ్నంగా ఉన్న ధర్మచక్రం ఆయనదే. దేశంలో బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, కట్టడాలు ఎన్నో కట్టించాడు. తర్వాత వచ్చిన మౌర్యవంశపు రాజులు కూడా ఆ పనిని కొనసాగించారు.

అలా బౌద్ధం మనదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ వెయ్యి సంవత్సరాల పాటు కొనసాగింది. ప్రజాదరణ తగ్గినా ఆ జీవన విధానం ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. ఇక పురాణాల విషయానికొస్తే – అన్నీ బుద్ధుడి తర్వాతనే రాయబద్ధాయి. అంటే ఇప్పటికి 1600–500 సంవత్సరాలకు పూర్వం మాత్రమే రాయబద్ధాయి. అందులో మార్పులు, చేర్పులు, కూర్పులు వంటి వెన్నో ఆ మధ్య కాలంలో చేయబడుతూ వచ్చాయన్న విషయం ప్రసిద్ధ చరిత్ర కారులంతా ధృవపరిచారు. మార్కండేయ పురాణం 400–500 సీఈ (క్రీ.శ) రాయబడితే, కూర్మ పురాణం 500–600 సీఈలో, వామన పురాణం 700 సీఈలో రాయబద్ధాయి. నారదపురాణం 700–800 సీఈలో అగ్ని పురాణం 700–1100

సీఈలో రాయబద్ధాయి. ఇక భవిష్య, బ్రహ్మ, వైవర్త పురాణాలు కేవలం 520 సంవత్సరాలకు పూర్వం అంటే 1500 సీఈలో రాయబద్ధాయి.

భారతదేశ చరిత్ర అంటే – చొరబాటుదారు లెవరెవరూ? వారి వారి రాజ్యస్థాపనలు ఎలా జరిగాయి? ఎంతెంత కాలం పరిపాలించారు – అనేది మాత్రమే కాదు, బహు ముఖాలుగా విస్తరిస్తూ వచ్చిన భారతీయ కళలు, సాహిత్యం, నిర్మాణాలు, మతాలు, నైతిక విలువలు. వీటన్నిటికీ వెన్నెముకగా నిలిచిన భారతీయ వైజ్ఞానిక ఆలోచనా ధోరణులు కూడా పరిశీలించాల్సి ఉంటుంది. రాజకీయపరంగా ఒకప్పుడు గ్రీకులు, హుణులు, పఠాన్లు, మొగలులు, బ్రిటిషర్లు ఈ దేశాన్ని ఆక్రమించారు. నిజమే! కొందరు జనరంజకంగా కూడా పరిపాలించారు. అయినా కూడా ఇక్కడి ప్రజల హృదయ సామ్రాజ్యాన్ని పూర్తిగా గెలుచుకోలేక పోయారు. అందుకే ఈ దేశంలో ఎన్నో ధర్మాలు, ఎన్నో విశ్వాసాలు, ఎన్నో సంస్కృతులు, సంప్రదాయాలు ఏకకాలంలో విలసిల్లుతూ వచ్చాయి.

ఒకప్పుడు బౌద్ధం వ్యాపించి ఉన్న రోజుల్లో వైదిక ధర్మం లేకుండా పోలేదు. ఇప్పుడు దేశంలో హిందువులు సంఖ్యాపరంగా అధికులైనంత మాత్రాన ఇస్లాం, క్రైస్తవ సిక్కు, జైన మతస్థులు లేకుండా పోలేదు. ఏది ఏమైనా, దేశం సమైక్యంగా ఉంటూ వచ్చిందన్నది చారిత్రక సత్యం!

హిందూ సంస్కృతి అతి పురాతనమైనదే కాని, అంతకన్నా పురాతనమైన సంస్కృతులు ప్రపంచంలో కొన్ని ఉన్నాయన్నది మరువకూడదు. ఆది శంకరుడు అద్వైతానికి రూపకల్పన చేసిన తర్వాతనే, హిందూ అంటే వైదిక సంస్కృతి బాగా విస్తరించింది. ఆది శంకరుడు (700–750సీఈ) దక్షిణ భారతదేశంలోని కేరళ–కొచ్చి ప్రాంతంలో జన్మించాడని చెపుతారు. అయితే ఆయన జీవించిన కాలం కచ్చితంగా నిర్ధారణ కాలేదు. కాని, అది చాళుక్యులు పరిపాలించిన కాలం అని తెలుస్తోంది. అప్పటికి ఉచ్ఛస్థితిలో ఉన్న బౌద్ధాన్ని నాశనం చేయడానికి ఆయన తన సర్వశక్తుల్ని ఒడ్డారు. బౌద్ధం ఆత్మ లేదని చెపితే, ఈయన ఉందని ప్రతిపాదించాడు. బౌద్ధం దేవుడు లేడని అంటే ఈయన ఉన్నాడని వాదించాడు.

బౌద్ధరచనలు, బోధనలు పాళి భాషలో సాగుతూ ఉంటే, ఈయన వైదిక మత ప్రచారం సంస్కృతంలో ప్రారంభించాడు. వేదాల, ఉపనిషత్తుల, భగవద్గీతల సారాంశాన్ని దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తూ, భారత ఉప ఖండమంతా ప్రయాణించాడు. 'మీమాంస–అనేది ప్రచారంలోకి తెచ్చాడు. బౌద్ధం నిర్వాణ (LIBERATION) అని అంటే, ఈయన 'మోక్షం' అని అన్నాడు. వేదాలలో, ఉపనిషత్తులలో ఉన్నవన్నీ 'ఆప్తవచనాలే' అని అన్నాడు. అదంతా గొప్ప 'జ్ఞాన సంపద' అని చెప్పాడు. చివరకు నేటి ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో కన్ను మూశాడు. తర్వాత కాలంలో తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో రామానుజుడు (1017–1137సి.ఈ) రంగం మీదికి వచ్చాడు. శ్రీవైష్ణవంలో అతి ముఖ్యమైన 9 రచనలు చేశాడు. అందులో గీతాభాష్యం, శ్రీభాష్యం, వేదార్థ సంగ్రహం, వేదాంత సారం, నిత్య గ్రంథం, శ్రీ వైకుంఠ గద్యం, శ్రీరంగ గద్యం వంటివి ఉన్నాయి. రచనలకు, బోధనలకు ఈయన సంస్కృత భాషనే వాడాడు. వేదాంతాన్ని, వైష్ణవైద్వైతాన్నీ ప్రచారం చేస్తూ సుదీర్ఘకాలం 120ఏండ్లు జీవించి, చివరకు శ్రీరంగంలో కన్నుమూశాడు.

శంకరాచార్య ఆరాధ్యదైవం శివుడయితే, రామానుజాచార్య ఆరాధ్య దైవం విష్ణువు. ఈ రెండువాదాలు వైదిక ధర్మంలోంచి వెలువడినవే అయినా, పూజించే దేవుళ్ళు వేరు కావడం వల్ల రెండుగా చీలిపోయిన వీరి అనుయాయుల మధ్య.. హొరాహోరిగా కొట్లాటలు జరిగేవి. చరిత్రకారుడు నీలకంఠ శాస్త్రి ఈ విషయాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

ఆది శంకరాచార్యుని మించిన గురువు, వేదాంతి మరొకరు లేరని హిందువులు భావిస్తారు. కాని ప్రాచీన భారత చరిత్ర – సంస్కృతులపై పరిశోధనలు చేసిన వారి అభిప్రాయం వేరుగా ఉంది. ఆయన జీవించి ఉన్న కాలం కన్నా ఆయన మరణం తర్వాత అంటే దేశంలో మొగలులు ప్రవేశించిన 14వ శతాబ్దం తర్వాత – ఆయన జీవిత చరిత్రలు విరివిగా రాయబద్ధాయి. ఆదిశంకరుడి తర్వాత, ఆయన స్థానానికి వచ్చిన వారినందరినీ శంకరాచార్యగానే భావించేవారు. అందువల్ల ఆ జీవిత చరిత్రలు ఎవరివన్నది కచ్చితంగా తెలియదు. జ్యోతిర్ పీఠం (ఉత్తరం) శారదాపీఠం (పడమర) గోవర్ధన పీఠం (తూర్పు) కంచిపీఠం, బద్రి వంటి పీఠాల నిర్వహణ బాధ్యతలు చేపట్టే వారిని ఇప్పటికీ శంకరాచార్య అనే పిలుస్తున్నారు. అందుకే తొలి శంకరాచార్యను ఆది శంకరాచార్య అని సంభోదిస్తారు.

వీరు కర్మసిద్ధాంతాన్ని, వర్ణాశ్రమ ధర్మాన్ని, పంచాయతన పూజను పూర్తిగా సమర్థించారు. పంచాయతన పూజ అంటే – ఐదుగురు దేవుళ్ళను ప్రార్థించడం. విష్ణు, శివుడు, దుర్గ, సూర్యుడు, గణేషుడు. ఇందులో ఎవరో ఒకరిని మాత్రమే ఎంచుకుని పూజించుకోవచ్చు. దాన్ని ఇష్టదేవత – కుల దేవత అని అన్నారు.

వీరిలో ఏకాదశి ఉపవాసాలు, కుంభమేళాలు ప్రారంభించింది మాత్రం శృంగేరి శారదా పీఠానికి 12వ గురువు అయిన విద్యారణ్య (మాధవ).

ప్రసిద్ధ చరిత్రకారుడు సురేంద్రనాథ్ దాస్ గుప్తా – ''ఎ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ'' – 5 సంపుటాలు ప్రకటించారు. వైదికులు మొదట బౌద్ధాన్ని అనుకరిస్తూ కాలక్రమంలో దాన్ని నాశనం చేస్తూ పూర్తి వ్యతిరేకులుగా ఎలా మారారో సోదాహరణంగా వివరించారు. ఉదాహరణకు బౌద్ధంలో నాగార్జునుడు ప్రతిపాదించిన 'శూన్యాన్ని' శంకరుడు 'బ్రహ్మ' అని అన్నాడు. శూన్యవాద, విజ్ఞానవాద బౌద్ధంలోని అంశాలే ఉపనిషత్తులలో కలుపుకున్నారని వివరించాడు. మహాయాన బౌద్ధంలోని అనేక విషయాలు శంకరుడు నేరుగా తీసుకున్న విషయాన్ని ఆయన ఆధారాలతో ధృవీకరించారు.

సమదృష్టితో వాస్తవాల్ని వాస్తవాలుగా నమోదు చేసిన చరిత్రకారుడు సురేంద్రనాథ్ దాస్ గుప్తా (1887–1952) ఎస్.ఎన్.దాస్ గుప్తగా ప్రసిద్ధులు. కలకత్తా విశ్వవిద్యాలయానికి చెందిన ఈయన 1935–39 మధ్య కాలంలో రోమ్, బెర్లిన్, జురిచ్, పారిస్, ఇంగ్లండ్ వంటి ఒక డజను యూనివర్సిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. రెండు పి.జి. డిగ్రీలు తీసుకున్న వారు ఉంటే ఉంటారు గానీ, ఈయన రెండు పీహెచ్‌డీలు కూడా తీసుకుని తన ప్రత్యేకతను నిలుపుకున్నారు. కలకత్తా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ తీసుకున్నాక, మళ్ళీ మరో పీహెచ్‌డీ కోసం కేంబ్రిడ్జి వెళ్ళారు. భారతదేశంలో బౌద్ధం క్షీణించడానికి కొన్ని శతాబ్దాల కాలం పట్టింది. పైగా అది అనేక కారణాల వల్ల క్షీణిస్తూ వచ్చింది. ధర్మాలలో మార్పులు, ఆరామాలలో మార్పులు ఎలా జరుగుతూ వచ్చాయో ఎస్.ఎన్.దాస్ గుప్త రచనలు తేటతెల్లం చేస్తాయి. శబరిమల, తిరుపతి, తిరువనంతపురం, పూరీ, బద్రీనాథ్‌లలో గల ప్రసిద్ధ హిందూ దేవాలయాలన్నీ మార్పులకు గురైన బౌద్ధారామాలేనన్నది స్పష్టమవుతుంది.

వందల సంఖ్యలో పురాతన హిందూ విగ్రహాలన్నీ మార్పులకు గురైన బుద్ధుడి విగ్రహాలేనన్నది రుజువవుతుంది. ఎవరి మత విశ్వాసాలు వారివే.. కానీ, నిజమైన చారిత్రక విశేషాలు వైజ్ఞానిక దృక్పథంతో అధ్యయనం చేయాలనుకునే వారికి ఈ దేశంలో ముడిసరుకు చాలా ఉంది. ❑

---

## వైరస్‌లా మత విద్వేషం

**(7వ పేజీ తరువాయి)**

ప్రభుత్వ వ్యతిరేక వెబ్‌సైట్‌లపై చర్య తీసుకునే లక్ష్యంతోనే సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్రం ఆ నివేదన చేసి ఉంటుంది. సుదర్శన్ టీవీ ఎలాగూ అధికారపార్టీ భావజాలానికి అనుకూలంగా ఉన్నందున అది ఎంతగా నిబంధనలను అతిక్రమించినప్పటికీ దానిపట్ల ఉదారంగా వ్యవహరించాలన్న ఉద్దేశమూ సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ వైఖరిలో స్పష్టంగా కన్పిస్తోంది.

సుదర్శన్ టీవీ లాంటివి సమరశీల హిందూత్వ ప్రపంచ దృక్పథాన్ని ప్రచారం చేస్తున్న విషయం నిజమే. మరి ప్రధానస్రవంతి టీవీ చానెల్స్ విషయమేమిటి? ప్రతిరోజూ ఒక నిర్దిష్ట మతవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వీక్షకుల మనస్సుల్లోకి మతోన్మాద విషాన్ని ఎక్కించడం లేదూ? నకిలీ వార్తలతో ఆ మతవర్గాన్ని అపనిందల పాలుచేయడానికి ప్రయత్నించడం లేదూ? ఉదాహరణకు మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో కొద్దినెలల క్రితం ఇద్దరు సాధువుల ఊచకోత ఉదంతాన్నే తీసుకోండి. యథార్థమేమిటో తెలుసుకోవడానికి ఏ మాత్రం ప్రయత్నించకుండానే కొన్ని టీవీ చానెల్స్ ఆ ఊచకోతలను హిందూ, ముస్లిం ఘర్షణలుగా చిత్రీకరించాయి. తమ వైఖరికి మద్దతుగా ఇరుమతాలకు చెందిన వాగాడంబరులైన వ్యక్తులతో ప్రైమ్‌టైమ్ చర్చలు నిర్వహించాయి. అయితే ఆ ఊచకోతల వెనుక మతపరమైన కారణాలు ఏవీ లేవని నిర్ధారణ అయింది. ఒక వాట్సాప్ వదంతి కారణంగా ఆ సాధువులు తమ బిడ్డలను కిడ్నాప్ చేయడానికి వచ్చినవారుగా స్థానిక గిరిజనులు పొరపడడం జరిగింది. మరి ఆ నిజం నిగ్గు తేలిన తరువాత కూడా ఏ న్యూస్‌ఛానెల్ అయినా తమ వీక్షకులకు క్షమాపణలు చెప్పిందా? లేదు. ఎందుకని? టెలివిజన్ రేటింగ్ పాయింట్స్ పెంచుకోవడానికి ఉద్దేశపూర్వకంగా వీక్షకులను తప్పుదోవ పట్టించిన ఆ ఛానెల్స్ వాస్తవాలు వెల్లడయిన తరువాత కూడా తమ తీరు తెన్నులను ఎందుకు మార్చుకోవడం లేదు? భిన్న మతాల వారి మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టడం ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నించే వార్తా వర్తకులపై సత్వరమే కఠినచర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం అలా వ్యవహరించినప్పుడు మాత్రమే మన జాతి జీవనంలో శాంతి సామరస్యాలకు ముప్పుగా పరిణమిస్తున్న వైరస్ నిర్మూలనకు ఒక వ్యాక్సిన్‌ను మనం కనుక్కోవడం సాధ్యమవుతుంది. ❑

# అయోధ్య రాముడు గాంధీ రాముడేనా ?

కొప్పర్తి వెంకటరమణమూర్తి



రామజన్మభూమి వివాదం ముగిసి అయోధ్యలో రామాలయ నిర్మాణం ప్రారంభమైన నేపథ్యంలో 'హే రాం' అంటూ జీవితం చాలించిన (అది నిజం కాకపోతే కనీసం ఆ మాటను ఉచ్చరిస్తూ జీవితాన్ని ముగించాలనుకున్న) మహాత్మాగాంధీ నూటయాభయ్యవ జయంత్యుత్సవాల ముగింపులోకి వచ్చాం. ఇప్పుడు ఎదురౌతున్న ప్రశ్న అయోధ్యలో కొలువు కానున్న రాముడూ గాంధీ ఉచ్చరించిన రాముడూ ఒక్కరేనా అన్నది. ఎప్పుడూ ఏ ఆలయాన్ని సందర్శించడానికి ఉత్సుకత చూపని గాంధీ తన ఇష్టదైవం రాముడు జన్మించాడని చెబుతున్న చోట నిర్మితమౌతున్న ఈ ఆలయానికైనా వచ్చేవాడా అన్నది మరో ఊహాత్మక ప్రశ్న.

గాంధీకి బ్రిటీష్ సామ్రాజ్యం రావణ రాజ్యం. రాముడు సత్యానికి ప్రతీక. బ్రిటీష్ రాజ్యంలో నివాసం వనవాసం. రావణ రాజ్యానికి ప్రత్యామ్నాయం రామరాజ్యం. అదే స్వపరిపాలన. రామరాజ్యం అంటే హిందు రాజ్యం కాదు. భగవంతుని రాజ్యం. రాజుకూ పేదకూ సమాన హక్కులుండే రాజ్యం. రాముడూ రహీము ఒక్కరే. సత్యమే భగవంతుడు. ఇవన్నీ వేర్వేరు సందర్భాల్లో రాముడి గురించి వ్యక్తమైన గాంధీ అభిప్రాయాలు.

రాజకీయ నాయకుల్లో మతాన్నీ భగవంతుణ్ణీ గాంధీ అర్థం చేసుకున్నంత ఆధునికంగా మరొకరు అర్థం చేసుకున్నట్లు కనిపించదు. మతాన్ని గాఢంగా విశ్వసించిన ఆయన మత ప్రమేయం లేని లౌకిక రాజ్యాన్ని కోరుకోవడంలో అది స్పష్టమౌతుంది. తన మతం పట్ల విశ్వాసమూ ఇతర మతాల పట్లా హేతువూ ప్రదర్శించడం వల్ల ఇది సాధ్యమైందనుకోవచ్చు. మతం ప్రాతిపదికగా జరుగుతున్న దేశవిభజనను వ్యతిరేకించిన ఆయన మతాంతీకరణ పొందిన ఒక సమూహం మాతృ సమూహం నుంచి వేరుపడి స్వతంత్ర్య దేశం కావాలని కోరుకోవడం చరిత్రలో ఎక్కడా లేదంటూ, మతం మారితే మనస్తత్వాలు మారతాయా అని ప్రశ్నించాడు. ఇతర మతాల్ని అధ్యయనం చేయడం, అభిమానించడం స్వమతాన్ని బలహీన పరచడం కాదనీ అది విస్తృతపరచుకోవడమేననీ అంటూ, తన ప్రయత్నమంతా ప్రతీ మతస్థుణ్ణీ తన మతాన్ని మరింత అనుష్టానంతో అనుసరించేటట్లు చెయ్యడమేనని అన్నాడు.

మతాన్ని అర్థం చేసుకోవడంలో ఒక లౌకికత్వం ఉండాలి. మతం విశ్వాసం మీద ఆధారపడి నిర్మితమౌతుంది. ఆధారాల్లేనిదీ రుజువుల్లేనిదే విశ్వాసం. చెరసాలలో జన్మించిన కృష్ణుణ్ణి బుట్టలో పెట్టుకుని అర్ధరాత్రి బయల్దేరిన వసుదేవుడికి యమున నది దారి ఇచ్చిందంటే ఎట్లా ఇస్తుందని ప్రశ్నించకుండా అంగీకరించడమే విశ్వాసం. ఇశ్రాయేలులను ఈజిప్టుకు నడిపించిన మోజెస్‌కు ఎర్రసముద్రం దారి ఇవ్వడమూ అలాంటిదే. ఇందులో ఒకటి నిజం కావడమూ, మరొకటి కాకపోవడమూ ఉండదు. ఒకటి విశ్వసించిన వ్యక్తి రెండవ దాన్ని విశ్వసిస్తేనే అతను ఒక మతస్థుడౌతాడు. అంటే ఒక మతస్థుడు వేరొక మత అస్తిత్వాన్ని కూడా విశ్వసిస్తేనే స్వమతస్థుడౌతాడన్నమాట. ఈ అంశాన్ని గాంధీ బాగా గుర్తించినట్టు కనిపిస్తుంది. హేతుబద్ధం కానివి మార్పుకు లొంగవు. వేరొకరి జోక్యాన్ని సహించవు. అందువల్ల మానసిక ఆవరణను దాటి రాజకీయ ఆర్థిక ఆవరణలోకి వచ్చే అర్హత వాటికి ఉండదు. ఇక్కడే మతం రాజకీయం అనే రెండిటి మధ్య గాంధీ రేఖ గీయ గలిగాడు. మొదటిది వ్యక్తిగతమూ మానసికమూ అనీ, రెండవది సామూహికమూ సామాజికమూ అనీ గుర్తించాడు.

ప్రాచీనయుగంలో అశోకుడు, మధ్యయుగంలో అక్బర్, ఆధునిక యుగంలో గాంధీలు రాజకీయవేత్తలుగా మతాన్ని సరిగా అర్థం చేసుకున్నారనిపిస్తుంది. కీపూ మూడవ శతాబ్దికి చెందిన అశోకుడు బౌద్ధం స్వీకరించి కూడా స్వధర్మంతో పాటు అజవికుల్నీ, శ్రమణుల్నీ, బ్రాహ్మణుల్నీ ప్రేమపూర్వకంగా ఆదరించాడు. వారికి దానాలు చేశాడు. బౌద్ధానికి వ్యక్తిగతంగా మరిన్ని ఉదాత్త గుణాల్ని అన్వయించాడు. ఈ క్రమంలో బౌద్ధానికి కొనసాగింపుగా 'అశోక ధమ్మం' అనే నూతన ధర్మం రూపొందింది. ఇది చరిత్రలో తొలిసారి రాజకీయంగా ఏకీకృతమైన భారతదేశాన్ని ఆత్మికంగా ఒకటి చేసి ఉంచింది. మ్మధ్యయుగాల్లో అక్బర్ చక్రవర్తి , పాలకుడు అల్పసంఖ్యాక వర్గ మతమైన ఇస్లాంకీ పాలితులు అధికసంఖ్యాక వర్గ మతమైన హైందవానికీ చెందినప్పుడు పాలితుల ఆమోదం పొందడానికి చాలా పనులే చేశాడు. హిందు భార్య సంతానానికే వారసత్వ హక్కు నిచ్చాడు. గడ్డం తీసివేసి, జంధ్యం ధరించి,

తలపాగ చుట్టాడు. అగ్నిపూజ చేశాడు. అన్ని మతాల సారంతో నూతన మతస్థాపన చేసి చక్రవర్తి ఉండీ దాన్ని స్వీకరించమని ఎవ్వరినీ ఒత్తిడి చెయ్యలేకపోయాడు. ఫలితంగా అది విఫలమైంది. అయితే ఆ వైఫల్యం లో గొప్ప సాఫల్యాన్ని చూడొచ్చు మనం. స్వధర్మాన్ని వీడకుండానే అశోకుడు, అక్బర్‌లు వివిధ ధర్మాలను కలిపి ఉంచడం – హిందు మతం, ఇస్లాం వేర్వేరు మతాలైనా హిందువులు ముస్లిములు వేర్వేరు దేశస్థులు కానక్కర్లేదనే గాంధీ ఆలోచనలోనూ ప్రతిఫలించింది.

ఒక మతాన్ని అనుసరించే వాళ్లందరూ తమకు ఒకే రాజకీయ ఆర్థిక సామాజిక ప్రయోజనాలున్నాయని భావిస్తారు. మతతత్వానికి ఇదే పునాది. ఆ మతాన్ని అనుసరించడం ద్వారా ఆ ప్రయోజనాలను కాపాడుకోగలమని అనుకుంటారు. అంతే కాదు, ఆ ప్రయోజనాలు వేరొక మతం వారి ప్రయోజనాలకంటే భిన్నమైనవిగా కూడా భావిస్తారు. ఇంకా ముందుకు పోయి అవి పరస్పర వ్యతిరేకమైనవిగా సంఘర్షించేవిగా నిర్ణయించుకుంటారు. ఇదీ మతతత్వ రాజకీయాల మీద విస్తృత పరిశోధన చేసిన ప్రొ. బిపన్ చంద్ర విశ్లేషణ. రాజ్యాంగం ద్వారా పొందవలసిన ప్రాథమిక హక్కులు, పౌర స్వేచ్ఛ, ఆర్థిక ప్రగతి, సంక్షేమం వంటివి ఏ మతస్థులకైన ఒకే విధంగా అవసరమౌతాయి. రాజ్యం ప్రధాన బాధ్యత వాటి పరికల్పన, పరిరక్షణ. మతాన్ని బట్టి వీటిల్లో కొన్నింటికి మినహాయింపు ఉండదు. మత పరంగా పొందే ఏ ప్రత్యేక ప్రయోజనమూ ఈ అవసరాల్లో ఏ ఒక్కదానికీ ప్రత్యామ్నాయం కాజాలవు. అందువల్ల మతం పేరిట అధికారం లోకి రావడం భావోద్వేగ పర్యవసానమే అవుతుంది కానీ ఆలోచనాత్మకం కాదు. మతం లక్ష్యం రాజ్యం కానప్పుడు మతాన్ని వక్రీకరిస్తే కాని రాజ్యం చేజిక్కదు. ఫలితంగా మతమూ రాజ్యమూ రెండూ తప్పుదారి పడతాయి.

మతానికి కేంద్రబిందువైన దేవుడు, ఉన్నాడా లేడా అనే మౌలిక ప్రశ్నను నిగ్గుదేల్చడం అటుంచి ప్రజలు దేవుడనే భావనను విశ్వసిస్తారనే వాస్తవాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. దాన్ని విస్మరించి చేసే కసరత్తంతా నేల విడచి చేసేదే ! కాబట్టి మతానికి ఇస్తున్న వక్రీకరణకు విరుగుడు నివ్వాలి. 'బిజెపి నా హిందుమతాన్ని అవమానిస్తోంది' అంటున్నాడు జెయన్ యు సోషియాలజీ ప్రొఫెసర్, గాంధియన్ అవిజిత్ పాథక్ తన ఏప్రిల్ 07,2019 నాటి ది వైర్ లో రాసిన వ్యాసంలో. ఆయన ఇలా అంటున్నారు : ఆధ్యాత్మికంగా సంపద్వంతమైన సాగే గుణం ఉన్న హైందవానికి బిజెపి ఒక ప్రతి వాదం (anti-thesis) అని చెప్పడానికి నేనే మాత్రం సందేహించను. అది హిందు మతాన్ని ద్వేషఖడ్గంగా దిగజార్చింది. దాని ఆధ్యాత్మిక దివ్యానుభవాన్ని చంపేసింది. మూకతత్వాన్ని ప్రేరేపించింది. ఆంతరిక అన్వేషణలోని కవితాత్మ స్థానంలో 'శత్రువు' తో యుద్ధం వంటి పశుభావనల్ని ప్రవేశపెట్టింది. విదేశీ ముస్లిం దాడుల గురించీ, కాశ్మీరీ ఉగ్రవాదుల గురించీ, అనైతిక కమ్యూనిస్టుల గురించీ, గాంధేయ పిరికి పందల గురించీ ఎంతకాలం వింటాం ? ఎంతకాలం ఇతరుల్ని ద్వేషించుకుంటూ మన మతాన్ని నిలబెట్టుకుంటాం ? అని కూడా ప్రశ్నించారు.

రాష్ట్రంలో ఒక చోట దేవుడి రథం తగలబడిపోతే, మరో చోట అమ్మవారి గుళ్లో వెండి సింహ ప్రతిమల్ని ఎవరో ఎత్తుకెళ్లిపోతే ఇటువంటివే మిత్రపక్షం పాలనలో జరిగినపుడు యాదృచ్ఛిక ఘటనలుగా భావించి వదిలేసి, ఇప్పుడు జరిగితే వాటన్నిటినీ ఇప్పటి ముఖ్యమంత్రి మత విశ్వాసాలకు ముడిపెట్టి చేస్తున్న రాద్ధాంతమూ, రాజకీయమూ రాజ్యాంగ లౌకిక విలువల పతనానికి పరాకాష్ట. మతాన్ని ఆత్మిక ధార్మిక ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం మతత్వం (religiosity). మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం మతతత్వం (communalism). మతతత్వ రాజకీయాల్ని అనుసరించడం మతాన్ని అనుసరించడం కాదు. ఈ మౌలిక స్పృహ లేకలోతే ఉభయ భ్రష్టత్వం తప్పదు.

ఈ నేపథ్యంలో చూస్తే గాంధీ రాముడు బిజెపి రాముడు ఒకరు కాదనిపిస్తోంది. అనేక రామాయణాలున్నట్టు అనేక మంది రాముళ్లు ఉన్నట్టున్నారు. గాంధీ రాముడు నిషాదుడైన గుహుణ్ణి హత్తుకున్న రాముడు. శబరి ఎంగిలి తిన్న రాముడు. వానరులతో స్నేహం చేసిన రాముడు. జన్మతహ రాక్షసుడైన విభీషణుణ్ణి ఆదరించిన రాముడు. గాంధీ రాముడు సత్య సాధకుడు. అయితే మహోగ్రదగ్రుడై అస్త్రశస్త్రాలు ధరించి యుద్ధానికి సంసిద్ధుడౌతున్న రాముడివీ, పులిని తలపించే ముఖంతో ఉన్న క్రోధుడైన ఆంజనేయుడివీ పోస్టర్లూ చూస్తే వీళ్లిద్దరూ ఇప్పుడు దేశంలో ఎవరి మీద యుద్ధం ప్రకటిస్తున్నారు అనిపిస్తుంది. బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయిన తర్వాత కూడా రాముడు దేశంలో అంతమొందించ వలసిన మిగిలిన రాక్షసులు ఎవరు ? అసలు అప్పటి రాక్షసులు ఇప్పుడు ఎవరు ? మధ్యలో రాక్షసులైన వాళ్లెవరు ? దేవతలకు రాక్షసులకు యుద్ధం ఇంకా జరుగుతూనే ఉందా ? రాముడు శంభుక వధను కొనసాగిస్తాడా ? వర్తమానం ఎదుట భవిష్యత్తు నిలబడినట్లు మన ముందు ఈ ప్రశ్నలు నిలబడి ఉన్నాయి. ❑

# ఒక్కరికీ నిజం చెప్పే ధైర్యం లేదా?

**మాడభూషి శ్రీధర్**
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్

యూపీ ముఖ్యమంత్రి లక్నోను వదిలేసి అయోధ్యకు ఎందుకు వచ్చారు? అంతకుముందు ఆయన బాబ్రీ నిర్మాణానికి ఏ హానీ కలగదని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చి రాలేదా? అద్వాణీ వంటి పరిపూర్ణ నేతకు, మురళీ మనోహర్ జోషి వంటి ప్రొఫెసర్‌కు తెలియదా? అయినా ఎందుకు వచ్చారు? ఏం చేయడానికి వచ్చారు? బాబరీని కొందరు సంఘవ్యతిరేక శక్తులు కూల్చడానికి వెళుతూ ఉంటే భారత రాజ్యాంగం పట్ల అవిరళ శ్రద్ధతో సంఘ్ పరివార్ సభ్యులుగా ఆపడానికి వచ్చారా? ఒక్కరంటే ఒక్కరు కోర్టుకు వచ్చి తాము రామజన్మభూమిలో బాబరీ మసీదు ఉండకూడదనే ఉద్దేశంతో దాన్ని కూల్చేయడానికి వెళ్లామని, అక్కడ రామమందిరం కట్టడం కోసం దాన్ని కూల్చేయక తప్పలేదని కోర్టులో సత్యం ఎందుకు చెప్పలేదు.

"అవును మేమే కూల్చాం, మందిరం కట్టడానికి" అనే నిజం చెప్పే ధైర్యం ఒక్కరికీ లేదా? అయోధ్య రామజన్మభూమి అని కోటానుకోట్ల హిందువులు నమ్మే చోట ఒక మసీదు ఎలా వచ్చిందో ఎవరూ న్యాయస్థానం నమ్మే రుజువులతో సహా చెప్పలేరు. బాబ్రీ కట్టడం 1992 డిసెంబర్ 6 నాడు ఎందుకు కూలిందో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే అయినా ఎవరు కొట్టిన గునపపు దెబ్బకు ఎక్కడ పగిలిందో రుజువులతో సహా చెప్పలేదు. కూల్చింది నిజమే, కాని కూల్చింది ఎవరో రుజువులు లేవు. ఎవరో కూలగొట్టకుండానే ఏదీ కూలదు. కాని సిబిఐ నిందితులని పేర్కొన్న పెద్దలు చిన్నలు ఎవరూ కూల్చినట్టు రుజువులు లేవని సిబిఐ కోర్టు కేసు ముగించింది. వారు కూల్చలేదనలేదు. సాక్ష్యాలు తెచ్చే పని కోర్టుది కాదు. ఉన్న సాక్ష్యం సరిపోతే నేరస్థులనడం, లేకపోతే సాక్ష్యం లేదని వదిలేయడం తప్ప కోర్టుకు ఏ పాపమూ తెలియదు. అయితే పాపులెవరు?

సాక్ష్యాలు సేకరించి కోర్టులో రుజువు చేసే పని పోలీసులది.




సాక్ష్యాలు లేవా, దొరకలేదా, దొరికినా కోర్టులో పెట్టలేదా? ఆనాటి టీవీలు వీడియోలు తీయలేదా? అవి చూపలేదా? ఎవరూ చూడలేదా? ఈ పేర్లు ఎక్కడి నుంచి వచ్చాయి, సిబిఐ దర్యాప్తు అధికారులకు కలలో కనిపించాయా? ఏ ఆధారాలు లేకుండానే పెద్దపెద్ద వారి పేర్లను వారు అందులో ఇరికించారందామా? అట్లా అయితే వారి మీద చర్యలు తీసుకోవాలని నిందితులు అడుగుతున్నారా? ఇవన్నీ న్యాయపరమైన ప్రశ్నలు. ప్రజలకు తెలుసు. ఎవరి అంచనాలు వారికుంటాయి.

అక్కడ జరిగిన సంఘటనల గురించి మాట్లాడుకుందాం. సంఘటనలను ఇంగ్లీషులో FACTS అంటారు. చట్టపరిభాషలో fact అంటే నిజమూ కాదు వాస్తవమూ కాదు. ఒక సంగతి అని అర్థం. అంతే. బాబ్రీ మసీదు కూలింది అనేది ఒక సంగతి. బిజెపి, విహెచ్‌పి, బజరంగదళ్, విశ్వహిందూపరిషత్, సంఘ్ పరివార్‌కు సంబంధించిన వారు, కరసేవకులుగా దేశం నలుమూలల నుంచి తరలి వచ్చినవారు అక్కడ అదే రోజు సమావేశమయ్యారు. వారిలో కొందరు మంచి వారు. మరి కొందరు, కోర్టు వారు చెప్పినట్టు వారిలోనే ఉన్న సంఘవ్యతిరేక శక్తులు. సంఘ్ శక్తులు కూల్చలేదనీ, సంఘ్‌లోనే లేదా కరసేవకులలోనే ఉన్న సంఘ వ్యతిరేక శక్తులు కూల్చిఉంటాయని 2300 పేజీల తీర్పు సారాంశం.

వారంతా ఆరోజు అక్కడికి ఎందుకు వచ్చారు? బాబ్రీ కట్టడం చుట్టూ షామియానాలు వేసుకుని, అందులో కుర్చీలు వేసుకుని కూర్చోవడానికి వచ్చారా? వారిలో దాదాపు 90 శాతం మంది బిజెపి నాయకులు, వేలాది చురుకైన కార్యకర్తలు, అక్కడ మసీదు ఉన్న చోట రామాలయం కట్టాలనే దృఢసంకల్పం ఉన్న వారేనని నేను అనుకుంటున్నాను. కరసేవకులు కూడా నుదుట కాషాయ వస్త్రం కట్టుకుని కరసేవకులమని దుస్తుల మీద రాసుకుని, కుంకుమబొట్లు పెట్టుకుని, కొందరు త్రిశూలాలు పట్టుకుని, గునపాలు, పారలు, తట్టలు, బుట్టలు పట్టుకుని ఎందుకు వచ్చారు? అది స్టేడియం కాదు. అక్కడ క్రికెట్ మ్యాచ్ జరగడం లేదు కదా?

వెళ్లిన వారి ఎజెండా ఏమిటి? ప్రకటిత ఎజెండా. మానిఫెస్టో, రామ్‌లల్లా మీద భక్తితో, అదే రామజన్మభూమి అన్న ప్రగాఢ విశ్వాసంతో, అక్కడ భవ్యమైన రామాలయం ఉండేది, ఇక ముందు ఉండాలి అన్న దృఢసంకల్పంతో చేసిన ప్రకటనలు లేవా? ఏ ప్లాన్ లేకుండానే అక్కడికి గునపాలతో ఎందుకు వచ్చారు? బాబ్రీ కట్టడాన్ని కూల్చిన తరువాత ఆ శిథిలాలన్నీ

ఎవరు ఎత్తిపోశారు? ఎలా ఎత్తిపోశారు? ఎక్కడ ఎత్తిపోశారు? మళ్లీ తాత్కాలిక కప్పు కింద రామ్‌లల్లాను ఎలా నెలకొల్పారు. అంతా యాదృచ్ఛికంగా ముందుగా అనుకోకుండానే జరిగి పోయిందా? ఇవన్నీ సాధారణ బుద్ధి ఉన్న మానవులకు, ఇంగితజ్ఞానం (బహుశా దీన్నే కామనసెన్స్ అంటారేమో) ఉన్న వారికి వచ్చే ప్రశ్నలు. రావలసిన ప్రశ్నలు. అక్కడ ఆరోజు చేరిన ప్రతి వ్యక్తికీ ఆ ప్రాంతంలో రామాలయం రావాలనే ప్రగాఢ కోరిక ఉందని అందరికీ తెలుసు. అక్కడికి వెళ్లి వచ్చినవారిలో ఒక్కరైనా 'లేదు, అది కాదు' అని అనగలరా? బాబ్రీ కట్టడాన్ని కూల్చడానికి వారు అక్కడికి వెళ్లలేదని ఒక్కరైనా చెప్పగలరా? లేదా కూల్చుతుంటే చూడడానికి, కూల్చనివ్వడానికి వెళ్లలేదని కుర్చీలు వేసుకుని కూర్చున్న పెద్దలలో ఒక్కరైనా చెప్పగలరా? అక్కడున్నవారెవరికీ అది నాలుగువందల ఏళ్ల నాటి పాత కట్టడమని, చట్టం ప్రకారం పురాతన నిర్మాణమని నిర్వచించిన లేదా నిర్వచించవలసిన కట్టడమని, దాన్ని కూల్చడం చట్టప్రకారం నేరమని తెలియదా? హిందూముస్లింల మధ్య మతఘర్షణలకు దారితీసే వివాదాస్పద అగ్గిరవ్వలు అక్కడ చెలరేగే అవకాశం ఉందని తెలియదా? అక్కడున్న యుపి ముఖ్యమంత్రి లక్నోను వదిలేసి అయోధ్యకు ఎందుకు వచ్చారు? అంతకు ముందు ఆయన బాబ్రీ నిర్మాణానికి ఏ హానీ కలగదని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చి రాలేదా? అద్వాణీ వంటి పరిపూర్ణ నేతకు, మురళీ మనోహర్ జోషి వంటి ప్రొఫెసర్‌కు తెలియదా? అయినా ఎందుకు వచ్చారు? ఏం చేయడానికి వచ్చారు? బాబరీని కొందరు సంఘవ్యతిరేక శక్తులు కూల్చడానికి వెళుతూ ఉంటే భారత రాజ్యాంగం పట్ల అవిరళ శ్రద్ధతో సంఘ్ పరివార్ సభ్యులుగా ఆపడానికి వచ్చారా? సమాధానాలు వారికీ తెలుసు, మనందరికీ తెలుసు.

నాకు ఆశ్చర్యం బాధ కూడా కలిగిస్తున్న అంశం ఏమిటంటే, వీరిలో ఒక్కరంటే ఒక్కరు కోర్టుకు వచ్చి తాము రామజన్మభూమిలో బాబరీ మసీదు ఉండకూడదనే ఉద్దేశంతో దాన్ని కూల్చేయడానికి వెళ్లామని, అక్కడ రామమందిరం కట్టడం కోసం దాన్ని కూల్చేయక తప్పలేదని కోర్టులో సత్యం ఎందుకు చెప్పలేదు. అంతటి ధైర్యం సాహసం, అంకితభావం, చిత్తశుద్ధి లేవా?

ఈ పనులను ఏమనాలి? ఆందోళన అనాలా? ప్రభుత్వం అధ్వర్యంలో రాజకీయ పార్టీ నిర్వహించిన భక్తి ఉద్యమం అనాలా? లేక ఇప్పుడు వారంతా నెత్తిన పెట్టుకుని గౌరవిస్తున్న గాంధీ సత్యాగ్రహం అనాలా? (నేడు గాంధీ జయంతి) తనకు ఉరిశిక్ష వేసినా సరే తాను రాముడి గుడి కట్టే యజ్ఞంలో భాగస్వామ్యమినై నందుకు సంతోషంతో ఆ శిక్షను స్వీకరిస్తానని నిందితులలో ఒకరైనా ఉమా భారతి అన్నారు. చాలా గొప్పమాట. ఇంకెవ్వరయినా ఆ మాట అన్నారో లేదో నాకు తెలియదు. నేరం చేయలేదని ఆమె అనలేదు. బాబ్రీ నిర్మాణం కూల్చలేదనీ అనలేదు. రామమందిర నిర్మాణం తమ లక్ష్యం కాదనీ అనలేదు. అయితే ఆమెకు కూడా ఒక ప్రశ్న. సిబిఐ స్పెషల్ కోర్టు ముందుకు వెళ్లి, తమ లక్ష్యం రామమందిర నిర్మాణమేనని, అందుకు అడ్డుగా ఉన్న బాబ్రీ మసీదును తొలగించుకుంటామని, దాని కోసమే తాను వచ్చానని నేరాన్ని ఎందుకు ఒప్పుకోలేదు?

అదే ప్రశ్న అద్వాణీకి కూడా. అందరికీ పేరుపేరునా అదే ప్రశ్న. తీర్పు తరువాత సత్యమే జయించింది అనే అర్హత బిజెపి విహెచ్‌పి, వగైరా వగైరాకు చెందిన వ్యక్తులకు ఉందా? నిజంగా సత్యం జయించిందా? సత్యమేవజయతే అనే భారతదేశ లక్ష్య వాక్యానికి ఇదేనా అర్థం. వీరంతా హైందవ ధర్మాన్ని, రామ తత్వాన్ని, భారతీయ సంస్కృతికి వేద సంస్కారానికి మూల సూత్రమైన సత్యవ్రతాన్ని నిలబెట్టిన వారా? ఇదేనా వీరి దేశభక్తి, ఇదేనా వీరి రామభక్తి? రామ్‌లల్లా ఇదే చేయమని చెప్పాడా?

తానూ బాబ్రీ మసీదు కూల్చానని కోర్టుకు వచ్చి చెప్పి జైళ్లన్నీ నింపేస్తాం అనే ధైర్య, ఉద్యమ సాహసాలు ఎవరికీ లేవా? ఇదేనా చిత్తశుద్ధి? రామభక్తికి నిబద్ధం కాకుండా, రాజ్యాంగానికి నిబద్ధం కాకుండా, సత్యానికి నిబద్ధం కాకుండా, పోనీ ఇన్నాళ్లూ చెప్పుకుని రాజకీయంగా ఎదిగిన రామాలయ నిర్మాణ సంకల్పానికి కూడా నిబద్ధం కాకుండా, దేనికి భయపడి బాబ్రీని కూల్చడానికి రాలేదని చెప్పారు? లేదా కూల్చడానికి వచ్చామని ఎందుకు చెప్పలేదు? సిబిఐ కోర్టు వారిని బాయిజ్జత్ నిర్దోషులని చెప్పలేదు. సాక్ష్యం లేక వదిలేసామని చెప్పింది. వారి సత్యం జయించలేదు. సత్యాలకు రుజువులు ఇవ్వక, ఇవ్వనీయకపోవడం వల్ల అసత్యం ఆధారంగా విడుదలయ్యారంతే.

భారత సాక్ష్య చట్టం (ప్రపంచంలో ఏ సాక్ష్య చట్టమైనా) మూడు అంశాలు వివరిస్తుంది. 1. charge proved నేరం రుజువైంది, శిక్ష పడుతుంది. 2. charge not proved నేరం రుజువు కాలేదు, కారణం సాక్ష్యాలు లేవు. లేదా సరిపోయేన్ని లేవు. 3. charge disproved అంటే ఆరోపించబడిన వారు నేరం చేయలేదని రుజువు కావడం, ఆరోపణలు తప్పని రుజువైనాయి అని. రెండో వర్గపు విడుదల నిన్నటి తీర్పు. మిఠాయిలు ఎందుకు పంచుకుంటున్నారు? పూలహారాలు ఎందుకు వేస్తున్నారు, వేసుకుంటున్నారు వేయించుకుంటున్నారు? వాటిని ఎందుకు వద్దనడం లేదు? సబ్ కో సన్మతి దే భగవాన్, జై శ్రీరాం అని ఎందుకు అంటున్నారు? నిందితులందరికీ సన్మతి అక్కరలేదా?

నిందితులు విడుదల కావడానికి కారణం నిజం కాదు. సిబిఐ అసమర్థత. ఈ మాట కోర్టే అన్నది, నేను కాదు. సత్యం కాదు జయించింది. అసమర్థత జయించింది. ఇక్కడ సత్యం ఓడిపోయింది. సత్యం చెప్పే సాహసం లేని అనైతికత వల్ల నేరం రుజువు కాలేదు. అంతే. వీరంతా అంతరాంతరాల్లో ఉండే అంతరాత్మలను ప్రశ్నించుకోవడం పశ్చాత్తాపం చెందడం ఒక్కటే మార్గం. భారతీయ జాతీయతను, నైతికవిలువలను, నిజాయితీని, నిజాన్ని, సంస్కృతిని, సంస్కారాన్ని రక్షించండి. ❑

# కొత్త 'వ్యవసాయ' విపత్తులు!



వడ్డే శోభనాద్రీశ్వర రావు

బడా వ్యాపార సంస్థలకు రూ.68,000 కోట్లు రుణాన్ని రద్దు చేసిన మోదీ సర్కార్ వరి, గోధుమలకు రాష్ట్రప్రభుత్వాలు బోనస్ ఇవ్వకూడదని ఆదేశించింది. కోట్లాది రైతుల కన్నా కొద్దిమంది కార్పొరేట్ పెద్దలకు మేలు చేయటమే ప్రస్తుత పాలకుల లక్ష్యమని స్పష్టమవుతోంది. కేరళలో వలే 'రుణ ఉపశమన చట్టం' తీసుకు రావాలన్న రైతు సంఘాల విజ్ఞప్తిని ప్రధానమంత్రి పట్టించుకోవడం లేదు. కొత్త వ్యవసాయ బిల్లులను వెనక్కి తీసుకుని సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని డిమాండ్ చేస్తూ భారత రైతుల ఐక్యవేదిక 'ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ కోఆర్డినేషన్ కమిటీ' ఈ నెల 25న దేశ వ్యాప్త బంద్‌కు పిలుపు ఇచ్చింది.

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో సెప్టెంబర్ 20వ తేదీని దుర్దినంగా భావించవలసి ఉంటుంది. గ్రామీణ భారతదేశంలో 70 శాతం మందికి పైగా వ్యవసాయమే జీవనాధారం. రైతులలో నూటికి 82 మంది సన్నకారు చిన్న రైతులే. ఈ రైతుల, వ్యవసాయ కార్మికుల ఆదాయాలను తీవ్రంగా దెబ్బతీసే మూడు బిల్లులను పార్లమెంటు ఆమోదించడం అత్యంత దురదృష్టకరం. కొత్త వ్యవసాయ బిల్లులు భారత రైతాంగానికి ఎనలేని మేలు చేస్తాయని ప్రధాని మోదీ గంభీరంగా ఉద్ఘాటిస్తున్నారు. కానీ, కోట్లాది రైతులలో ఈ బిల్లులు తమ మెడలకు ఉరితాళ్ళను బిగించబోతున్నాయనే భావన బలంగా ఉంది.

'రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య ప్రోత్సాహక, సులభతర బిల్లు–' దేశ రైతాంగ ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు కానుంది. ఎపియంసి చట్టం–1966ను అనుసరించి వ్యవసాయ మార్కెట్ యార్డులు, వాటిల్లో గోదాములు, ప్లాట్‌ఫామ్‌లు వంటి మౌలిక వసతులను కొంతమేరకు కల్పించారు. ఈ చట్టానికి 2003లో పలు సవరణలు చేశారు. ప్రైవేట్ మార్కెట్ యార్డులు; రైతులు, వినియోగదారుల మార్కెట్‌లు; పూలు, కూరగాయలు, పండ్ల అమ్మకాల కోసం ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించారు. కాంట్రాక్ట్ ఫార్మింగ్‌కు కూడా వెసులుబాటు కలిగింది. ఉద్యోగుల జీతభత్యాలకు, గోడౌన్లు, ఓపెన్‌షెడ్ల నిర్వహణకు, నిర్మాణాలకు సాధారణంగా 0.5 శాతం నుంచి 2 శాతం వరకు మార్కెట్‌ఫీజుగా వసూలు చేస్తున్నారు. కొనుగోలుదారులు మార్కెటింగ్ శాఖ నుంచి లైసెన్సు తీసుకోవలసి ఉంటుంది. వాళ్లే మార్కెట్‌ఫీజు చెల్లించాలి తప్ప రైతులు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. 2017లో నరేంద్రమోదీ ప్రభుత్వమే మార్కెట్‌ఫీజును కొనసాగించాలని సూచిస్తూ కొన్ని సంస్కరణలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఆ మేరకు పలు రాష్ట్రాలలో చట్ట సవరణలు జరిగాయి. అయితే ప్రస్తుత బిల్లులో, ప్రైవేట్ మార్కెట్‌లతో సహా మార్కెట్‌యార్డుల వెలుపల ఒక్క పైసా కూడా మార్కెట్‌ఫీజు చెల్లించాల్సిన పని లేకుండానే రిలయన్స్, వాల్‌మార్ట్, మెట్రో, మోర్, బిగ్‌బజార్ లాంటి బడా వ్యాపారసంస్థలే కాకుండా ఎవరైనాసరే రైతుల నుంచి నేరుగా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసుకునేందుకు వీలు కల్పించారు.

నిజానికి ఇటువంటి వెసులుబాటు కల్పించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. దీనివల్ల రానున్న కాలంలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ కుప్పకూలుతుంది. ఫలితంగా వివిధ కారణాలు చూపుతూ వ్యాపారసంస్థలు కనీస మద్దతుధరల కంటే తక్కువ ధరలకు కొనుగోలు చేయడం ద్వారా వేలకోట్ల రూపాయిల మేరకు అదనంగా లాభాలనార్జించటానికి వీలు కలుగుతుంది. కేంద్రప్రభుత్వం వెనువెంటనే మద్దతుధరల విధానాన్ని నిలిపివేయక పోయినా, రైతులకు తగిన ధరలు లభించక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. 2017లో మార్కెట్ ఫీజు ఉండాలన్న మోదీ సర్కార్ ఇప్పుడు మార్కెట్‌ఫీజు లేకుండానే కొనుగోలు జరిపే వెసులుబాటు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడానికి కారణమేమిటి? ప్రధానమంత్రి కానీ, కేంద్రమంత్రులు కానీ, ఈ విషయం గురించి మాట్లాడటం లేదు. ఇప్పటికే పంజాబ్, హర్యానా, పశ్చిమ యూపీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో మార్కెటింగ్‌యార్డు వ్యవస్థ పనిచేస్తూ ఉండటం వల్ల వరి, గోధుమ పంటలకు మద్దతు ధరకు దరిదాపు ధరలు లభిస్తున్నాయి. వ్యవసాయ మార్కెటింగ్ యార్డుల నిర్వహణలో కొన్ని లోపాలు, మౌలిక సదుపాయాల

కొరత ఉన్న మాట నిజమే. ఆ పరిస్థితులను సరిదిద్దడానికి తగినన్ని నిధులు కేటాయించి రైతులకు మెరుగైన సేవలు అందేట్లు చేయవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ద్వారా రైతులు దేశంలో ఏ ప్రాంతంలోనైనా తమ ఉత్పత్తులను ఒక అధునాతన పద్ధతిలో అమ్ముకునే యత్నం 2016 నుంచి కొన్ని వందల మార్కెట్ యార్డులలో ప్రారంభమయింది. అయితే అనేక యార్డులలో గ్రేడింగ్, సార్టింగ్ పరికరాలు, నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే పరికరాలు, కంప్యూటర్ల సదుపాయాలు లేనందున ఆ అధునాతన పద్ధతి' వల్ల రైతాంగానికి పెద్దగా మేలు చేకూరలేదు. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం మిన్నకుండి పోయింది. అవసరమైన పరికరాలు సమకూర్చకుండా, సదుపాయాలు కల్పించకుండా మార్కెట్ వ్యవస్థను కుప్పకూల్చే విధానాన్ని రూపొందించి మొత్తంగా వ్యవసాయ వాణిజ్యాన్ని కార్పొరేట్ శక్తులకు పళ్ళెంలో పెట్టి అందించడానికి మోదీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

చక్కెర ఫ్యాక్టరీలు– చెరుకు రైతుల మధ్య జరిగే ఒప్పందాలు, విత్తన కంపెనీలు–రైతులకు మధ్య అవగాహనలు, ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు, రైతుల మధ్య జరిగే ఒప్పందాలు కాంట్రాక్ట్ ఫార్మింగ్ కిందకే వస్తాయి. చెరుకు పంట మద్దతుధరలకు చట్టబద్ధత ఉండడం వల్ల చక్కెర ఫ్యాక్టరీలు తప్పనిసరిగా రైతులకు వెంటనే కానీ, ఆలస్యంగానైనా కానీ నిర్దేశిత ధరను ఇచ్చి తీరవలసిందే. ఇతర ఒప్పందాలకు ఇటువంటి చట్టబద్ధత లేనందున రైతులకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఆర్థిక బలం పుష్కలంగా ఉండే కంపెనీలతో బక్కరైతులు తలపడి తమకు న్యాయంగా రావాల్సిన ధర విషయంలో కానీ, వివాదం తలెత్తినప్పుడు కానీ పరిష్కార వ్యవస్థ వద్ద పోరాడి సాధించు కోగలిగిన పరిస్థితులు లేవని అనుభవం చెబుతూనే ఉంది. పంటలకు కేంద్రప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతుధరకు తగ్గకుండా కంపెనీలు కొనుగోలు చేయాలనే నిబంధన ఏదీ కొత్త బిల్లులో లేదు. ఫలితంగా, బడా వ్యాపారసంస్థలు వివిధ డొల్ల కారణాలు చూపుతూ రైతులకు అతి తక్కువ ధరలు చెల్లించి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఎక్కువ మొత్తంలో లాభాలు ఆర్జించుకోవడానికి అవకాశం లభిస్తుంది.

వ్యవసాయం, పశుపోషణ, మత్స్యరంగం, వ్యవసాయ మార్కెటింగ్, – మార్కెట్‌ఫీజు అంశాలను రాజ్యాంగం రాష్ట్రాల జాబితాలో పొందుపరిచింది. రాష్ట్రాల పరిధిలో ఉన్న ఈ అంశాలపై కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్‌లు జారీ చేయటమే కాక కేవలం 21 రోజులలో అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా రాష్ట్రాలను కోరడం విడ్డూరం. ఈ ఆర్డినెన్స్‌లు జారీచేసిన సమయంలోనే కర్ణాటకలో యడ్యూరప్ప ప్రభుత్వం కర్ణాటక భూసంస్కరణల చట్టాన్ని సవరించింది. తద్వారా వ్యాపార సంస్థలతో సహా వ్యవసాయంతో సంబంధం లేని వారు కూడా వ్యవసాయ భూములను కొనుగోలు చేయడానికి వీలు కల్పించి, సీలింగ్ పరిమితిని రెండు నుంచి నాలుగు రెట్లకు పెంచటం చూస్తే బిజెపి అసలు ఎజెండా ఏమిటో అర్థమవుతుంది. దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ వ్యాపార సంస్థలకు అప్పజెప్పడమే ఆ ఎజెండా అనటం నిస్సందేహం.

స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ననుసరించి రైతులకు మద్దతుధరలు అమలు చేస్తామని తిరుపతిలో వేంకటేశ్వరస్వామి సాక్షిగా ప్రధాని మోదీ ప్రకటించారు. కానీ అది ఉత్తి మాటగానే మిగిలిపోయింది. యూపీఏ ప్రభుత్వం రైతులకు మద్దతుధర ఇవ్వలేదని విమర్శించిన మోదీ, తమ ప్రభుత్వం కూడా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపిన మద్దతుధరను ఇవ్వడం లేదన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు? రైతులు అమాయకులనే భావనతో పచ్చి అబద్ధాలు చెప్పడం పాలకులకు పరిపాటి అయింది. యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన దానికి మించి ఒక్కపైసా కూడా మోదీ సర్కార్ అదనంగా ఇవ్వడం లేదు. పైపెచ్చు, ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులని బ్యాంక్‌లు ప్రకటించిన బడా వ్యాపారసంస్థలకు రూ.68,000 కోట్ల రుణాన్ని రద్దు చేసిన మోదీ సర్కార్ వరి, గోధుమలకు రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ఇవ్వకూడదని ఆదేశించింది! కోట్లాది రైతుల కన్నా కొద్ది మంది కార్పొరేట్ పెద్దలకు మేలు చేయటమే మోదీ అభిలషిస్తున్నారనే విషయం స్పష్టమవుతుంది. రైతులకు ఒక్క పర్యాయం రుణమాఫీ చెయ్యాలని, కేరళలో వలే 'రుణ ఉపశమన చట్టం' తీసుకురావాలని దేశంలోని రైతు సంఘాలు ఎంతగా విజ్ఞప్తి చేసిన ప్రధాని పట్టించుకోవడం లేదు. ఈ కారణాల వల్లే అఖిల భారత రైతుల పోరాట సమన్వయ కమిటీ ఈ నెల 25న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. కొత్త వ్యవసాయ బిల్లులు మూడింటినీ కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకొని సెలెక్ట్ కమిటి పరిశీలనకు పంపాలని పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులు చేసిన డిమాండ్‌కు ఈ సమన్వయ కమిటీ మద్దతు ప్రకటించింది. ❑



# కార్పొరేట్లకు రాష్ట్రాల రాజ్యాంగ హక్కులు తాకట్టు

సారపల్లి మల్లారెడ్డి
అఖిల భారత కిసాన్ సభ నాయకులు

కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కాజేస్తూ, రాష్ట్రాలను తన జేబు సంస్థలుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. గతంలో ఏ ప్రభుత్వమూ రాష్ట్రాల హక్కులను కాజేయడానికి సాహసించ లేదు. కానీ ఈ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత భారత రాజ్యాంగానికి విరుద్ధంగా చట్టాలను రూపొందిస్తున్నది. కార్పొరేట్ సంస్థలకు, బహుళజాతి గుత్త సంస్థలకు, పెట్టుబడిదారీ భూస్వాములకు, లాభాలు చేకూర్చి పెట్టడమే కాక, ఆస్తుల సంపదకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం చట్టాలను చేస్తున్నది.

## నిత్యావసర వస్తువుల చట్ట సవరణ

బియ్యం, గోధుమలు, జన్నలు, రాగులు, పప్పు ధాన్యాలు, నూనెగింజలు, ఆలుగడ్డ, ఉల్లి, విత్తనాలు తదితర ఉత్పత్తులను నిత్యావసర వస్తువుల చట్టం నుండి తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం జూన్ 5, 2020న ఆర్డినెన్స్ తెచ్చింది. ఈ చట్ట సవరణతో ప్రభుత్వానికి ధరల నిర్ణయంపై గానీ, అక్రమంగా నిల్వ చేసుకోవడంపై గానీ ఎలాంటి నియంత్రణ ఉండదు. సరుకులు కొనుగోలు చేసి మార్కెట్లలోకి రానివ్వకుండా దాచిపెట్టుకొని అధిక రేట్లకు అమ్మి రైతుల్ని, వినియోగదారులను దోచుకోవటానికి ఈ సవరణ లైసెన్స్ ఇచ్చింది. ఈ చట్టంలో ఉన్న సరుకులను తొలగించటానికి, చట్టపరంగా ఏ కోర్టులో దావా వేయడానికి వీలు లేదు. వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు ఉపయోగపడే ఇంత కీలక చట్టాన్ని కార్పొరేట్ వ్యాపారులకు లాభాలు కట్టబెట్టడానికి కేంద్రం సవరణ చేసింది. ఈ చట్టం లోక్‌సభ లోనూ, రాజ్యసభలోను ఆమోదింపచేసుకున్నారు.

## మార్కెట్ సమితులు ఎపియంసి చట్ట సవరణ చట్టం

రైతుల ఆదాయానికి భరోసా ఇచ్చేదిగా రైతులను మభ్య పెడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశ పెట్టింది. 2020 జూన్ 5న ఆర్డినెన్స్ తెచ్చి...20 సెప్టెంబర్, 2020న లోక్‌సభ, రాజ్యసభ ఆమోదం పొందింది. ఈ చట్టం ద్వారా కార్పొరేట్ సంస్థలు ప్రైవేట్ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసుకోవచ్చు. వీరు కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉండదు. క్రమంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయాన్ని కూడా ఎత్తివేస్తుంది. ఇప్పటి వరకు కొన్ని రాష్ట్రాలు ఇస్తున్న బోనస్‌లు, రాయితీలు, ఇతర రక్షణ చర్యలు రైతులు కోల్పోవాల్సి వస్తుంది. ఈ కంపెనీలు ఎగుమతి, దిగుమతులను కూడా నిర్వహిస్తాయి. ఎగుమతులు చేయడానికి ఇక్కడి వ్యవసాయోత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయాలి. ఆ రైతులకు గిట్టుబాటుకాక ఉత్పత్తి నుండి దూరం అవుతారు. ఆ తరువాత దిగుమతులపై దేశం ఆధారపడాల్సి వస్తుంది. చివరకు ఈ దేశం దిగుమతుల దేశంగా మారిపోతుంది. రైతులు కార్పొరేట్ సంస్థల చేతుల్లో బలిపశువులు అవుతారు.

## ఒప్పంద సాగు (కాంట్రాక్ట్ ఫార్మింగ్) చట్టం

దీనిని 'ధరల గ్యారెంటీ ఒప్పంద సాగు, సేవల చట్టం-2020'గా పిలుస్తున్నారు. దీని ప్రకారం రైతులు కార్పొరేట్ సంస్థలతో కాంట్రాక్ట్ కుదుర్చుకొని సాగు చేయాలి. టోకు వ్యాపారస్తులతో, ఎగుమతిదారులతో, పెద్ద రిటైల్ సంస్థలతో మన రైతులు కాంట్రాక్ట్ కుదుర్చుకోవాలి. కంపెనీ అంగీకరించిన ధరకు నిర్ణయించిన నియమాలకు అనుగుణంగా ఉత్పత్తులు చేయాలి. సహజంగా నియమాలకు అనుగుణంగా ఉత్పత్తులలో తేడాలు ఉంటాయి. వాటిని అవకాశంగా తీసుకొని నిర్ణయించిన ధరలు తగ్గించి కొనుగోలు చేస్తారు. కంపెనీ రేటు బహిరంగ మార్కెట్ కన్నా ఎక్కువగా ఉన్నప్పుడు ఒప్పందం రేటుకు రైతు అమ్మలేడు. తప్పనిసరిగా కొనాల్సిన స్థితి నుండి కంపెనీ తప్పించుకుంటుంది. అలాగే కాంట్రాక్ట్ వ్యవసాయంలో భూములను ఏకీకరణ చేసి భారీ యంత్రాలతో సాగు చేసి చివరకు రైతుల భూములను కాజేస్తారు. ఇప్పటికే దేశంలో 43 కోట్ల ఎకరాల సాగు భూమిలో 25 శాతం భూమి కాంట్రాక్ట్ వ్యవసాయం కిందనే సాగు అవుతున్నది. ఒకసారి కంపెనీ నియంత్రణలోకి పోయిన తరువాత వారు ప్రమాదకరమైన జన్యు మార్పిడి విత్తనాలతోబాటు, సస్య రక్షణ మందులను కూడా తమ ఇష్టం వచ్చినట్లు ప్రవేశ పెడతారు. ఆ విధంగా రైతులు భూముల నుండి నెట్టివేయబడతారు.

## విద్యుత్ సవరణ చట్టం

కేంద్ర ప్రభుత్వం '2003 విద్యుత్ చట్టాని'కి సవరణ ముసాయిదాను 2020 ఏప్రిల్ 17న విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రాల విద్యుత్ హక్కులన్నీ కేంద్రం చేతుల్లోకి వెళ్తాయి.

కేంద్రం కేటాయించిన విద్యుత్‌ను రాష్ట్రాలు వినియోగించుకోవాలి. అత్యధిక రేటు ఉన్న సంప్రదాయ విద్యుత్‌ను, కార్పొరేట్ సంస్థలు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను వినియోగించుకోవాలని చట్టంలో సూచించారు. చివరకు రాష్ట్రాల్లో రెగ్యులేటరీ కమిషన్‌ల పైన కేంద్ర రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి రేట్లు నిర్ణయిస్తారు. 2003 చట్టంలో 39 సవరణలు చేశారు. అందులో సెక్షన్ 109కి 10 (ఏ) కొత్తగా చేర్చారు. ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ కాంట్రాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీని కేంద్రం ఏర్పాటు చేస్తుంది. రీజినల్ డిస్పాచింగ్ బాధ్యతలు సెంట్రల్ డిస్పాచింగ్ పవర్‌కు బాధ్యతలు దఖలు పరుస్తారు. రాష్ట్రాలకు ఎలాంటి హక్కులు ఉండవు. ట్రాన్స్‌మిషన్, వీలింగ్ చార్జీలు తగ్గించి ఎక్కడి నుండి ఎక్కడికైనా విద్యుత్ సరఫరా చేసి ఉత్పత్తిదారులకు లాభాలు కట్టబెడతారు. ప్రస్తుతం దేశంలో సంప్రదాయ విద్యుత్ (హైడల్) 46 వేల మెగావాట్లు, సోలార్, పవన విద్యుత్ 70,000 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారు. దీని రేట్లు ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ ఈ విద్యుత్‌ను వినియోగంలోకి తేవటానికి ఈ చట్టం సహకరిస్తుంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న కార్పొరేట్ సంస్థలకు విపరీతమైన లాభాలు చేకూర్చడానికి, వినియోగదారులపై రూ.వేల కోట్ల భారాలు వేస్తారు.

## విత్తన చట్టం

కార్పొరేట్ల వత్తిడికి తలొగ్గిన మోడీ ప్రభుత్వం విత్తన చట్టం తేవటానికి నిరాకరిస్తున్నది. వాస్తవానికి రాష్ట్రాలలోనే విత్తన చట్టం చేయాలి. కానీ బడా, గుత్త, కార్పొరేట్ విత్తనోత్పత్తి సంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి విత్తన చట్టం రాకుండా చూస్తున్నాయి. 1966 దిగుమతి విత్తన చట్టం నేటికీ కొనసాగుతూనే ఉన్నది. నేడు భారత దేశం విత్తనాలను అనేక దేశాలకు ఎగుమతి చేస్తున్నది. ఈ స్థితిలో కూడా విత్తన చట్టం లేకపోవడం వల్ల విత్తనోత్పత్తి రైతులు కార్పొరేట్ విత్తన వ్యాపార సంస్థలకు బలిపశువులు అవుతున్నారు. రూ. వేల కోట్లు నష్ట పోతున్నారు. కానీ విత్తన వ్యాపారులు మాత్రం పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తున్నారు.

## ఈనాం మార్కెట్

ఈనాం మార్కెట్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం 2017లో తెచ్చింది. రాష్ట్రాలలోని మార్కెట్ చట్టాలను సవరణ చేసి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం విఫలమైందని స్వయంగా ప్రధాని మోడీ గత నెలలో ప్రకటించారు. అయినప్పటికీ ఈ చట్టం ప్రకారం ఏక గవాక్ష పద్ధతి, వ్యవసాయోత్పత్తి, మార్కెట్ కమిటీ సమాచారం, సేవలు తదితర అంశాలపై సవరణలు తెచ్చారు. మండీల ద్వారా ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేయటానికి ఇందులో సూచించారు. రాష్ట్రాలలోని అనేక మార్కెట్లు విడిగా నిర్వహణ చేయకుండా అన్ని మార్కెట్లను కలిపి ఈనాం పద్ధతిలోకి తెచ్చారు. దేశంలోని మార్కెట్లను ఆన్‌లైన్ ద్వారా ఏకీకరణ చేయడం, కార్పొరేట్ కొనుగోలుదారులకు అనుకూలంగా ధరలు నిర్ణయించడం జరిగింది. ఈనాం మార్కెట్‌లో ధరలు తగ్గడంతో రైతులు దేశవ్యాప్తంగా ఈ పద్ధతిని అమలు జరపటానికి నిరాకరించారు.

## నూతన విద్యా చట్టం

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా చట్టం అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా ఉండడానికి తగు రూపకల్పన చేసింది. రాష్ట్రాలలో మాతృభాషలో కాకుండా హిందీ, సంస్కృత భాషలను ప్రవేశ పెట్టడం, గత వాస్తవ చరిత్రలను మార్పు చేసి బిజెపిలో పని చేసిన నాయకుల చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చబోతున్నారు. చివరకు జోతిష్యాన్ని ఆస్ట్రాలజీ పేరుతో పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి ప్రజలను భావవాదం వైపు నెట్టే విద్య విధానాన్ని అమలు చేయబూనుకున్నారు. ఇప్పటికే రాష్ట్రాలలో వారి భాషలలో ప్రాథమిక విద్యనే కాక ఉన్నత విద్య వరకు బోధనలు జరుగుతున్నాయి. వీటిని మార్చడానికి నూతన విద్యా విధానం పేరుతో కేంద్రం ప్రవేశ పెట్టిన విధానం వలన దేశంలో నేడు ఉన్న విద్య ప్రమాణాలు తగ్గిపోతాయి. పరిశోధనలు, నూతన టెక్నాలజీ ఆవిష్కరణలు లేకుండా పోతాయి.

'ఒకే దేశం, ఒకే భాష, ఒకే మార్కెట్, ఒకే పన్ను' పేర్లతో ఇంత వరకు అనేక చట్టాలను తెచ్చి రాష్ట్రాల హక్కులను కాజేశారు. ఒకే పన్ను పేరుతో జిఎస్‌టి అమలులోకి తెచ్చి నేడు రాష్ట్రాలకు రూ. 3 లక్షల కోట్ల నష్టాలను కలిగించారు. ఇందులో పెట్రోల్‌పై సెస్ వేసి రూ.67,000 కోట్లు కేంద్రం ఇస్తానని, మిగిలిన రూ. 2.33 లక్షల కోట్లను రాష్ట్రాలే బయట అప్పులు తెచ్చుకోవాలని... ఇది దైవ నిర్ణయమని మోడీ ప్రభుత్వం చెప్పున్నది.

ఇంత వరకు తెచ్చిన చట్టాల వల్ల ఇప్పటికే రాష్ట్రాలు కేంద్రం చుట్టూ చేతులు కట్టుకొని రాష్ట్రాలు తిరిగే పరిస్థితి ఏర్పడింది. అధ్యక్ష తరహా పాలన ప్రమాదాన్ని రాష్ట్రాలు గుర్తించి కేంద్రం తెస్తున్న చట్టాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. వీటిని రాష్ట్రాలలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రస్తుత ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోటానికి, ఫెడరల్ విధానాన్ని రక్షించుకోటానికి లౌకికవాదులు, మేధావులు, దేశాభివృద్ధి కోరేవారు ఐక్యంగా కృషి చేయాలి. ❏

*(ప్రజాశక్తి దినపత్రికనుంచి)*

# కార్పొరేటు కంపెనీల లాభాలకు రైతుల్ని బలి చేసే వ్యవసాయ చట్టాలు

డా॥ సోము



ఆదివారంనాడు వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్, వాణిజ్యానికి సంబంధించిన వివాదాస్పద బిల్లులను రాజ్యసభలో అధికార పక్షానికి మెజార్టీ లేకున్నా, రైతుల నిరసనలు, తీవ్ర ప్రతిఘటనల మధ్య బలప్రయోగంతో ఆమోదింపబడినవి. గతంలో జూన్‌లోనే ఆర్డినెన్స్‌లు తేబడి, గత వారం లోకసభ ఆమోదం పొందిన ఈ బిల్లులు ప్రస్తుతం చట్టాలుగా మారాయి.

రాజ్యసభలో పన్నెండు ప్రతిపక్ష పార్టీలు ముక్త కంఠంతో ప్రతిఘటించినా, సుదీర్ఘ చర్చను, పార్లమెంటరీ కమిటీకి నివేదించాలని పట్టుపట్టినా పార్లమెంటు రక్షక భటుల (మార్షల్స్) సహకారంతో జలప్రయోగం చేసి ఓటింగు లేకుండా మూజువాణి ఓటుతో బిల్లులు చట్టాలుగా ఆమోదింపబడ్డాయి. అదివారం ఒక చీకటి రోజని, రైతుల పాలిట ఈ చట్టాలు మరణశాసనమని వివిధ రైతు సంఘాలు, ప్రతిపక్షాలు ఘోషిస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీ, వివిధ మంత్రి వర్యులు ఈ చట్టాల ఆమోదం చారిత్రకమని, వాటర్ షెడ్ ఘటన అని, గత డెబ్బై సంవత్సరాల్లో రైతులకు మార్కెట్‌లో లభించని స్వేచ్ఛను ప్రస్తుతం ఈ చట్టాలు ప్రసాదించాలని పేర్కొన్నారు.



ఈ నేపథ్యంలో ఈ చట్టాల్లోని అంతర్యాన్ని క్లుప్తంగా పరిశీలిద్దాం :

1. వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్య, విక్రయ బిల్లు (ది ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్, కామర్సు, ప్రమోషను అండ్ ఫెసిలిటీస్)

ఈ చట్టం ప్రకారం రైతులు తమ పంటలను దేశంలో ఏ ప్రాంతంలోనైనా, ఏ వర్తకునికైనా అధిక ధరకు అమ్ముకోవటానికి పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది, దేశవ్యాపితంగా "ఏకీకృత మార్కెట్"లో భాగంగా మార్కెట్ యార్డులకు (ఎపిఎమ్‌సి)లకు బదులుగా బయట ఏ వర్తకునికైనా విక్రయించుకోవటానికి స్వేచ్ఛ నివ్వబడింది.

**యదార్థం :** మార్కెట్ యార్డులు దేశంలోని ప్రతి జిల్లాలోను, ప్రధాన పట్టణాల్లోనున్నాయి. పెద్ద వర్తకులు, కంపెనీలు, సూపర్ మార్కెట్లు, మార్కెటు యార్డుల బయట, పోటీగా రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తులను కొనుక్కోవటానికి ఆస్కారం కల్పించ బడింది. రైతులకు చెల్లించే ధరలను వారే నిర్ణయించుకోవచ్చును. కాగా మార్కెట్ యార్డు నిబంధనలు, సెస్, బహిరంగ వేలం (ఓపెన్ ఆక్షన్) వంటి నిబంధనలు పాటించనవసరం లేదు. ప్రారంభంలో ఒకటి, రెండు సంవత్సరాలు మార్కెట్ యార్డులో ప్రభుత్వ ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ), టుబాకో బోర్డు, కాటను కార్పొరేషను వంటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల కంటే హెచ్చుగా పంటకు ధరలు చెల్లించినా, క్రమంగా అవి మూతబడి, తమ మోనోపలి ఏర్పడగానే ధరలను వివిధ కారణాలు (నాణ్యతా లోపం, డిమాండు లేమి) చూపి ప్రభుత్వ మద్దతు ధరల కన్నా తక్కువ చెల్లించవచ్చును. బ్రెజిల్, మెక్సికో, పెరూ దేశాల్లో కార్గిల్, వాల్‌మార్టు వంటి అమెరికా బహుళజాతి కంపెనీలు ధరలు తగ్గించినా రైతు ఏ ప్రభుత్వ ఏజన్సీకి ఫిర్యాదు చేసి న్యాయం కోరే అవకాశం ఉండదు.

''ఏకీకృత మార్కెట్''లో భాగంగా రైతు దేశంలో ఏ ప్రాంతానికయినా ఉత్పత్తులను తీసుకెళ్ళి అమ్ముకోవచ్చునన్నది ఆచరణ సాధ్యం కానిది. పండించిన ధాన్యం, కాయగూరలు, తమ సమీప పట్టణానికి, మార్కెట్‌కు తరలించటానికి ట్రాక్టరు లేదా లారీ రవాణా ఖర్చులు భరించటమే కష్టంగా ఉంటే రెండెకరాల్లో సేద్యం చేసే చిన్న కౌలు రైతుకు జనగామ లేదా నూజివీడు నుండి కలకత్తాకు రవాణా చేసి ఆ మార్కెట్‌లో లబ్ది పొందగలడా?

2. రైతు సాధికారికత, ఉత్పత్తులు అధిక ధరకు విక్రయానికి తోడ్పడే సేవల బిల్లు (ది ఫార్మర్స్ ఎంపవర్‌మెంటు అగ్రిమెంట్ ఆన్ ప్రైస్ ఎష్యూరన్స్ ఎండ్ ఫార్మ్ సర్వీసెస్)

“ఈ చట్ట ప్రకారం రైతులు తను ఉత్పత్తుల విక్రయానికి ముందస్తుగా నాణ్యత ఆధారం గాకుండా అగ్రిమెంట్లను వర్తకులు, కంపెనీలతో కుదుర్చుకొనే అవకాశం కలుగుతుంది.

రైతులు, వ్యాపారులు, సూపర్ మార్కెట్లు, కంపెనీలతో సీజన్‌కు ముందే అగ్రిమెంటు చేసుకొన్నా, పంట దిగుబడి తర్వాత సీజన్‌లో మార్కెట్‌లో డిమాండు లేదని, నాణ్యత లేదని ఇతర

సాకులతో కంపెనీలు ధరలను విపరీతంగా తగ్గించి వేస్తారు. ఆ సమయానికి ఎఫ్.సి.ఐ, (ప్రభుత్వ ఆహార సంస్థ) వంటి ప్రభుత్వ ఏజన్సీలు మూతబడి పోటీ లేక మోనోపలీ ఏర్పడి, కంపెనీలు 'సిండికేటు"గా ఏర్పడి ధరలు తగ్గించినా రైతుకు వేరే దారి లేదు. పంట అమ్ముకోవటానికి తమ ప్రాంతంలో చక్కెర పరిశ్రమ చెఱకు తోలిన రైతుకు ధర నిరాకరిస్తే, రొఖ్ఖం చెల్లించకపోతే చెఱకు రైతు దీనావస్త మనం చూస్తూనే ఉన్నాము.

ఈ చట్టం అగ్రిమెంటు ద్వారా "కాంట్రాక్టు వ్యవసాయానికి" అవకాశం కల్పించింది. దీని ద్వారా పెద్ద పెద్ద కంపెనీలైన రిలయన్సు (అంబానీ), ఆదానీ, వాల్‌మార్టు వంటి వారికి రైతుల నుండి భూమి సేకరించి, వేల ఎకరాల్లో అధునాతన కాంట్రాక్టు వ్యవసాయం చేసి, ప్రతిఫలంగా ప్రతీ ఏడాది రైతుకు లీజు (కౌలు) చెల్లింపబడుతుంది, విశేషమేమంటే రైతు తన సొంత భూమిలోనే కంపెనీలకు కూలీగా మారుతాడు.

గతంలో భూమి జమీందార్లు, భూస్వాముల ఆధీనంలో నుండేది. కమ్యూనిస్టు పార్టీలు నిర్వహించిన వీరోచిత భూ పోరాటాలు ఫలితంగాను, ఒత్తిడితో అమలైన (పాక్షికంగానైనా) భూసంస్కరణల ఫలితంగా దున్నే వానికి భూమి దక్కింది. నేడు దేశంలో 86.2 శాతం రైతాంగం రెండు మూడు ఎకరాల లోపు కమతాలు కలిగిన చిన్న రైతులే. ప్రస్తుత వ్యవసాయ చట్టాల వలన భూమి తిరిగి పేద రైతుల నుండి గుత్త పెట్టుబడిదారీ కంపెనీల ఆధీనంలోకి మారనున్నది.

పైగా పేదలకు రేషను బియ్యం అందజేసే ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్) అవసరాలకు ఎఫ్.సి.ఐ.కు ధాన్యాన్ని అమ్మవల్సిన అవసరం, బాధ్యత ఈ పెద్ద కంపెనీలకు లేదు. తద్వారా దేశంలో పేదలకు ఆహార అభద్రత సంభవించే ప్రమాదం కలదు.

3. అత్యవసర సరకుల చట్టం 1955 కు సవరణలు

ఈ చట్టంలో మార్పుల వల్ల వ్యాపారులు ధాన్యం, పప్పు దినుసులు, నూనెగింజలు, వంటనూనెలు, బంగాళా దుంపల సేకరణ, నిల్వ, ఎగుమతులపై ఇప్పటివరకు ఉన్న ఆంక్షలు పూర్తిగా తొలగింపబడినవి.

**యదార్థం :** పెద్ద కంపెనీలు, వర్తకులు, ఎగుమతిదార్లు, సూపరు మార్కెట్లు (ఎసంషియల్ కమోడిటీస్ ఏక్ట్ 1955) పంట సీజనులో రైతుల నుండి చౌకగా ఉత్పత్తులను సేకరించి, గోదాముల్లో నిల్వ చేసి, కృత్రిమ కొరతను సృష్టించి, తద్వారా అధిక ధరలకు విక్రయించటానికి వీలు కలుగుతుంది. ప్రతీ సంవత్సరంలో ఉల్లిపాయలు, టమాటా తదితర ఉత్పత్తుల విషయంలో మనం చూస్తున్నదే. వ్యాపారస్తులు, సూపర్‌మార్కెట్లు దొంగనిల్వలతో అధికంగా ధరలను పెంచి వేసినా ప్రభుత్వానికి పర్యవేక్షించేటందుకు, కొరతలను తగ్గించటానికి చర్యలు తీసుకొనే ఆస్కారం ఉండదు.

గత శతాబ్దం డెబ్భైవ దశకంలో వర్తకులు కూడబలుక్కుని, దొంగ నిల్వలు చేసి బియ్యం, వంట నూనెలు, సబ్బులు, నోటు పుస్తకాలు, ఎరువులు బ్లాక్ మార్కెటింగ్ చేసేవారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజలను సమీకరించి అక్రమంగా నున్న దొంగ నిల్వలను బయటకి తీసి, సరసమైన ధరలకు ఆ వర్తకుల గోడౌన్ల, దుకాణాల ముందే సరసమైన ధరలకు అమ్మి "దొంగ నిల్వల వెలికితీత" ఉద్యమాన్ని నిజాయితీగా, నిఖ్ఖచ్చిగా నెరిపింది. కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితంగా, ఒత్తిడితో ఆనాడు ప్రభుత్వానికి అత్యవసర సరుకుల చట్టంలో కఠినమైన క్లాజులు చేర్చి దొంగ వ్యాపార్లను శిక్షించే ఆస్కారం కుదిరింది. కానీ ప్రస్తుతం ఈ చట్టంలో చేసిన మార్పులతో ఇకముందు అలాంటి చర్యలు అసంభవం.

అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులను 2005వ సంవత్సరంలో బీహారు, ఆ తర్వాత మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు తొలగించినవి. 15 సంవత్సరాల తర్వాత పరిస్థితి ఏ స్థితికి వచ్చిందంటే బీహారులో క్వింటాలు మొక్కజొన్నకు రూ.1800 రావల్సి ఉండగా, వరికి రూ.1850 మద్దతు ధర కాగా రైతుకు మార్కెట్ యార్డులు లేకపోవటంతో ప్రైవేటు వర్తకుల నుండి దక్కేది మొక్కజొన్న క్వింటాలుకు రూ.1000 (వెయ్యి), వరి రూ.1100లు మాత్రమే, పైగా ఎఫ్.సి.ఐ. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ అవసరాలకు పెట్టుకొన్న టార్గెట్‌లో కనీసం 1 శాతం కూడా గోధుమలను రబీ 2019-20 సీజనులో సేకరించలేకపోయింది. ఇక దేశవ్యాప్తంగా ఈ పరిస్థితి వస్తే ప్రభుత్వ ఆహార పంపిణీ వ్యవస్థ మూతపడి దేశంలో ఆహార అభద్రత రాగలదు. గుత్త పెట్టుబడిదారుల సేవలో నున్న ప్రస్తుత ప్రభుత్వం బహుశా ఇదే కోరుకున్నట్లుంది.

1991వ సంవత్సరంలో గత ప్రధాని పి.వి.నర్సింహారావు ప్రభుత్వం నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక రంగాన్ని బార్లా తెరిచి దేశీ పెట్టుబడిదారులకు, విదేశీ బహుళజాతి కంపెనీలకు లాభాలు చేకూర్చింది. గత ముప్పై సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలన్నీ ప్రపంచ ఆర్థిక సామ్రాజ్యవాద సంస్థల ఆదేశాలననుసరించి ప్రజా వ్యతిరేక ఉదారవాద విధానాలు అమలు చేశాయి. ప్రజల్లో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగి సామాన్యుని బ్రతుకు మరింత దీనమైంది. నేడు బ్యాంకులు, బొగ్గు గనులు, బీమా సంస్థలు, రైల్వేలు తదితర ప్రభుత్వ సంస్థలను ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటీకరించింది, ఈనాడు ఈ వ్యవసాయ చట్టాల ద్వారా రైతులు, సామాన్య వినియోగదార్లను గుర్తుపెట్టుబడిదారీ కంపెనీల దోపిడీకి వదిలి వేస్తున్నది. ❑



# కమ్యూనిస్టు నీతే తన జీవన విధానం ఉద్యమకారుడు - అధ్యయనశీలి "కొల్లి"

**- టి.లక్ష్మీనారాయణ**

అంతరించిపోతున్న పాతతరం కమ్యూనిస్టుల కోవకు చెందిన వాడు **అమరజీవి కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు గారు.** కమ్యూనిస్టు భావజాలాన్ని, నీతిని, నైతిక విలువలను త్రికరణశుద్ధిగా ఆచరించినవాడు. కమ్యూనిస్టు "ఛాదస్తుడు". అధ్యయనశీలి, ఉద్యమకారుడు, నిర్మాణదక్షత ఉన్నవాడు. పోరాటంలో వెన్ను చూపడం తెలియని వాడు. త్యాగం చేయడమే కానీ, ఆర్జన పట్ల ఆలోచనే లేనివాడు. అనారోగ్యం, వృద్ధాప్యం ఉద్యమకారుడికి అవరోధం కాదని తెగించి అడుగు ముందుకేసినవాడు. ప్రలోభాలకు లొంగనివాడు. పదవుల పట్ల వ్యామోహం లేనివాడు. పదవులంటే బాధ్యతని తలచినవాడు. బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలన్న దృక్పథం కలిగినవాడు. ప్రాంతాలు, కుల, మతాలకు అతీతంగా సామాజికాభివృద్ధే లక్ష్యంగా పోరు బాటలో వడివడిగా నడిచినవాడు. నిరాడంబరమైన కమ్యూనిస్టు జీవితం గడిపినవాడు.



స్వాతంత్రోద్యమ కాలంలో, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతం అంతర్భాగంగా ఉన్న రోజుల్లో, 1930వ దశకం ద్వితీయార్థ భాగంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర నాట ఆవిర్భవించింది. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా, స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడుతూ, మార్క్సిస్టు భావజాలానికి ఆకర్షితులైన, రష్యా గడ్డపై విజయ పతాకాన్ని ఎగురవేసిన అక్టోబరు మహావిప్లవంతో ఉత్తేజితులైన విప్లవకారులు తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి నడుం బిగించారు. 1940వ దశకంలో ప్రజల భాగస్వామ్యంతో, పోరాటాలు, ఉద్యమాల పునాదిగా శక్తివంతమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నాటి తరం కమ్యూనిస్టులు నిర్మించారు. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అది స్వర్ణయుగంగా అభివర్ణించవచ్చు. తర్వాత తరానికి చెందిన వారు కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు గారు.

### తెలుగు వాళ్ళకు ప్రత్యేక రాష్ట్రంకై ఉద్యమం :

1938 ఏప్రిల్ 7న కృష్ణా జిల్లా ముసునూరు మండలం (నూజివీడు తాలూకా) గుడిపాడు గ్రామంలో ఒక మధ్యతరగతి రైతు కుటుంబంలో కొల్లి వెంకయ్య, రమణమ్మ గార్లకు జన్మించారు. అదొక కమ్యూనిస్టు ప్రభావిత గ్రామం. నాలుగేళ్ళ వయస్సులోనే బాల సంఘంలో చేరారు. ముసునూరు హైస్కూలు లో చదువుతూ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఎ.ఐ.ఎస్.ఎఫ్.) ఉద్యమ నిర్మాణానికి పూనుకొన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు వాళ్ళకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, మాతృభాషకు సరియైన గుర్తింపు లేదని, ఉద్యోగాల నియామకంలో తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్న ఆవేదనతో తెలుగు వాళ్ళకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఆకాంక్ష బలంగా వేళ్ళూనుకొన్న నేపథ్యంలో పొట్టి శ్రీరాములు గారు 1952లో ఆమరణ నిరాహారదీక్షకు కూర్చొని, ప్రాణత్యాగం చేశారు. "జై ఆంధ్ర" ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడింది. కా.కొల్లి విద్యార్థులను కూడగట్టి సమ్మె చేయించారు. విద్యార్థి నాయకుడుగా కా.కొల్లి గుర్తింపు పొంది, కమ్యూనిస్టు భావాల వైపు విద్యార్థులను ఆకర్షించడంతో కాంగ్రెస్ అభిమాన విద్యార్థులకు, నాయకులకు కన్నుకుట్టింది. పాఠశాల యాజమాన్యం కాంగ్రెస్ వాళ్ళ చేతుల్లో ఉంది. హెడ్ మాస్టరు ద్వారా తప్పుడు కేసును బనాయించి, స్కూలు నుండి సస్పెండ్ చేశారు. అటుపై ఏలూరులో ప్రయివేటుగా మెట్రిక్యులేషన్ పూర్తి చేసుకొని, విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్. కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరి, అదే కళాశాలలో డిగ్రీ పట్టా పుచ్చుకొన్నారు. బీహార్‌లోని భాగల్పూర్ యూనివర్సిటీలో ప్రయివేటుగా పి.జి. డిగ్రీ పొందారు.

### గడ్డు కాలంలో ఉద్యమ నిర్మాణ కర్తవ్యం :

1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుండి 41 స్థానాల్లో విజయదుందుభి మ్రోగించిన కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 1955లో జరిగిన

మధ్యంతర ఎన్నికల్లో చతికలబడి కేవలం 15 స్థానాల్లోనే విజయం సాధించడంతో ఉద్యమం నిరాశా నిస్పృహాల్లోకి నెట్టబడింది. ఆ నిరుత్సాహ వాతావరణం గానీ, హైస్కూలు నుండి సస్పెండ్ కావడంతో తన చదువుకు కలిగిన అంతరాయం గానీ, కా.కొల్లి ఏ మాత్రం ప్రభావితుడు కాకుండా విద్యార్థి ఉద్యమం నిర్మాణానికి నడుంకట్టారు. 1956లో ఎ.ఐ.ఎస్.ఎఫ్. విజయవాడ పట్టణ కార్యదర్శిగా, 1957లో కృష్ణా జిల్లా కార్యదర్శిగా, 1961లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొని 1965 వరకు క్రియాశీలంగా పని చేశారు. కా.పువ్వాడతో కలిసి కాలేజీకి ఎదురుగానే అద్దెకు రూం తీసుకొని, దానికే ఎ.ఐ.ఎస్.ఎఫ్. కార్యాలయమని బోర్డు పెట్టుకొంటే, అది గిట్టని సంఘ వ్యతిరేక శక్తులు దాడి చేస్తే పార్టీ వాళ్ళ సహకారంతో ఎదుర్కొన్నారు. తాను కర్రసాము నేర్చుకొని, చలసాని వెంకటరత్నం గారి సహకారంతో నిలదొక్కుకొని, పొట్లూరు నాగేశ్వరరావును విద్యార్థి యూనియన్ ఎన్నికల్లో నిలబెట్టి మొదట ఓడిపోయినా, ఎస్.ఎఫ్.ను బలోపేతం చేసి 1961 తర్వాత ఎదురులేని శక్తిగా రూపొందించారు. బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించారు. ప్రయివేటు యాజమాన్యం క్రింద నిర్వహించబడుతున్న ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్. కళాశాల అధ్యాపకులకు జీతభత్యాలు కూడా సక్రమంగా ఇవ్వలేని స్థితిలో ఉంటే కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న డిమాండుతో విద్యార్థులను సంఘటితపరచి, 1957లో పెద్దఎత్తున ఆందోళన చేసి, విజయం సాధించిన ఘనత కా.కొల్లికే దక్కుతుంది. అలాగే, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న డిటెన్షన్ విధానం రద్దుకై ఆందోళన చేసి విజయం సాధించారు. విద్యార్థి ఉద్యమం నుండి 'రిలీవ్' అయి వచ్చిన తర్వాత 1965లో కృష్ణా జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొన్నారు. విజయవాడ నగర పార్టీ సహాయ కార్యదర్శిగా, కొంత కాలం ఇన్‌ఛార్జి కార్యదర్శిగా కూడా పని చేసి, ప్రజా సమస్యలపై ఆందోళనా కార్యక్రమాల్లో భాగస్వామయ్యారు.

### ఉద్యమం - త్యాగాలతోనే విశాఖ ఉక్కు :

కమ్యూనిస్టు ఉద్యమ నినాదమైన "విశాలాంధ్రలో ప్రజా రాజ్యం" పట్ల మనసావాచా అంకితభావంతో జీవితాంతం ఉద్యమ బాట పట్టిన కమ్యూనిస్టు కా.కొల్లి. తెలుగు జాతి ఆకాంక్షలు, ఉద్యమాల ఫలితంగా 1953లో ఆంధ్ర రాష్ట్రం, 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాకారమైనాయి. ఆర్థికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన కోసం ఉద్యమాలు చేయాల్సిన అజెండా ముందుకొచ్చింది. ఆ ఉద్యమంలోనూ ఆయన ముందు వరుసలో నిలబడ్డారు.

నేడు తెలుగు జాతి సగర్వంగా మా విశాఖపట్నం అని చెప్పుకొనే నేటి ఆధునిక నగరం, ఆర్థిక నగరం, పారిశ్రామిక నగరం నిర్మాణానికి మూలస్థంభమైన విశాఖ ఉక్కు కర్మాగారం సాధన కోసం సాగిన వీరోచిత పోరాటంలో విద్యార్థి – యువజన నాయకుడిగా క్రియాశీల పాత్ర పోషించారు. "విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు" డిమాండ్ తెలుగు నాట నలుచెరగుల మారుమ్రోగింది. విజయవాడ కేంద్రంగా ఏర్పడిన విద్యార్థుల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనరుగా కా.కొల్లి, సిపిఐ(యం)కు చెందిన కా.జి.రాధాకృష్ణమూర్తి కన్వీనరుగా ఉద్యమానికి నాయకత్వం వహించి, మిలిటెంట్ పోరాటాలు చేశారు. 1966 అక్టోబరు 31 నాటికి ఉద్యమం ఉధృత రూపం దాల్చింది. నాటి కేంద్ర ఉక్కు శాఖా మంత్రి నీలం సంజీవరెడ్డి గారు రాజీనామా చేయాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. విజయవాడ నగరంలో ఉన్న ఆయన విగ్రహాన్ని విద్యార్థులు ధ్వంసం చేశారు. కూలగొట్టడంలో ప్రధాన పాత్రధారుడు కొల్లి గారని పోలీసులు పెట్టిన కేసుల్లో రెండేళ్ళ జైలు శిక్ష విధించి, రాజమండ్రి సెంట్రల్ జైలులోకు పంపించారు. దానికి నిరసనగా విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. ఈ ఉద్యమానికి మద్ధతుగా సిపిఐ, సిపిఐ(యం) శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు రాజీనామా చేశారు. ఉభయ పార్టీల రాష్ట్ర కార్యదర్శులుగా ఉన్న కా.నీలం రాజశేఖరరెడ్డి, కా.మోటూరు హనుమంతరావులతో పాటు కా.దాసరి నాగభూషణ రావు, కా.తమ్మిన పోతరాజు తదిరత నాయకులను అరెస్టు చేసి, సబ్–జైల్లో నిర్బంధించబడ్డారు. ఆరు నెలల జైలు శిక్ష అనంతరం హైకోర్టు ఈ కేసు నుండి కా.కొల్లిని విముక్తి చేసింది. ఈ ఉద్యమం సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా మొత్తం 32 మంది మరణిస్తే, విజయవాడలోనే పోలీసు కాల్పుల్లో 12 మంది, వారిలో ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. సమరశీల పోరాటం, ప్రాణ త్యాగాలతోనే విశాఖ ఉక్కు కర్మాగారం సాధించుకోబడ్డది.

### భూపోరాటాలకు ఊపిరులూదారు :

కమ్యూనిస్టు ఉద్యమం అజెండాలోని "దున్నేవానికే భూమి" నినాదాన్ని పుణికిపుచ్చుకొన్నారు. కృష్ణా జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శిగా 1978లో బాధ్యతలు తీసుకొని 1991 వరకు ఉన్న 13 సం.ల కాలంలో కా.కొల్లి భూ పోరాటాలకు పార్టీ యావత్తును రంగంలోకి దించి, నేతృత్వం వహించారు. జమీందారీ వ్యవస్థ బద్దలైనా చల్లపల్లి జమీందారు వేలాది ఎకరాల మిగులు భూమిని అక్రమంగా సొంతం చేసుకొని అనుభవిస్తుంటే ఆ భూములను పేదలకు పంచాలన్న డిమాండుతో అనేక సంవత్సరాలుగా

ఉద్యమం జరుగుతున్నా ప్రభుత్వాలు పెడచెవినపెట్టాయి. చల్లపల్లి జమీందారు మిగులు భూముల ఆక్రమణ ఉద్యమాన్ని పేద ప్రజల భాగస్వామ్యంతో, కా.చండ్ర రాజేశ్వరరావు, కా.దాసరి నాగభూషణ రావు సంపూర్ణ సహాయ సహకారాలు, ప్రత్యక్ష భాగస్వామ్యంతో, జిల్లా పార్టీ నాయకత్వం, సిపిఐ(యం) తోడ్పాటుతో దశల వారిగా నిర్వహించి, ఘనవిజయం సాధించడంలో కా.కొల్లి ముఖ్యభూమిక పోషించారు. అదే స్ఫూర్తితో జిల్లాలోని వివిధ కేంద్రాలలో జమ్మవరం, తునికిపాడు, వట్టిగుడిపాడు, నర్సాపురం, చిత్తపూరు, ముచ్చింతాల, కనిమెర్ల – పర్వతాపురం తదితర అనేక భూపోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించి, పేదలకు భూములు దక్కే వరకు అలుపెరగని పోరు సల్పారు. కృష్ణా జిల్లా భూపోరాటాల చరిత్రలో క్రియాశీల పాత్ర పోషించినవాడుగా అందరి మన్ననలను పొందారు. విజయవాడ ప్రయివేటు సిటీ బస్సుల జాతీయకరణ కోసం ఆందోళన చేసి విజయం సాధించారు. తర్వాత కాలంలో సిపిఐ రాష్ట్ర బాధ్యతల్లోకి వెళ్ళాక కా.కొల్లికి శ్రీకాకుళం జిల్లా పార్టీని 'గైడ్' చేయమని కొంత కాలం బాధ్యత అప్పగించారు. అంతకు ముందు కా.దాసరి నాగభూషణ రావు ఆ జిల్లా పార్టీ నాయకత్వాన్ని ప్రోత్సహించి చేపట్టిన కంబిరిగాం భూపోరాటాన్ని, మరింత ఉధృతంగా కా.కొల్లి కొనసాగించేలా కార్యాచరణ అమలు చేయించారు. పోలీసులు పెట్టిన కేసుల్లో అనేక సంవత్సరాలు కోర్టుకు హాజరైనారు.

సర్ ఆర్థర్ కాటన్ కృషి ఫలితంగా పుష్కలంగా సాగునీరు లభించడంతో కృష్ణా డెల్టా ప్రాంతం వ్యవసాయకంగా అభివృద్ధి చెందింది. తూర్పు కృష్ణా ప్రాంతం అభివృద్ధి చెందినా, కా.కొల్లి పుట్టి పెరిగిన పశ్చిమ కృష్ణా మెట్ట ప్రాంతం కావడంతో అభివృద్ధికి నోచుకోలేదు. నీటి అవసరాన్ని గుర్తించిన ఆయన కృష్ణా డెల్టా ఆయకట్టు పరిరక్షణకు ఆధునీకీకరణ కోసం, పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం కోసం, పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు సాధన కోసం రాజకీయాలకు అతీతంగా వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాలతో కలిసి, వ్యక్తిగతంగా అంకితభావంతో కృషి చేశారు. 1999లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థిగా విజయవాడ స్థానంలో పోటీ చేశారు.

## రైతాంగానికే జీవితం అంకితం :

1992లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా కరీంనగరులో ఎన్నికై దాదాపు 14 సం.ల పాటు ప్రధాన కార్యదర్శి (1992–2002)గా, అధ్యక్షులు(2002–06)గా, అటుపై ఎ.ఐ.కె.ఎస్. ఉపాధ్యక్షులు (2007 నుండి)గా బాధ్యతలు నిర్వహించారు. కా.కొల్లి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొనే నాటికి పత్రికా ప్రకటనలకే పరిమితమైన రైతు సంఘం ఉండేది. ఆయన నిర్మాణంపై దృష్టి సారించి జిల్లాలకు, క్షేత్ర స్థాయి వరకు విస్తరించేలా కఠోరదీక్షతో కృషిచేశారు. రైతు సంఘానికి ఒక నిర్మాణ స్వరూపాన్ని తీసుకొచ్చి, రైతాంగ సమస్యలపై స్వతంత్రంగాను, ఇతర సంఘాలతో కలిసి ఉమ్మడిగాను, ఆందోళనలు, ఉద్యమాల నిర్వహణకు చొరవ తీసుకొని విశేష కృషి చేశారు. ఉద్యమ నిర్మాణంలో పత్రికను ఒక ఆయుధంగా భావించి, ఆర్థిక వనరులను సమకూర్చుకొంటూ అష్టకష్టాలుపడుతూ, పట్టుదలతో "రైతు లోకం" మాసపత్రిక సంపాదకులుగా ఉండి క్రమం తప్పకుండా నడిపారు. ఆ.ప్ర.రైతు సంఘం వాణిని రైతాంగంలోకి తీసుకెళ్ళారు. నాతోనూ పలు వ్యాసాలు వ్రాయించారు. రైతాంగానికి "గైడ్"గా వ్యవసాయానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో "రైతన్న డైరీ"ని ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ప్రచురించారు. సంఘ నిర్మాణం, సమస్యలపై రైతుల్లో అవగాహన పెంచడం కోసం చైతన్య యాత్రలు, సభలు, సదస్సులు, ప్రభుత్వంపై వత్తిడి తేవడానికి ఆందోళనలు, ఉద్యమాలు ఒక నిర్విరామ కార్యాచరణకు పూనుకొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విచ్చిన్నం చేయడానికి 1969లో "జై తెలంగాణ", 1972లో "జై ఆంధ్ర" ఆందోళనలు పెచ్చరిల్లినప్పుడు సమైఖ్య రాష్ట్ర పరిరక్షణ కోసం భారత కమ్యూనిస్టు పార్టీ స్థిరంగా, బలమైన శక్తిగా ఎదురొడ్డి నిలిచింది. పార్టీ శ్రేణులన్నీ మొక్కవోని ధైర్యంతో నిలబడ్డాయి. ఆ ఉద్యమాలలో ముందు వరుసలో నిలబడ్డ కా.కొల్లి గారికి చారిత్రక అనుభవాలున్నాయి. రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టుల సాధన కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి మొదలు పెట్టారు. 1998 మే నెలలో మండుటెండలను సహితం లెక్క చేయకుండా శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుండి "రైతాంగ సమర శంఖారావ రథయాత్ర"ను 40 రోజుల పాటు రాష్ట్ర వ్యాపితంగా నిర్వహించి, హైదరాబాదులో ముగించారు. రాష్ట్ర ఐక్యతను పరిరక్షించుకోవాలంటే నీటి సమస్యకు హేతుబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనాలన్న ఆలోచనతో కా.కొల్లి తన ఆలోచన లకు పదునుపెట్టారు. గోదావరి నదీ జలాల వినియోగ సమస్యపై ప్రధానంగా కేంద్రీకరించి పని చేశారు. 1998 ఆగస్టులో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించి, వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నేతలను అందులో భాగస్వాములను చేశారు. అదే తరహాలో 1999 ఫిబ్రవరిలో విజయవాడలో సదస్సు నిర్వహించారు.

## ఆమరణ నిరాహారదీక్ష :

తెలంగాణలోని మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలను ఎత్తిపోతల పథకాల ద్వారా తరలించి, సమగ్రాభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడానికి పలు కార్యక్రమాలు, ఆందోళనలు నిర్వహించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సందర్భాన్ని ఎంచుకొని, గోదావరి నదీ జలాలను తరలించి తెలంగాణను సస్యశ్యామలం చేయాలన్న డిమాండుతో 1999 మార్చి 22న ఇందిరాపార్కు వద్ద ఆమరణ నిరాహారదీక్షకు పూనుకొన్నారు. ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలపై గణనీయమైన ప్రభావం పడింది. శాసనసభలో సమగ్రమైన చర్చ జరిగింది. గోదావరి నదీ జల్లాల వినియోగానికై ఒక ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చట్ట సభలో ప్రకటించింది. ఆ విషయాన్ని అధికారికంగా రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు ఆమరణ నిరాహారదీక్షా శిబిరం వద్ద వివిధ రాజకీయ పక్షాల నాయకుల సమక్షంలో తెలియజేసిన మీదటనే మార్చి 24న దీక్ష ఉపసంహరించారు. తర్వాత కాలంలో ఆ వాగ్దానం అమలులో జాప్యం జరుగుతుంటే ఆవేదన చెంది గోదావరి నదిలో జలసమాధికై సిద్ధపడ్డారు. రాష్ట్ర పార్టీ నాయకత్వం గట్టిగా ఆదేశించడంతో ఆ ఆలోచనను విరమించుకొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ జల దర్శిని :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి పారుదల రంగం, నదీ జలాల వినియోగంపై లోతైన అధ్యయనం చేసి, తన ఆలోచనలను జోడించి, రాష్ట్రంలో ప్రవహిస్తున్న నదులు, వాటిలో లభించే నీరు, నదీ జలాల వినియోగం, నిర్మించబడిన/నిర్మాణంలో ఉన్న/నిర్మాణం చేపట్టాల్సిన భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్రమైన సమాచారంతో "ఆంధ్రప్రదేశ్ జలదర్శిని" శీర్షికతో ఒక పెద్ద పుస్తకాన్ని ఎమెస్కో ప్రచురణాలయం వారి సహకారంతో 2006లో ప్రచురించారు. నాటి ముఖ్యమంత్రి డా.వై.యస్.రాజశేఖరరెడ్డి గారు హైదరాబాదు జూబ్లిహాలులో ఆ పుస్తకాన్ని ఆవిష్కరించి, అధికారికంగా ఒక మెమో జారీ చేసి, నీటి పారుదల రంగానికి సంబంధించి ఒక మార్గదర్శిగా ఉపయోగపడుతుందని అన్ని జిల్లాలలోని ఇరిగేషన్ కార్యాలయాలకు, అధికారులకు పంపించారు.

కృష్ణా డెల్టా ఆధునీకీకరణ కోసం, పోలవరం సత్వర నిర్మాణం కోసం, నాగార్జునసాగర్ ఆయకట్టు పరరక్షణ, పులిచింతల నిర్మాణం, బుడమేరు, రాయలసీమలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు, ఉత్తరాంధ్రలోని వంశధార, నాగావళి, తోటపల్లి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించి, యుద్ధప్రాతిపదికపై పూర్తి చేయాలని అంకితభావంతో నిరంతరం పోరాడిన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతాలకు అతీతంగా సాగునీటి ప్రాజెక్టుల సత్వర నిర్మాణం కోసం పరితపించిన రైతు నాయకుడు.

## పాట రచయిత అవతారమెత్తాడు :

గోదావరి - కృష్ణా - పెన్నా నదుల అనుసంధానంపై నేడు పెద్ద ఎత్తున చర్చించుకొంటున్నాం. ఒకవైపు కళ్ళముందే సముద్రం పాలౌతున్న గోదావరి జలాలు, మరొకవైపు కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గిపోతున్నది, ఇంకోవైపు కరువు కాటకాలతో నీటి కోసం విలవిల్లాడుతున్న తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు చూసి హృదయం ద్రవించింది. ఆయన కవి కాదు. కానీ, గుండె చప్పుడును " గోదావరక్కా! గోదావరక్కో! చెల్లి కృష్ణమ్మను ఆదుకో అక్కా!" అంటూ గోదావరి - కృష్ణా నదుల అనుసంధానం ఆవశ్యకతను గుర్తించి 2006 సం.లో ఏకంగా పాటనే రాసేశారు. ఆయనే రచించిన "ఆంధ్రప్రదేశ్ జలదర్శిని" పుస్తకం వెనుక కవర్ పేజీపై ఆ పాటను అచ్చువేశారు. దాన్ని పాడించి, ఆడియో క్యాసెట్ తయారుచేయించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ప్రముఖ నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమ సహచరులైన కా.నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) సహకారాన్ని కా.కొల్లి అర్థించారు. ఛాదస్తం కాకపోతే ఈయనేంటి పాట రాయడమేంటన్న భావనతో మొదట తేలికగా తీసుకొన్నప్పటికీ నల్లూరన్న ప్రజానాట్య మండలి ముద్దుబిడ్డ, సినీ సంగీత దర్శకులు, నేపథ్య గాయకులు వందేమాతరం శ్రీనివాస్ గారి చేత చక్కటి బాణీలో పాడించారు. పాట రికార్డింగ్ తర్వాత నల్లూరి గారే అబ్బురపడ్డారు. కా.కొల్లి గొప్ప పాట రాసాడంటూ కొనియాడుతున్నారు.

## వృద్ధులపై కనికరం చూపని పోలీసుల లాఠీలు :

విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సం.లో జరిగిన ఉద్యమంలో కా.కొల్లి అగ్రభాగాన నిలబడ్డారు. ఆ ఉద్యమంలో నేను భాగస్వామినే. రాష్ట్ర నలుచెరుగుల నుండి తరలివచ్చిన యాభై వేల మందికిపైగా ప్రజానీకం హైదరాబాదులో ప్రజావాణిని ప్రతిధ్వనిస్తూ, కదం తొక్కుతూ ఇందిరా పార్క్ నుండి బషీర్ బాగ్ కూడలి చేరుకొన్నాం. పోలీసు బలగాలు భారీ స్థాయిలో మోహరించి ఉన్నాయి. అంచెలంచెలుగా ముళ్ళ కంచెలను ఏర్పాటు చేశారు. బాష్పవాయువు తూటాలు ప్రయోగించారు. గుర్రాలతో తొక్కించారు. ఫైబర్ లాఠీలతో స్వైరవిహారం చేశారు. వందలాది మందిని తీవ్రంగా గాయపరిచారు. మహిళలని చూడలేదు. వృద్ధులని కనికరించలేదు. కా.కొల్లి నాగేశ్వరరావు,

కా.మానం ఆంజనేయులు (మాజీ శాసనసభ్యులు) ఒకరి మీద ఒకరు కుప్పకూలిపోయినా వదిలి పెట్టకుండా కొట్టారు. అటుపై పోలీసులు చుట్టుముట్టి కా.కొల్లి, కా.మానం ఆంజనేయులు, కా.సురవరం సుధాకరరెడ్డి, కా.గుమ్మడి నర్సయ్య (సిపిఐ, యం.యల్, న్యూ డెమోక్రసీ, శాసనసభ్యులు), కా.పశ్యపద్మ, కా.వేములపల్లి వెంకట్రామయ్య, కా.వి.సంధ్య, కా.జి.ఝాన్సీ, నాతో పాటు 22 మంది వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను పోలీసు వ్యానులోకి బలవంతంగా ఎక్కించారు. మా కళ్ళ ముందే పోలీసులు తూటాలు పేల్చారు. ఇద్దరు యువకిశోరాలు బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి నేలకొరిగారు. ఆ దృశ్యాలు నాకళ్ళ ముందు నేటికీ కదలాడుతున్నాయి. మరో కూడలి జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద లాఠీఛార్జీలో గాయపడిన యువకుడు రామకృష్ణ మరణించాడు. మాపై అక్రమంగా హత్యానేరం కేసును మోపారు. ఆ కేసులో నన్ను మూడో ముద్దాయిగా పేర్కొన్నారు. శాసనసభలో గొడవ చేస్తే లోక్‌సభ సభ్యులైన సురవరం సుధాకర రెడ్డి, శాసనసభ్యులైన గుమ్మడి నర్సయ్య గార్లపై మాత్రమే కేసును ఉపసంహరించారు. తర్వాత అధికారంలోకొచ్చిన ప్రభుత్వం మాపై ఉన్న కేసును ఉపసంహరించింది. నా కమ్యూనిస్టు ఉద్యమ జీవితంలో నేను ప్రత్యక్షంగా పాల్గొన్న చారిత్రాత్మకమైన ప్రజా ఉద్యమమది. ఆ పోరాటంలో అగ్రభాగాన నిలిచి, తెగించి పోరు సల్పి, లాఠీఛార్జీలో తీవ్రంగా గాయపడ్డారు కా.కొల్లి నాగేశ్వరరావు గారు. ఆ దృశ్యాలు హృదయవిదారకమైనవి.

### మాన్సెంటో దోపిడికి అడ్డుకట్ట :

బహుళజాతి విత్తన కంపెనీ మాన్సెంటో కంపెనీ దోపిడీపై గళమెత్తడమే కాకుండా సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసి, పోరాడి విజయం సాధించారు.

### రచనలతో జనంలోకి :

రైతాంగ సమస్యలు, సాగునీటి సమస్యలు, నదీ జలాల వినియోగం, ప్రాజెక్టులు తదితర అంశాలపై నిరంతరాయంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. అనేక మందిని ప్రోత్సహించి వ్యాసాలు వ్రాయించారు. వ్యాస రచనను ఒక వ్యసనంగా మార్చుకొన్నారు. ఆయన వ్రాసిన అనేక వ్యాసాలు విశాలాంధ్ర దినపత్రిక, ఇతర పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జలదర్శినితో పాటు వివిధ అంశాలపై చిరుపుస్తకాలను వ్రాసి, ప్రచురించారు. భారత దేశ స్వావలంబనకు, వ్యవసాయాభివృద్ధికి, సైన్సు పురోభివృద్ధికి, ప్రతీకూల అంశాలలో "డంకెల్ డ్రాఫ్టులో మార్పు సాధించాలి" (ఆగస్టు1993, రెండు ముద్రణలు), ప్రపంచ వాణిజ్య సంస్థ (గాట్), ప్రపంచ వాణిజ్య సంస్థ–ప్రజల అప్రమత్తత, రైతాంగాన్ని ఆత్మహత్యలు నుండి మళ్ళించడం – పోరు బాట వైపు నడిపించడం (మే 1998, రైతాంగ సమర శంఖారావ రథయాత్ర లక్ష్యం), భారత దేశ రైతాంగం ప్రయోజనాలకు హాని కలిగించే "ప్రపంచ వాణిజ్య సంస్థ–రైతాంగ రక్షణ" (ఆగస్టు 2001), "డబ్లు.టీ.ఓ.–వ్యవసాయ సంక్షోభం" తెలంగాణ సస్యశ్యామలానికి గోదావరి జలాలు, రాష్ట్రంలో తీవ్రకరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి "ప్రజలు, నాయకులు అంతా సహాయపడవలసిందిగా విజ్ఞప్తి", సంక్షోభంలో వ్యవసాయం–ప్రమాదంలో గ్రామీణుల జీవితాలు (జోషి–అధికారి సామాజిక శాస్త్రాల అధ్యయన సంస్థ భాగస్వామ్యం తో), ఇలా పలు శీర్షికలతో కా.కొల్లి రచనలు ప్రచురించబడ్డాయి. ప్రముఖ పాత్రికేయులు పరకాల పట్టాభి రామారావు గారు "తెలంగాణకు గోదావరి జలాలు వినియోగ ప్రాజెక్టుల కోసం శ్రీ కొల్లి నాగేశ్వరరావు నిరవధిక నిరాహార వ్రతం" అన్న శీర్షికతో వ్రాసిన పుస్తకాన్ని ఆ.ప్ర. రైతు సంఘం ప్రచురించింది.

### ప్రాజెక్టులు - నీటి వినియోగంపై పరిశోధన :

పోరాటాలు చేస్తున్నాం. ప్రాజెక్టులు సాధించుకొంటున్నాం. ప్రభుత్వ ఖజానా నుంచి పదుల వేల కోట్లు వెచ్చించి నిర్మించిన తర్వాత ప్రాజెక్టుల నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగునీరు అందించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయి. ఈ అంశాన్నే పరిశోధనాంశంగా ఎంపిక చేసుకొని పి.హెచ్.డి. చేయాలన్న ఆలోచన కా.కొల్లి బుర్రలో మొలకెత్తింది. విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా పనిచేస్తున్న మిత్రులు, శ్రేయోభిలాషులతో సంప్రదించి, సహకారాన్ని అర్థించారు. అంత్యమంగా ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ వై.పార్థసారధి గారి "గైడెన్స్"లో పరిశోధన మొదలు పెట్టారు. మూడు ప్రాజెక్టులను ఎంపిక చేసుకొన్నారు. కోస్తా ప్రాంతంలో పురాతనమైన కృష్ణా డెల్టా, తెలంగాణలో శ్రీరాం సాగర్, రాయలసీమలో తెలుగుగంగ. ఒక్కొక్క ప్రాజెక్టు పరిధిలో రెండు జిల్లాలు, జిల్లాకు ఒకటి రెండు గ్రామాలు. ప్రాజెక్టు ఆయకట్టు ప్రారంభంలో ఉన్న గ్రామమొకటి, చివరలో ఉన్న గ్రామమొకటి ఎంపిక చేసుకొని అధ్యయనానికి రంగంలోకి దిగారు. అప్పటికే హార్ట్ సర్జరీ చేయించుకొన్నారు. అంకితభావం ముందుకు నడిపించింది. కృష్ణా జిల్లాలో కంకిపాడు(మ) ఈడుపుగల్లు, గుంటూరు జిల్లాలో రేపల్లి (మ) లంకవానిదిబ్బ, కర్నూలు జిల్లాలో మహానంది(మ) నందిపల్లి, కడప జిల్లాలో

బ్రహ్మం గారి మతం (మ) జవుకుపల్లి, కరీంనగర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం (మ) వర్షకొండ, వరంగల్ జిల్లాలో హసన్పర్తి (మ) పెంబర్తి గ్రామాలలో రైతులతో సమాచారాన్ని సేకరించుకొని, అధికారులతో సమావేశమై అధికారిక సమాచారాన్ని సేకరించుకొని సమగ్రమైన అధ్యయనం చేశారు. రైతు సంఘం, నీటి సంఘాల నాయకుల సహకారం తీసుకొన్నారు. ఈ కర్తవ్యంలో నిమగ్నమై ఉన్న కాలంలోనే తీవ్ర అనారోగ్యానికి గురైనారు. కానీ, వృద్ధాప్యం, అనారోగ్యాన్ని ఏమాత్రం లెక్కచేయకుండా అసాధ్యమనుకొన్న దాన్ని సుసాధ్యం చేశారు. పరిశోధనా పత్రాన్ని తయారు చేశారు. కానీ, సాంకేతిక కారణాల పర్యవసానంగా పి. హెచ్.డి. కోసం సమర్పించ లేకపోయారు. దాన్ని "మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ – ఎ కంపారిటివ్ స్టడీ ఆఫ్ త్రీ రీజియన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అన్న శీర్షికతో మార్చి 2014లో పుస్తకంగా ప్రచురించి, హైదరాబాదులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో శ్రీ మండలి బుద్ధప్రసాద్, శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావు గార్ల చేత ఆవిష్కరించబడింది. "ద టీజ్ కా.కొల్లి నాగేశ్వరరావు".

### ప్రతిభా పురస్కారం :

రైతు నాయకులుగా విశిష్ట సేవలను అందించినందుకు గుర్తింపుగా కా.కొల్లి నాగేశ్వరరావు గారిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 34వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 2010లో ప్రతిభా పురస్కారంతో సత్కరించింది.

### అనారోగ్యంపై కూడా సమరమే! :

అనారోగ్యం ఆయన సంకల్పాన్ని వమ్ము చేయలేకపోయింది. 1974లో ఇంటి పెంపుడుకుక్క కరిచింది. మందులు తిరగబెట్టాయి. మంచానికే పరిమితమైపోయారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం, చెకోస్లోవేకియా కమ్యూనిస్టు పార్టీ సౌహార్థ సహకారంతో కా.కొల్లి నాగేశ్వరరావును ఆ దేశంలోని మెరియాన్ స్కీ లాజినీ శ్యానిటోరియంలో మూడు నెలల పాటు చికిత్స చేయించిన మీదట కోలుకొన్నారు. తిరిగొచ్చాక మళ్ళీ ఉద్యమ నిర్మాణంలో పూర్తి స్థాయిలో భాగస్వామైనారు. అప్పటి నుండి ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు చేర్పులూ చేసుకొంటూ వచ్చారు. ఒకసారి చెయ్యి లాగుతుంటే విజయవాడలో తనకు తెలిసిన డాక్టర్ దగ్గరకు వెళ్ళారు. ఆయన 'హార్ట్ ప్రాబ్లమ్' అని చెప్పారు. కా.వై.వి.కృష్ణారావు గారి అల్లుడు డా.డి.యన్.కుమార్ గారిని హైదరాబాదులో కలిసి 'సెకండ్ ఒపీనియన్' తీసుకొన్నారు. 'హార్ట్ ప్రాబ్లమ్' నిజమే. వెంటనే సర్జరీ అవసరమని చెప్పారు. నాకసలు గుండెనొప్పే లేదు. ఆపరేషన్ ఎందుకు? చేయాల్సిన పనులున్నాయని చెప్పి బయలు దేరబోతుంటే డా.కుమార్ గారు ఆపి, మీ శ్రేయోభిలాషిగా చెబుతున్నా సర్జరీ చేయించుకొంటే మరో పది సంవత్సరాలు క్రియాశీలంగా పని చేస్తారని చెప్పారు. ఆయన నుండి చిన్న కుమార్తె డా.ప్రశాంతి మొబైల్ నెంబరు తీసుకొని, ఫోన్ చేసారు. మేమిరువురం ఆసుపత్రికి వెళ్ళి, విషయం తెలుసుకొని డాక్టర్ గారి సలహా మేరకు సర్జరీ చేయించుకోవాలని నచ్చజెప్పాం. 2002 నవంబరులో హార్ట్ సర్జరీ చేయించుకొన్నారు.

2013 మే నెలలో ఆరోగ్యం బాగోలేక పోయినా ప్రయాణం చేసి, అఖిల భారత కిసాన్ సభ, జాతీయ సమితి సమావేశాల్లో పాల్గొనడానికి ముంబాయి వెళ్ళారు. అనారోగ్యంగా ఉన్నారని గమనించిన ఎ.ఐ.కె.ఎస్. ప్రధాన కార్యదర్శి కా.అతుల్ కుమార్ అంజన్ నచ్చజెప్పి పూనాలో నివాసమున్నపెద్ద కుమార్తె డా.ప్రగతి ఇంటికి పంపిస్తే, అక్కడ కూడా ఉండకుండా రైల్లో హైదరాబాదుకు బయలు దేరారు. తీవ్ర అనారోగ్యానికి గురై మాట్లాడే స్థితిలో కూడా లేకపోతే తోటి ప్రయాణికులు ఆయన డైరీలో రాసి ఉన్న ఫోన్ నంబర్లు తీసుకొని మాకు ఫోన్ చేసారు. మేం సికింద్రాబాదు రైల్వేస్టేషన్ కు వెళ్ళి, ఆసుపత్రికి తీసుకెళ్ళాం. బ్రెయిన్‌లో మల్టిపుల్ క్లాట్స్ ఉండడంతో సర్జరీ చేసారు. అటుపై పార్కిన్సన్ (నరాల బలహీనత, వణుకు రోగం) వచ్చింది. దశాబ్దాలుగా సుగర్, బి.పి. సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇంతటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను సహితం మనోనిబ్బరంతో ఎదుర్కొంటూ తాను నిర్దేశించుకొన్న లక్ష్యం వైపు వడివడిగా ఉద్యమ నడక సాగించారు. 2014 నుండి శారీరకంగా నిస్సత్తువతో పూర్తిగా ఇంటికే పరిమితమైపోయారు. విశాలాంధ్ర దినపత్రికను మొదటి పేజీ నుండి ఆఖరి పేజీ వరకు చదివే వ్యాపకాన్ని మాత్రం ఆఖరి శ్వాస విడిచే రోజు వరకు కొనసాగించారు.

### పని చేయడం ఒక వ్యసనం :

శ్రీకాకుళం జిల్లా సిపిఐ కార్యదర్శిగా పని చేసిన కా.పైలా కృష్ణమూర్తి గారు ఒకసారి నాకు ఫోన్ చేసి కా.కొల్లి నాగేశ్వరరావు గారు పెట్టే పని వత్తిడి మూలంగా "గుండె పోటు" వచ్చేలా ఉంది, కాస్తా మీరే కాపాడాలంటూ విజ్ఞప్తి చేశారు. తెల్లవారు జామున 3, 4 గం.లకు ఫోన్ చేసి నేను బయలుదేరి వస్తున్నాను, మీరు రెడీగా ఉండండంటారు. కంబిరిగాం భూపోరాటమంటారు. అక్కడ మీటింగ్, ఇక్కడ మీటింగ్ అంటారు. ఆ సమస్య చర్చించాలి, ఈ సమస్య చర్చించాలి, కార్యక్రమాన్ని రూపొందించుకొని, అమలు చేయాలంటారు. ఆయన మా జిల్లా బాధ్యుడైనప్పటి నుండీ చచ్చిపోతున్నానండి అన్నారు. అది విని నవ్వు ఆపుకోలేక

పోయాను. ఆయన బాధ అర్థమయ్యింది. పార్టీ రాష్ట్ర కేంద్రంలో నేను బాధ్యతలు నిర్వహిస్తున్నాను కాబట్టి నాయకత్వంతో కాస్త వారి మనోవేధనను తెలియజేసి కా.కొల్లి గారి బదులు మరొకరిని జిల్లా బాధ్యుడుగా పంపించేలా సహాయం చేయమన్నభావన కా.పైలా కృష్ణమూర్తి గారి మాటల్లో ధ్వనించింది. అంతకు ముందే కృష్ణా జిల్లా నాయకుల నుండి మరొక మాట విని ఉన్నాను. అదేంటంటే, తెల్లవారు జామున ఫోన్ మోగిందీ, అంటే, అది కొల్లి నాగేశ్వరరావు గారే చేసి ఉంటారని ఉలిక్కిపడి లేసిన కుటుంబ సభ్యులు కామెంట్ చేసేవారట. ఎప్పుడూ, అది చెయ్యాలి, ఇది చెయ్యాలనుకొంటూ ఆయనకు నిద్రపట్టదు, ఇతరులను నిద్రపోనివ్వడనే వ్యాఖ్యలు తరచూ ఉద్యమ సహచరుల నుండి వింటుండే వాడిని. ఆ బాధను నేను కూడా కాస్త రుచి చూశాను. ఇంటి దగ్గర ఉన్నప్పుడు కా.కొల్లి గారి ఫోన్ సంభాషణల శబ్ద కాలుష్యం పర్యవసానంగా నాకు నిద్రాభంగం కలిగేది. ఆయనకు పని మీదే ధ్యాస అంతే!

### అల్లుడు కావడానికి అర్హత - పార్టీ "హోల్ టైమర్":

నా పెళ్ళి ముచ్చట చెప్పకపోతే కా.కొల్లి నాగేశ్వరరావు గారికి అన్యాయం చేసిన వాడినవుతా. నేను ఎ.ఐ.ఎస్.ఎఫ్. జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ డిల్లీలో ఉండే వాడిని. 1989లో ఒక రోజు హైదరాబాదు వచ్చి, ఉదయాన్నే కా.గూడవల్లి నాగేశ్వరరావు (శాంతి, స్నేహ సంఘాల రాష్ట్ర నాయకులు) గారితో కలిసి "మార్నింగ్ వాక్"కు వెళ్ళా. మాటల మధ్యలో "ఏంటి! లక్ష్మీనారాయణా పెళ్ళి చేసుకోవా? అన్నారు. సావిత్రమ్మ(గూడవల్లి నాగేశ్వరరావు గారి సతీమణి)గారు అన్నట్లు దేశదిమ్మరిగా తిరిగే నాకు పిల్లనెవరిస్తారండి అన్నా! గూడవల్లి గారు, ఒక డాక్టరమ్మాయి ఉంది అన్నారు. ఎవరమ్మాయని అడిగా. పెళ్ళికి సరే అంటే వివరాలు చెబుతానన్నారు. పోనీ, ఏ వూరో చెప్పండని అడగ్గానే విజయవాడ అన్నారు. నేను వెంటనే, కొల్లి నాగేశ్వరరావు గారి అమ్మాయా! అన్నాను. అలా ఎలా కనిపెట్టావని గూడవల్లి గారు ఆశ్చర్యపోయారు. ఈ తరహా ఆలోచనలు కొల్లి నాగేశ్వరరావు గారి లాంటి వారికే వస్తాయని ఊహించానని సమాధానం చెప్పా. ఆయన పెద్దగా నవ్వేశారు. నాకు ఉద్యోగానికి వెళ్ళే ఆలోచన లేదు, పార్టీ హోల్ టైమర్ గా ఉద్యమంలో పూర్తి కాలం పని చేయడానికి నిర్ణయించుకొన్నా, తల్లిదండ్రుల ఆస్తిలో వాటా తీసుకోవాలనే ఆలోచన కూడా లేదు, అందులోను డాక్టర్, ఎలా సాధ్యమవుతుందన్నాను.అక్కడితో సంభాషణ ఆగిపోయింది. మళ్ళీ డిల్లీ నుండి ఒకసారి హైదరాబాదు వచ్చినప్పుడు గూడవల్లి గారు ప్రస్తావించారు. అప్పుడనగానే సిపిఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి కా.రామచంద్రరావు గదిలో ఉన్న లాండ్ ఫోన్ మోగింది. పక్కనే ఉన్న గూడవల్లి గారు ఎత్తారు. అటువైపు నుంచి కా.కొల్లి, మీరే మాట్లాడండి అంటూ ఫోన్ నా చేతికిచ్చారు. విజయవాడకు వచ్చి మాట్లాడతానని చెప్పా. ఆ మేరకు విజయవాడకు కొద్ది రోజుల తరువాత వచ్చి, మా వూరికి వచ్చి, మా కుటుంబ నేపథ్యాన్ని ముందు పరిశీలించుకోండని కోరాను. వాళ్ళు అప్పటికే ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చి ఉన్నారు. పోనీ, ప్రశాంతిని పంపండి చూస్తుందన్నాను. అందుకు ఆమె అంగీకరించి నాతో పాటు మా వూరొచ్చింది. మాతో పాటు అప్పుడు తిరుపతిలో చదువుకొంటున్న అరుణమ్మను వెంట తీసుకెళ్ళాం. మా వూరికి బస్సు సౌకర్యం కూడా లేదు. గుంజన నది దాటించుకొని, పొలం గట్ల మీద ఒకటిన్నర కి.మీ. నడిపించుకొంటూ తీసుకెళ్ళా. ఆనాడు మా ఇంటి దగ్గర 'బాత్‌రూమ్' సౌకర్యం కూడా లేదు. మా తల్లిదండ్రులకు పరిచయం చేశా. అటుపై కూడా ప్రశాంతి, మా అత్త మామలు టాన్యా గారు, కొల్లి నాగేశ్వరరావు గారి నిర్ణయంలో మార్పు లేదు. 1989 ఆగస్టు 21న విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అత్యంత నిరాడంబరంగా దండల పెళ్ళి చేసుకొన్నాం. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆనాడు నేతృత్వం వహిస్తున్న అగ్రనేతలు, వివిధ రాజకీయ పక్షాల నేతలు, ఉన్నతాధికారులు, శ్రేయోభిలాషులు హాజరైనారు. కా.కొల్లి నాగేశ్వరరావు గారికి ఉన్న సంబంధ భాంధవ్యాలు ప్రతిబింబించాయి. ఆ తంతు ముగియగానే కె.సుబ్బరాజు (నాడు సిపిఐ నగర కార్యదర్శి) గారు మమ్మల్ని అక్టోబరు విప్లవ రథసారధి లెనిన్ విగ్రహం దగ్గరకు తీసుకెళ్ళి పూలమాల వేయించారు. కమ్యూనిస్టు పార్టీలో పూర్తి కాలం పని చేసే ఒక "హోల్ టైమర్"కు ఉన్నతమైన వైద్య విద్యను ఆర్జించి డాక్టరైన తమ కుమార్తెతో, ఆమె అంగీకారంతో వివాహం చేయాలని వారు తీసుకొన్న నిర్ణయం కుటుంబం మొత్తానికి ఉన్న కమ్యూనిస్టు చైతన్యాన్ని, ఔన్నత్యాన్ని ప్రతిబింబిస్తుంది. కమ్యూనిస్టు ఉద్యమంలో పూర్తి కాలం పని చేయడానికి నా పోషకురాలుగా డా.ప్రశాంతి వెన్నుదన్నుగా నిలిచింది.

1981 డిసెంబరు 11 13 తేదీలలో ఎ.ఐ.ఎస్.ఎఫ్. ఆంధ్రప్రదేశ్ 34వ మహాసభ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం లో జరిగింది. నాడు సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఉన్న కా.కొల్లి మహాసభను విజయవంతంగా నిర్వహించడంలో ముఖ్యభూమిక పోషించారు. ఆ మహాసభలోనే నేను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

ఎన్నికైనాను. ఆ రోజుల్లోనే కా.కొల్లి నాగేశ్వరరావు గారితో పరిచయం ఏర్పడింది. కమ్యూనిస్టు ఉద్యమం మా ఇరువురిని మామా అల్లుళ్ళ బంధంతో పెనవేసింది. సిపిఐలో పూర్తి కాలం పనిచేసే "హోల్ టైమర్"కు తమ కుమార్తెను ఇచ్చి వివాహం చేయడం ద్వారా కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావడానికి దోహదపడుతుందన్న మహదాశయంతో కా.కొల్లి, కా.టాన్యా గార్లు భావించారు. ఎ.ఐ.ఎస్.ఎఫ్. ఉద్యమ నిర్మాణంలో పాలు పంచుకొన్న డా.ప్రశాంతి తల్లిదండ్రుల ఆలోచనలకు సానుకూలంగా స్పందించింది. కమ్యూనిస్టు కుటుంబ వాతావరణంలో పెరగడమే కాదు, తాను కూడా ఉన్నత పాఠశాలలో చదివే రోజుల నుండే విద్యార్థి ఫెడరేషన్ కార్యక్రమాల్లో భాగస్వామి. నేను ఎ.ఐ.ఎస్.ఎఫ్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మహాసభ వేదికపై విద్యార్థినుల ప్రతినిధిగా స్థానాన్ని పొందింది. నాడు ఇంటర్ విద్యార్థిని. అటుపై గుంటూరు మెడికల్ కాలేజీలో చదువుతూ ఎ.ఐ.ఎస్.ఎఫ్. అనుబంధ సంస్థ అయిన ఆల్ ఇండియా మెడికోస్ ఫెడరేషన్ నిర్మాణంలో భాగస్వామి. ఆ ఉద్యమ చైతన్యం ఉన్నది కాబట్టే తన వివాహానికి సంబంధించి తల్లిదండ్రుల ప్రతిపాదనను ఆమోదించింది. తద్వారా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో పరోక్షంగా తాను జీవితకాలం భాగస్వామి కావచ్చని భావించింది. నాపై ఆ కమ్యూనిస్టు కుటుంబం పెట్టుకొన్న విశ్వాసాన్ని వమ్ము చేయలేదని ప్రగాఢంగా విశ్వసిస్తున్నా.

## మా యిద్దరిదీ సమైక్యవాదమే :

సమైక్య రాష్ట్రంలో సమగ్రాభివృద్ధిని బలంగా ఆకాంక్షించాం, ఉద్యమాల్లో పాల్గొన్నాం. 1952 ఉన్నత పాఠశాల విద్యార్థిగా కా.కొల్లి తెలుగు వాళ్ళకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్యమంలో పాల్గొన్నారు. 1969, 1972 సం.లలో రాష్ట్ర విభజనోద్యమాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలబడ్డారు. 2013 వచ్చే నాటికి తన మాతృ సంస్థ రాష్ట్ర విభజనకు అనుకూలంగా తీర్మానం చేసింది. అప్పటికి ఆయనకు వృద్ధాప్యంతో పాటు అనారోగ్యం తోడయ్యింది. కమ్యూనిస్టుగా మరణించాలన్న బలమైన భావజాల అనుబంధంతో ఉన్నారు. నేను ఏడాది క్రితం కా.కొల్లి గారి పెద్దమ్మాయి ప్రగతి, పెద్దల్లుడు అశోక్ కౌశల్ గార్ల కుమారుడు నిశాంత్, మా అబ్బాయి ఆకాష్ సహకారంతో ముఖాముఖి ఇంటర్వ్యూ వీడియో రికార్డ్ చేసినప్పుడు "కమ్యూనిస్టుగా చనిపోతా" అన్న మాటతో ముగించారు. దానికంటే ముందు కుటుంబాన్ని గురించి ప్రస్తావిస్తూ, తనకు కుటుంబం సంపూర్ణ సహకారాన్ని అందించిందని చెబుతూ ఇద్దరు కుమార్తెలలో పెద్దమ్మాయి ప్రేమించి పెళ్ళి చేసుకొన్నది, చిన్నమ్మాయిని పార్టీ "హోల్‌టైమర్"కు ఇచ్చి వివాహం చేయాలనుకొని, చేశాము. ఆయనిప్పుడు హోల్ టైమరుగా లేరు, అని నర్మగర్భంగా కొంత బాధను వ్యక్తం చేశారు.

నేను మా హెడ్ మాస్టర్ ప్రేరణతో కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితుడనై, నేను చదివిన ఉన్నత పాఠశాలలో స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్.పి.ఎల్.)గా ఉంటూ, ఎ.ఐ.ఎస్.ఎఫ్. నిర్మాణానికి కృషి చేస్తున్న రోజుల్లో "జై ఆంధ్ర" ఆందోళన జరిగింది. నాటి సిపిఐ వైఖరి క్షేత్ర స్థాయి వరకు చేరడంలో కాస్త జాప్యం జరిగింది. నేను వారం రోజులు ఆగి, ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా 48 గం.లు నిరాహారదీక్ష చేశా. అటుపై పార్టీ వైఖరి సమైక్య రాష్ట్ర పరిరక్షణ అన్న విషయం తెలియగానే నిరాహారదీక్షా శిబిరాన్ని తొలగించి, సమ్మెను విరమించి, తీవ్ర వత్తిళ్ళ మధ్య స్కూలును యదాతథంగా నడిపించా. అలా సమైక్య రాష్ట్రం భావన నాకు నరనరానికి ఎక్కిపోయింది. ఆ భావనతోనే కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేశారు, అష్టకష్టాలు పడ్డారు. ఆ చారిత్రక నేపథ్యంలో రాష్ట్ర విభజనకు అనుకూలమైన వైఖరిని జీర్ణించుకోలేక పోయాను, స్వచ్ఛందంగా క్రియాశీల రాజకీయ జీవితం నుండి రాష్ట్ర విభజన కంటే ముందే 2014 జనవరి నుండే విరమించుకొన్నాను. ఈ పరిణామం మామ గారైన కా.కొల్లి నాగేశ్వరరావు గారికి కాస్త అసంతృప్తి కలిగించిందన్న భావన ఆయన మాటల్లో ధ్వనించింది. కానీ, వారి విశ్వాసాన్ని నిలబెట్టడంలో నేను సఫలీకృతుడనైనానని సగర్వంగా చెప్పగలను. పెళ్ళికి ముందు 1972 నుండి 1989 వరకు ఉద్యమంలో పనిచేశాను. ఎ.ఐ.ఎస్.ఎఫ్. ఉద్యమంలో నేను పోషిస్తున్న పాత్రను గమనించి, ఆయన ఆచరిస్తున్న కమ్యూనిస్టు నీతిని కొలబద్దగా పెట్టుకొని నన్ను అల్లుడుగా చేసుకొన్నారు. అటుపై 1989 నుండి 2013 చివరి వరకు ఆయన ఆశించిన మేరకు, నాకున్న నిబద్ధత మేరకు "హోల్ టైమర్"గా కమ్యూనిస్టు ఉద్యమంలో అంకితభావంతో పని చేశాను.

## పేదలు దొంగతనం చేయరు :

నేను కడప జిల్లా సిపిఐ కార్యదర్శిగా ఉన్న కాలంలో యర్రముక్కపల్లిలో నివాసం ఉండేవాళ్ళం. ఒక రోజు తెల్లవారు జామున తలుపు తట్టిన శబ్దం వస్తే వెళ్ళితీశా. ఎదురుగా మా మామ గారు. లుంగీ కట్టుకొని, బనియన్ మాత్రమే వేసుకొని ఉన్నారు. సంకలో దిండు ఉన్నది. ఏంటీ అవతారమని అడిగితే జరిగింది వివరించారు. కర్నూలు జిల్లా పాణ్యంలో పార్టీ రాజకీయ పాఠశాలలో పాఠ్యాంశాన్ని బోధించి, గుంతకల్లు నూలు మిల్లును

తెరిపించాలని ఆ.ప్ర.ప్రజానాట్య మండలి ముద్దుబిడ్డ – ప్రముఖ సినీ నటుడు మాదాల రంగారావు నిరవధిక నిరాహార దీక్ష చేస్తుంటే మద్ధతు తెలియజేసి రావడానికి గుంతకల్లుకు ప్యాసెంజరు రైలెక్కారు. చిరిగిపోయిన బట్టలు వేసుకొన్న ఒకతను ప్రక్కన సర్దుకొని కూర్చొని ఉన్నాడు. కొల్లి గారు బట్టలు మార్చుకొని పనుకొని, నిద్రపోయారు. గుంతకల్లు చేరేలోపు బ్యాగును దొంగ ఎత్తుకుపోయాడు. ఆ అవతారంతోనే మాదాల రంగారావు దీక్షా శిబిరానికి వెళ్ళారు. అక్కడున్న వారు విషయం తెలుసుకొని రెడీమేడ్ దుస్తులు తీసుకొచ్చి ఇస్తే అవి తనకు సరిపడవని చెప్పి, దీక్షకు సంఘీభావం తెలియజేసి, రైలెక్కి కడపకు వచ్చారు. రైలులో ప్రక్కన కూర్చొన్న పేదవాడు దొంగతనం చేసి ఉండడని, ఎవడో దొంగ వచ్చి ఎత్తుకు పోయి వుంటాడని బలంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## కొల్లి విదేశీ పర్యటనలు :

1962 జూలై–ఆగస్టులో, ఫిన్లాండ్ రాజధాని హెల్సింకిలో జరిగిన ప్రపంచ విద్యార్థి – యువజనోత్సవాలలో పాల్గొన్నారు. అక్కడి నుంచే పోలెండు రాజధాని వార్సా వెళ్ళి ప్రపంచ ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డబ్లు.ఎఫ్.డి.వై.) మహాసభలకు, అటుపై మాస్కోలో జరిగిన ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ స్టూడెంట్స్ (ఐ.యు.ఎస్.) మహాసభకు ఒక రోజు హాజరయ్యారు. 1973లో ఆరు మాసాల పాటు మార్క్సిస్టు సైద్ధాంతిక అధ్యయనం కోసం మాస్కోకు వెళ్ళారు. 1975లో చెకోస్లావేకియాకు కుక్కకాటుకు చికిత్స కోసం వెళ్ళారు. 2007లో చైనా పర్యటనకు వెళ్ళి వచ్చి చైనా వ్యవసాయ రంగంపై పుస్తకాన్ని ప్రచురించారు. నేపాల్‌కు ఒక రోజు పర్యటనకు వెళ్ళారు.

## కుటుంబం ఆయనకు కొండంత అండ :

విద్యార్థి దశలోనే మార్క్సిస్టు భావజాలం వైపు ఆకర్షితులై విద్యార్థి, కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమాలలో క్రియాశీల పాత్ర పోషించి, సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించు కొన్నారు. కమ్యూనిస్టు నీతితో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. కమ్యూనిస్టులకు సొంత ఆస్తి ఉండకూడదన్న భావనతోనే జీవితాంతం కట్టుబడి ఆదర్శంగా నిలిచారు. కా.కొల్లి నాగేశ్వరరావు గారి జీవిత భాగస్వామి, మా అత్తమ్మ టాన్యా గారు అధ్యాపకురాలుగా పనిచేస్తూ కుటుంబ పోషణ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తే, ఆయన కమ్యూనిస్టు, రైతు ఉద్యమ నిర్మాణంలో పూర్తి కాలం అంకిత భావంతో పని చేశారు.

వారు ప్రేమించి, దండల పెళ్ళి చేసుకొన్నారు. పెళ్ళి కా.కంభంపాటి సత్యనారాయణ(సీనియర్) ఇంటిలో జరగ్గా 1961 ఆగస్టు 20న కృష్ణా జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తలు తమ రాష్ట్ర కార్యదర్శి కా.కొల్లి నాగేశ్వరరావు, టాన్యా గార్ల వివాహ సందర్భంగా "రిసెప్షన్"ను కా.మోటూరి హనుమంతరావు గారి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కా॥గడ్డ రాజగోపాలరావు, తమ్మిన పోతరాజు గార్లు హాజరయ్యారు. తల్లిదండ్రుల ఆమోదం లేదు. ఇక్కడ ఒక్క విషయం ప్రస్తావించాలి. మా అత్తమ్మ తల్లిదండ్రులు బుడ్డి గోపాలకృష్ణయ్య, నాగేశ్వరమ్మ గార్లు కమ్యూనిస్టులు కాదు. కానీ, వారి ఇద్దరి కుమారులతో సరిసమానంగా 1960 దశకంలోనే ఆస్తిలో వాటా పంచిచ్చారు. పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తి హక్కు కోసం దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నా, చట్టాలు సాధించుకొన్నా, ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని పరిస్థితులను మన సమాజంలో చూస్తున్నాం. తమకు ఇష్టం లేని పెళ్ళి చేసుకొన్నా టాన్యమ్మ గారి తల్లిదండ్రులు ఆ కాలంలోనే ప్రగతిశీలంగా ఆచరణలో పెట్టారు. ఆ భూమే కా.కొల్లి కుటుంబానికి వేడినీళ్ళకు చన్నీళ్ళుగా ఆదుకొన్నది. కా.కొల్లి తనకు వారసత్వంగా తల్లిదండ్రుల నుండి సంక్రమించిన ఆస్తిలో వాటా తీసుకోలేదు.

తమ పెద్ద కుమార్తె ప్రేమించిన యువకునితో కులాంతర, అంతర్రాష్ట్ర, ఆదర్శ వివాహం చేశారు. పెద్ద కుమార్తె ప్రగతి డాక్టర్, పెద్దల్లుడు అశోక్ కౌశల్ ఇంజనీర్. వాళ్ళ కుమారుడు నిశాంత్ ఇంజనీర్, కుమార్తె నిఖితా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో పి.హెచ్.డి. చేసింది. మాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె పృథ్వి, కుమారుడు ఆకాష్. ఇద్దరూ ఇంజనీరింగ్ పట్టభద్రులే. కా.కొల్లి ఆదర్శ కమ్యూనిస్టు జీవితాన్ని గడపడమే కాదు, తన కుటుంబాన్ని కమ్యూనిస్టు నీతితో జీవించే వాతావరణాన్ని సృష్టించారు. కా.కొల్లి నాగేశ్వరరావు గారికి సంపూర్ణ తోడ్పాటును అందించిన మా అత్తమ్మ మాకు, మా పిల్లలకు స్ఫూర్తిగా నిలిచారు.

ఇంటా, బయటా ఆదరాభిమానాలను చూరగొన్నారు, స్ఫూర్తిగా నిలిచారు, కమ్యూనిస్టు శ్రేణుల చేత "కామ్రేడ్ కొల్లి"గా ఆప్యాయంగా పిలిపించుకొన్నారు.


కమ్యూనిస్టు నైతిక విలువలకు నిలువుటద్దం. కమ్యూనిస్టు ఉద్యమం ఒక ఆణిముత్యం లాంటి ఉత్తమ శ్రేణి, విలక్షణమైన నాయకుడ్ని కోల్పోయింది. కొల్లి కమ్యూనిస్టు జీవితం నేటి కమ్యూనిస్టు శ్రేణులకు ఒక పాఠ్యాంశం! ❑

# బాబా సాహెబ్ అంబేద్కర్ మార్క్స్ వాద మిత్రుడే

ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,గుంటూరు

మానవజాతి విమోచనపై డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కున్న అంతిమ సైద్ధాంతిక నైజం ఏమిటి? అని ఆలోచించే వారికి నేటికీ స్పష్టత కన్నా అస్పష్టతలే ఎక్కువగా కనిపిస్తాయి. ఉదాహరణకు, అంబేద్కర్, మార్క్స్ వాదాన్నీ, కమ్యూనిస్టు ఉద్యమాల్నీ శత్రు శిబిరాలుగానే పరిగణించాడా? అంబేద్కర్ కేవలం కుల వ్యతిరేక పోరాటాలే

మానవ విముక్తికి మార్గమని తేల్చేశాడా? భారత ప్రజలకు బ్రాహ్మణిజంతోబాటు పెట్టుబడి దారీ విధానం కూడా ప్రధాన శత్రువేనని సిద్ధాంతీకరించిన అంబేద్కర్‌కు , కుల వర్గ పోరాటాలపై ఆసక్తి లేదా? దోపిడీ శక్తులపై పోరాటాలు పదును తేలాల్సిన నేటి తరుణంలో ఇలాంటి సైద్ధాంతిక, ఆచరణాత్మక సూత్రీకరణల పై మొత్తం దళిత, మార్క్స్‌వాద ఉద్యమకారులకు ఎంతగానో స్పష్టత అవసరం.





చరిత్ర మొత్తం మీద చూస్తే, ఎన్నో సిద్ధాంతాలూ, సూత్రీకరణలపై అంబేద్కర్ అపార్థాలకు, అనుమానాలకే గురయ్యాడు. 'అంబేద్కర్‌కి మార్క్సిజం చుక్కెదురు ' అనీ, 'వర్గ పోరాటం అంబేద్కర్ నిఘంటువుకే వ్యతిరేకం ' అనీ,.... ఇలాంటి వ్యాఖ్యలన్నీ అంబేద్కర్‌కి పొరపాటుగా ఆపాదించబడ్డవే తప్ప ఆయన సహజత్వాన్ని నిక్కచ్చిగా ఆవిష్కరించేవి మాత్రం కావని, ప్రముఖ మానవ హక్కుల మేధావి, అంబేద్కర్–మార్క్స్‌ల నిరంతర అధ్యయనశీలి, డాక్టర్ ఆనంద్ తేల్తుంబ్డే విశ్లేషిస్తారు. అంబేద్కర్ సిద్ధాంతాలనీ, ఆయన వదిలి వెళ్ళిన దళిత ఉద్యమాన్ని తమ స్వార్థ ప్రయోజనాలకోసం శత్రువర్గం ముందు తాకట్టు పెట్టినవారు "విద్యాధికులైన దళిత మధ్యతరగతే " అంటూ కఠిన పదాలతో ఆనంద్ వ్యక్తం చేసిన ఆవేదన తీరును, ఇప్పుడు ఇలా గుర్తు చేయాల్సి రావడం ఒకింత ఇబ్బందికరంగానే ఉంది. (చూడండి, ఆనంద్ తేల్తుంబ్డే, "బి.ఆర్.అంబేద్కర్ – భారతదేశము, కమ్యునిజం ", నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్, 2019, పేజీలు 7–8).

భారత దేశంలో నేటి కుల, వర్గ పోరాటాల అనివార్యతరీత్యా, అంబేద్కర్, అటు మార్క్స్ వాదమూ, ఇటు వర్గ, కుల సంభందాల పట్ల ఎలాంటి దృక్పధం కలిగి ఉన్నాడో రేఖామాత్రంగా నైనా విశ్లేషించుకోవడం, ఫలితంగా కమ్యూనిస్టు, దళిత శక్తుల మధ్య మరింత సఖ్యతకై కృషి చేయడం ఈ వ్యాసం ఉద్దేశం.

## అంబేద్కర్ - మార్క్స్ వాదం :

నిజమే. అంబేద్కర్ ఎప్పుడూ మార్క్స్‌వాది కాడు. పైగా, భారత దేశంలో కుల వ్యవస్థ రద్దు దిశగా మార్క్స్ వాదం నుంచి నేర్చుకోవలసింది ఏమీ లేదని కూడా నిర్ద్వంద్వంగా తిరస్కరించిన వాడు అంబేద్కర్. దీనికి తోడు, నాటి కమ్యునిస్టు నేతలు దోపిడీ కులాలకు చెందిన వారై, కుల వ్యతిరేక పోరాటాలకు ఎంత మాత్రం సహకరించకపోవడం, వారు ఆర్థిక నియతి వాదం (economic determinism) ఊబిలో నుంచి బయటకు రావడానికీ ఆసక్తి చూపకపోవడం అంబేద్కర్‌కి దేశీయ కమ్యూనిస్టులపై చిరాకు పుట్టించింది. సరిగ్గా అప్పుడే అంబేద్కర్ మార్క్స్‌వాదంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. (Anand Teltumbde, Republic of Caste, Navayana publishing House pvt. Ltd , New Delhi,2019). page. 103).

అదే విధంగా, 1928 లో Bombay Textile strike విషయంలో కూడా కమ్యునిస్టు నేతలు అంబేద్కర్ సారథ్యం వహించిన దళిత కార్మికుల పట్ల చూపిన వివక్షా పూరిత వైఖరి కూడా అంబేద్కర్‌ను కమ్యునిస్టు నేతలకు దూరం చేసింది. కుల వివక్ష చూపి దళిత కార్మికులను మిగతా కులపోళ్ళతో బాటు నేత (weaving) విభాగంలోకి కలుపుకోని పక్షంలో సమ్మె భాగస్వామ్యం నుండి విడిపోతామని అంబేద్కర్ కమ్యునిస్టులకు

తెగేసి చెప్పడంతో, అయిష్టంగానే అంగీకరించారు నాటి బొంబాయి కమ్యునిస్టులు. (Sumeet Mhaskar, "Ambedkar's Fight wasn't just against Caste", The Print, April 14,2020, www.theprint.in).

వాస్తవానికి నాటి కమ్యునిస్టులు, తమ అస్తిత్వం నిలుపుకోవడం కోసం కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను సాధించి పెట్టే పనిలో చొరవ చూపారే గాని, నూతన కార్మిక నాయకత్వాన్ని నిర్మించడం, కులవివక్షని ఎదిరించే పోరాటాల వైపు శ్రద్ధ చూపలేదనే విమర్శ బలంగానే ఉంది. (Bharath Patankar, & Gail Omvedt, "The Dalit Liberation Movement in Colonial Period", EPW, February 1979, page 420).

వీటన్నింటి కన్నా ముఖ్యంగా, అంబేద్కర్ తాను కొలంబియా విశ్వవిద్యాలయంలోని తన ఆచార్యులు డ్యూయీ అనుసరించే ఫాబియన్ సోషలిజం సిద్ధాంతానికి తీవ్రంగా ప్రభావితుడై ఉన్నాడు. వీరి సిద్ధాంతం మార్క్సిజంకి భిన్నమైంది. సోషలిజం కార్మిక వర్గం ద్వారా రాదనీ, అది మధ్యతరగతి వర్గం ద్వారానే వస్తుందని నమ్ముతారు. అలాగే సోషలిజం సాధన శాంతియుత పద్ధతిలో సంస్కరణల పరంగానే రావాలని, మార్క్సిజం ప్రతిపాదిస్తున్న 'హింస', 'నియంతృత్వం' ల ద్వారా కాదనీ అంబేద్కర్ విశ్వసించిన ఫాబియన్ సోషలిజం నమ్ముతుంది. (Anand Teltumbde, "To the self obsessed Marxists and the pseudo Ambedkarites", Countercurrents.org, April 2013, page17.).

ఐతే ఈ సమయంలో గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, అంబేద్కర్ మార్క్స్ వాదం పట్ల ఎలాంటి శత్రు పూరిత వైఖరి కనపరచలేదనీ, పైగా, మానవ విమోచనకు మార్క్సిజంని ఒక గొప్ప సిద్ధాంతంగా శ్లాఘించాడని చూడగలం. ఉదాహరణకు, తాను స్వీకరించిన బుద్ధిజంతో మార్క్సిజంని సరి పోల్చుతూ ఖాట్మండు సదస్సులో ప్రసంగించిన అంబేద్కర్, ఈ రెండు మార్గాలూ ఏక లక్ష్యం కలిగినవేనని విశ్లేషిస్తూ, వీటి గమనం (means) లో మాత్రమే తేడా ఉంది గానీ, గమ్యం (mission) ఒక్కటేననే సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. (Babasaheb Ambedkar writings and speeches, Vol 3, Ministry of Education, Government of Maharashtra, 1991, page 522).

ఐతే, సమాజంలో న్యాయం కోసం శ్రమించే క్రమంలో అవసరమైతే బలాన్ని (force) ప్రయోగం చేయడానికీ వెనకాడాల్సిన అవసరం లేదని బుద్ధుడు సైతం అనుమతించడాన్ని ఉద్యమకారులు జ్ఞాపకం చేసుకోవాలని అంబేద్కర్‌ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేసిన కుబేర్ గుర్తు చేయడం చూడగలం. (W. N. Kuber, "Ambedkar- A Critical Study", People's Publishing House, New Delhi,1991 edition, page 213.).

ఇంతే కాదు. మార్క్సిజంనీ, దాని విజయాల్ని శ్లాఘిస్తూ, ముఖ్యంగా రష్యాలో జరిగిన బోల్షెవిక్ విప్లవ విజయ గాథలను వివరిస్తూ తాను తొలిగా ప్రారంభించిన మూక్ నాయక్ పత్రిక నుండి చివరిగా నడిపిన జనతా పత్రిక దాకా అంబేద్కర్ నిరంతరం వరస వ్యాసాలు రాయడం గమనార్హం. అలాగే, మార్క్స్ రాసిన 'పెట్టుబడి' గ్రంథం మరాఠీ భాషలోకి 1960 ల దాకా తర్జుమా కాకపోయినా, అంతకు మూడు దశాబ్దాలకు ముందే 1930 ల లోనే అంబేద్కర్ తన 'జనతా' పత్రికలో 'వేతనాలు, శ్రమ, పెట్టుబడి' అంశాన్ని 'మోల్, మజూరీ, అనీ భండ్వాల్' పేరిట మరాఠీలో ప్రచురించిన సంఘటనని ఎవరైనా ప్రస్తుతించకుండా ఉండగలమా?. (For details, see Anand Teltumbde, "Dichotamization of Caste and Class", Economic and Political weekly, November 19, 2016, page37).

ఇలాంటి విషయాలనన్నీ ఇలా త్రవ్వి చూపడం ఇప్పుడు కొంత అవసరమేనని అనిపిస్తోంది. ఇంతకంటే ముఖ్యంగా ఖోటే వ్యతిరేక రైతాంగ పోరాటం లాంటి ఉద్యమాల్లో కమ్యునిస్టులతో మమేకమై అంబేద్కర్ కలిసి పయనించడం లాంటి ఘటనను సైతం గుర్తు చేసుకోవడం అవసరమే ననిపిస్తోంది. ఈ 'అనిపించడం' వెనుక దాగి ఉన్నది దురాశ కాదు; సదాశయమే. అన్నదమ్ములం ఆవేశం తన్నుకొస్తే అరుచుకుంటాం, కరుచు కుంటాం కూడా. కానీ ఆపద ముంచుకొస్తే... అన్నదమ్ములం కదా? నిజంగానే కరుచుకుపోతాం. అన్యాయంపై విరుచుకు పడతాం. లాల్ నీల్ శక్తుల సిద్ధాంతాలు వేరైనా లక్ష్యం ఒక్కటే గదా? మరి కమ్యూనిస్టులం, అంబేద్కరిస్టులం ఇష్టులమే గానీ, సపరేటిష్టులం కాదు మరీ.

## కుల, వర్గ సంబంధాలు : అంబేద్కర్

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సునిశిత పరిశీలన, అసాధారణ ప్రతిభ కలిగిన మేధావి. సమాజంలోని ఎన్నో తాత్విక, సైద్ధాంతిక విషయాలపై తనదైన వినూత్న శైలిలో విశ్లేషణా పటిమ కనబరిచిన అరుదైన తాత్వికుడు.. అందుకే అంబేద్కర్ ఆలోచనలు, సూత్రీకరణలు కొన్ని అంత సూటిగా బోధపడక పోవడాన్ని తప్పు

పట్టలేం. చాలా సందర్భాల్లో ఆయన ఆలోచనలు అపార్థాలకీ, వక్రీకరణలకూ కూడా దారి తీస్తాయి. అలాంటి సందర్భాలకు కేవలం కమ్యూనిస్టులు మాత్రమే పరిమితం కాదు. అంబేద్కర్‌ని విశేషంగా అభిమానించి, సంఘాలు స్థాపించిన వారు కూడా ఉంటారు. అలాంటి సంక్లిష్ట విషయాల్లో ముఖ్యంగా పేర్కొనవలసి వస్తే , మార్క్సిజం విషయంలో ఒక వైపు తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం చేస్తాడు అంబేద్కర్. మరోవైపు, మార్క్సిజంని జీవిత పర్యంతం తాను చేసిన ఎంపికలకు ఒక ప్రమాణిక శాస్త్రంగా కూడా పరిగణిస్తాడు. ఆ క్రమంలో సానుకూలంగానూ, ప్రతికూలంగానూ అంబేద్కర్ అపార్థానికీ గురయ్యాడని ఆయన్ని నిశితంగా అధ్యయనం చేసిన విశ్లేషకులు అంటారు. (ఆనంద్ తేల్తుంబ్డే, "మార్క్సు, అంబేద్కర్ : మానవ విమోచనా ద్రుక్పదాలు", సమీక్ష ప్రచురణలు 2016, విజయవాడ, పేజీ.54). కుల, వర్గ సంబంధాలు వాటిపై పోరాటాలపై అంబేద్కర్ వ్యక్తీకరణలు అలాంటి సంక్లిష్టత కలిగిన వాటిలో ప్రాధాన్యత సంతరించుకున్న అంశమేనని చెప్పాలి.

## అంబేద్కర్ - కుల,వర్గ సంబంధాలు

అంబేద్కర్ కుల వివక్ష మరియు కుల నిర్మూలన పైన మాత్రమే పోరాటం నిర్వహించాడనీ, ఆయన ఎజెండాలో అసలు వర్గ పోరాటం అవసరత, ఉనికీ రెండూ కనిపించవనీ అటు కమ్యూనిస్టులలోనూ, ఇటు దళిత వాదుల్లోనూ అభిప్రాయం గట్టిగానే పేరుకొని ఉంది. ఐతే భారత సమాజంలో బ్రాహ్మణిజం, పెట్టుబడిదారీ విధానం రెండూ ప్రధాన శత్రువులేనని సిద్ధాంతీకరించిన అంబేద్కర్‌కు, కుల, వర్గ పోరాటాల సమాన అవసరం ఉందనే స్పష్టత లేదని తీర్మానించలేం గదా?

కులానికీ వర్గానికీ మధ్య గాఢమైన సంబంధమే ఉంది. ఈ దేశంలో కుల వ్యవస్థ ప్రభావాన్ని, ఉత్పత్తి సంబంధాల్లో దాని పాత్రనీ 1853 లోనే మొదటిగా గుర్తించిన సిద్ధాంతవేత్త కార్ల్ మార్క్స్ అంటే, చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు. ఐతే, కుల వ్యవస్థ పై పోరాటం వర్గ పోరాటంలో అంతర్భాగంగానే సాగాలన్న మార్క్స్ సూత్రీకరణను అంబేద్కర్ ఎక్కడా వ్యతిరేకించినట్లు కనిపించదు. పైగా, తాను కుల నిర్మూలన కోసం సాగిస్తున్న పోరాటాన్ని అంబేద్కర్ వర్గ పోరాటంగానే భావించాడు. మార్క్స్ ప్రాథమిక రచనల్ని అంబేద్కర్ చదవక పోవడం కూడా ఆయన మార్క్స్‌ని వ్యతిరేకించక మౌనం వహించడానికి కారణం కావచ్చుననే అభిప్రాయమూ ఉంది. (ఆనంద్ తేల్తుంబ్డే, అదే పుస్తకం, పేజీ 16).

కులం అంటే అది 'ఒక దడి కట్టుకున్న వర్గం' (A caste is an enclosed class) అనీ, 'ఘనీభవించిన వర్గం' అనీ అంబేద్కర్ అభివర్ణించడం (Dr. BR Ambedkar, "Castes in India, 1916), లోనే కులానికి వర్గ స్వభావం ఉందని తానే స్పష్టం చేసినట్లు అయింది. ఉత్పత్తీ, పంపిణీ, మారకాల్లో ఒక సామాజిక సమూహాన్ని వివక్షకు గురిచేసి వారి శ్రమ నుండి మిగులు ఏ రూపంలో పొందినా అలాంటి సమూహాన్ని ఒక వర్గంగానే పరిగణిస్తారు కదా? ఆ సమూహాలు మహిళలు కావచ్చు; దళితులు, గిరిజనులు కావచ్చు. అంబేద్కర్ కూడా తన తొలి రచనల్లో కులంని వివరించిన సందర్భాల్లో వర్గం అని అర్థం వచ్చే విధంగానే రాశారు.

అంబేద్కర్ 1916లో కొలంబియా విశ్వవిద్యాలయంలోని సదస్సుకు రాసిన పత్రంలో 'సమాజం మౌలికంగా వర్గాలతో నిర్మితమై ఉందనీ, అందుచేత సమాజంలోని ప్రతి ఒక్కరూ ఏదో ఒక వర్గానికి చెంది ఉంటాడని' అంటారు.. (Dr. BR Ambedkar writings and speeches, Vol 1, page 15). 1930 లలో అంబేద్కర్ భారత దేశంలో కార్మిక వర్గానికి ఇద్దరు శత్రువులు ఉన్నారని, ఒకటి బ్రాహ్మణిజం కాగా మరొకటి కాపిటలిజం అంటూ వర్గ ఉనికిని బలపరిచడం ఈ ఆలోచనలో భాగమే.. అలాగే 1936 లో తాను స్థాపించిన ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ప్రణాళికలో సైతం కులం అనే పదానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వకుండా కార్మిక వర్గం అనే సంబోధించడం ఈ ఆలోచన కొనసాగింపే. ఇంకా ఆపైన షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ తరుపున 1946లో తాను రాసిన పత్రంలో సైతం అంబేద్కర్ వర్గం (class) అనే పదకోశానికే మొగ్గు చూపడం గమనార్హం. అందువల్ల అంబేద్కర్ భారత సమాజాన్ని కేవలం కులదృష్టితోనే చూచాడనీ, ఆయనకు వర్గ దృక్పథం సుతరామూ సరిపడదనీ సూత్రీకరించడం అంబేద్కర్‌ని అర్థం చేసుకోలేకపోవడమే అవుతుంది.

భారత దేశ చరిత్రలో మరికొంత ముందుకెళ్ళి పరిశీలిస్తే, అంబేద్కర్ కంటే ముందే తన తాత్విక గురువు మహాత్మా జ్యోతిరావు పూలే సైతం కులాన్ని వర్గంగానే పరిగణించి తన పోరాటాలను రూపొందించుకున్నట్లు స్పష్టమైన రుజువులున్నాయి. భారత దేశంలో శూద్ర, అతిశూద్ర జాతి బహుజనులు షేట్జీ, భాట్జీలపై సాగించిన పోరంతా వర్గ పోరాటమేనని పూలే భావించడం ఉద్యమకారులు మరువరాదని దళిత, మార్క్సిస్టు విప్లవ కారుడు శరద్ పాటిల్ సామాజిక విప్లవకార్లకు గుర్తు చేయడం గమనార్హం. (Sharad Patil, "Dialectics of caste and class

conflicts, Economic and Political weekly, February 1979, Page 296.).

భారత సామాజిక వ్యవస్థలో, కులం అనేది మార్చడానికి వీలు లేని 'దైవ నిర్దేశితం' గా నిర్ణయమై పోయినందువల్లా, అలా ఆ కులం ద్వారా వచ్చి పడ్డ ఆర్థిక హోదా కూడా వర్గ రూపేణా స్థిరపడే ఏర్పాటూ అందులోనే ఉండి పోయినందువల్లా, కులానికి వర్గ స్వభావం ఏర్పడిందనే ఒక బలమైన భావన దళిత మేధావుల్లో సహజంగానే నెలకొని ఉంది. అందుకే దేశంలో సాంకేతిక, సాంస్కృతిక, ఆర్థికాభివృద్ధి ఎంత జరిగినప్పటికీ, కులం దడి కట్టుకున్న వర్గం రూపంలో నేటికీ గణనీయమైన స్థాయిలోనే కొనసాగుతోందనీ వీరు సూత్రీకరించడాన్ని తప్పుపట్టలేమేమో. (For a detailed analysis , see, SK Biswas, Nine Decades of Marxism in the land of Brahminism, Other Books. Calicut, 2008, p.39,40 & 80,81).

### అంబేద్కర్- ' కులం శ్రామికుల విభజన'

ఇక, అంబేద్కర్ 'కులంపై మరో గొప్ప నిర్ధారణ చేశారు. 'కులం శ్రమ విభజనే కాక శ్రామికుల విభజన కూడా' అని విశ్లేషణ చేశారు. (బాబా సాహెబ్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు, సంపుటి 1, పేజీ 58). వాస్తవానికి,ఈ సత్యాన్ని మార్క్స్, అంబేద్కర్ కంటే ముందే వెల్లడించారని చెప్పవచ్చు. మార్క్స్ భారత దేశంపై రాసిన సందర్భంలో, "Caste is the division of labourers by race" అంటూ కులం యొక్క అభివృద్ధి నిరోధక పాత్రను వివరించడం గమనించవచ్చు. ( W N Kuber, Ambedkar - A Critical Study, People's Publishing House, New Delhi, 1991 edition, page 314).

మరింత వివరంగా చెప్పాల్సి వస్తే, ఇంగ్లాండ్ లాంటి పశ్చిమ దేశాల్లో లాగా భారత దేశంలో సాంకేతిక పరిజ్ఞానం పెరగక పోవడం, ఎదుగూ బొదుగూ లేకుండా దేశం కేవలం స్వయం పోషకత కలిగిన స్థాయిలో మాత్రమే కొడికట్టుకు పోవడం వల్లనే శ్రామికులు కులవృత్తులకే కట్టు బానిసలై బ్రతకడానికి కారణమని మార్క్స్ ఆనాడే నిర్ధారించారు.

భారత దేశం లాంటి Asiatic societiesలో ఉత్పత్తి సంబంధాల్లో ఈ విధమైన మార్పు లేని తనం (unchangeable ness) కనిపిస్తోందని గిల్డులు, కులాల వ్యవస్థల గురించిమార్క్స్ ప్రస్తావించారు. నత్త తన శరీరాన్ని గవ్వ నుంచి విడదీసుకో లేనట్లే, శ్రామికులు కూడా తమ పనిముట్లని తమ శ్రమనుండి విడతీసుకోలేని పరిస్థితులే నాటికి ఉన్నాయి. ఫలితంగా, ఆర్థిక వ్యవస్థ కూడా స్తబ్దుగా ఉండి పోవడమే గాక, కులాల వారీగా, గిల్డుల వారీగా శ్రామికులు బలవంతంగా నిర్దిష్ట వృత్తులకు పరిమితమై..బ్రతుకుతున్నారు అంటాడు. (Karl Marx, Capital, Vol. 1, page 329 )

ఆ విధంగా, కులం శ్రమ విభజనకే పరిమితం కాకుండా, శ్రామికుల విభజనకు కూడా కారణమైందని అంబేద్కర్ లాగానే మార్క్స్ కూడా ఉద్దేశ పడడం గమనార్హం. అలాగే మార్క్స్ "కులం అనేది వర్గాలు ఇంకా ఏర్పడని దశలో సామాజిక అసమానత్వ ప్రతీకగా పుట్టినందువల్ల, అది వర్గాలు అంతరించి పోయినాక కూడా అలానే నిలబడే ఉంటుంది" అని అభిప్రాయపడ్డాడు. మరింతగా వివరించాల్సి వేస్తే, "సోషలిస్టు వ్యవస్థలో ఆర్థిక వర్గాలు అంతర్ధానమై పోయినా, పాత భావజాలం, లింగ అసమానత, మేధావి శ్రామిక వర్గ అంతరాలు, పట్టణ గ్రామీణ ప్రాంతాల భేదాలు, తదితర వేలాది ఏళ్ళుగా పాతుకుపోయిన భావాలు అవశేషాలు అలానే కొనసాగి తీరుతాయి", అని మార్క్స్ స్పష్టీకరిస్తాడు.. (Karl Marx writings in New York Tribune, August 8, 1853, Quoted from Sharad Patil, Op.Cit., Page.296 ).

అంబేద్కర్ కూడా ఈ భావాన్ని మరింత స్పష్టపరుస్తూ కులాన్ని ముందస్తుగానే ఢీకొనమంటూ భారత కమ్యూనిస్టులను ఇలా హెచ్చరించారు. "ఈ సమస్యను భారతీయ సోషలిస్టులు తిన్నగా పరిశీలించినట్లు లేదు. ఇండియాలో సాంఘిక వ్యవస్థ ను సోషలిస్టులు ఎదుర్కొనక తప్పదు. అలా ఎదుర్కొనకుండా విప్లవం సాధ్యం కాదు. కుల భూతాన్ని చంపి పారేస్తే తప్ప , నీవు రాజకీయ సంస్కరణ గానీ, ఆర్థిక సంస్కరణ గానీ సాధించలేవు." (Baba Saheb Ambedkar writings and speeches , Vol 1, page 47)

కాబట్టి కులం – వర్గం అంశాల సంబంధంపై గానీ, వాటిపై పోరాట దృక్పథాల గురించి గానీ అంబేద్కర్, మార్క్స్‌ల మధ్య అగాధాలు కాక అనుసంధాన కోణాల దాఖలాలే ఎక్కువగా కనిపిస్తున్నట్లుంది. అంతా గమనిస్తే, అనిపించేది ఏమంటే, ఇపుడు సామాజిక ఉద్యమ రంగంలో నెలకొన్న సమస్యంతా రెండు సమాంతర శిబిరాల మధ్య భరించలేనంతగా నెలకొన్న సిద్ధాంత భేదాల వివాదం కాకపోవచ్చు గానీ, ఉద్యమ భాగస్వాముల మధ్య నివురు కప్పుకున్న మానసిక పరమైన భేషజాలు కావచ్చునేమో.

(ముగిసింది). ❑

# కేపిటలిజం గుట్టు!

స్వేచ్ఛానువాదం : బి.ఎస్.రాజు

కార్మికుడు : అయ్యా! సోషలిస్టు గారు! ఈ భూమ్మీద యజమాను లనే వారే లేకపోతే, నాకు పని ఎవరిస్తారు?

సోషలిస్ట్ : అవును మిత్రమా! నన్ను తరచుగా నలుగురు అడిగే ప్రశ్నయే ఇది. దీని సంగతేమిటో చర్చించాల్సిందే సుమా! పని చేయాలంటే మూడు వ్యవస్థలు అవసరం - కర్మాగారం, యంత్రాలు, ముడి పదార్థాలు. అవునా ?

కార్మికుడు : అవును.

సోషలిస్ట్ : కర్మాగారాన్ని ఎవరు నిర్మిస్తారు ?

కార్మికుడు : తాపీ పనివారు, ఇతర భవన నిర్మాణ కార్మికులు

సోషలిస్ట్ : మరి యంత్రాలను ఎవరు తయారు చేస్తారు?

కార్మికుడు : ఇంజనీర్లు, టెక్నీషియన్లు, సాంకేతిక పనివారు

సోషలిస్ట్ : నువ్వు ఇప్పుడు నేస్తున్న బట్టకు అవసరమైన పత్తిని ఎవరు పండిస్తారు? నీ భార్య వడుకుతున్న ఉన్ని దారానికి కావాల్సిన ముడి ఉన్నిని గొర్రె మందల నుండి ఎవరు సేకరిస్తారు? నీ కొడుకు పనిచేస్తున్న లోహ తయారీ, కమ్మరి పనిలో సమ్మెట దెబ్బల వాతపడే ఖనిజాలను వెలికితీసేదెవరు?

కార్మికుడు : వ్యవసాయదారులు, గొర్రెల కాపరులు, గని కార్మికులు - ఇంకా నాలానే పనిచేసే వారెందరో కదా! ఈ పనులు చేసేది.

సోషలిస్ట్ : మరి పలు విధాలుగా శ్రామికులు ఇప్పటికే కర్మాగారాలు, యంత్రాలు, ముడిసరుకులు సమకూర్చి పెట్టడం మూలంగానే కదా! నీవు, నీ భార్య, నీ కుమారుడు వీటిని ఉపయోగించుకుని పని చేస్తున్నారు అవునా?

కార్మికుడు : ఔను కదా! నేసే మగ్గం, పండిన పత్తి లేకపోతే నేనెట్లా ముడి బట్ట నేయగలరు?

సోషలిస్ట్ : ఐతే, నీకు పని కల్పించేది ఓ పెట్టుబడిదారుడో, ఓ యజమానో కాదు మరి. తాపీమేస్త్రి, భవన నిర్మాణ కార్మికులు, ఇంజినీర్లు, పొలం దున్నే రైతులు వీరు నీకు పని కల్పిస్తున్నది. ఇంతవరకు బాగానే ఉంది. కాని నీ యజమాని, నీ చేత పని చేయించు కునేందుకు కావాల్సిన సరంజామా అంతా ఎలా సేకరించినట్లు?

కార్మికుడు : అతడు అవన్నీ అతని సొంత డబ్బుతో కొన్నాడు.

సోషలిస్ట్ : అతనికి ఆ డబ్బెవరిచ్చారు?

కార్మికుడు : నాకెలా తెలుస్తుంది ఈ విషయం?

అతని తండ్రి ఇతని కోసం కొంత సొమ్ము వదిలి వెళ్ళుండాల, దానితో ఇతను ఇప్పుడు కోటీశ్వరుడై ఉండవచ్చు కదా!

సోషలిస్ట్ : అతనేమైనా యంత్రాలపై పనిచేసి, నూలు ఒడికి, బట్టలు నేస్తాడా?

కార్మికుడు : అబ్బే! అలా కాదు స్వామీ! మాచేత పని చేయించడం ద్వారానే అతను కోట్లు సంపాదించాడు.

సోషలిస్ట్ : అయితే అతను గాలికి బలాదూర్ తిరిగి కోట్లు గడించి ఉండాలి. ధన సంపాదకుడుకు అదే ఏకైక మార్గం. అవునా? పనిచేసేవారికి పూటగడవటమే కనా కష్టం కదా! ఇప్పుడు చెప్పు మరి, నువ్వు, నీ తోటి కార్మికులు పని చేయకపోతే, మీ యజమాని యంత్రాలు తుప్పు పట్టిపోవా? గోదాముల్లో అతను నిలువబెట్టిన పత్తి, ఉన్ని బూజు పట్టిపోదా? పురుగులు పట్టి పాడైపోదా?

కార్మికుడు : అవును, మేము పనిచేయకపోతే కర్మాగారంలో సమస్తం గబ్బు పట్టిపోతుంది, సర్వం మూలనపడి కుప్ప కూలిపోతుంది. ఇదే వాస్తవం.

సోషలిస్ట్ : నిజానికి నువ్ పనిచేయడం ద్వారానే ఉత్పత్తి శ్రమకు కావాల్సిన యంత్రాలను, ముడిసరుకును నీవు సజావుగా కాపాడుతున్నావు.

కార్మికుడు : ఇది పచ్చి నిజం. కాని దీని గురుంచి నేనెప్పుడు ఆలోచించలేదు సుమా!

సోషలిస్ట్ : మీ కర్మాగారంలో ఏం జరుగుతుందో ఎల్లవేళలా మీ యజమాని చూసుకుంటాడు?

కార్మికుడు : అస్తమాటు కాదు గాని, మా యజమాని, రోజూ ఓ మారు మమ్ములను గమనించేందుకు ఓ చెక్కర్ కొడతాడు. ఐతే, చేతులు ఎక్కడ మైల బడతాయో

నని, వాటిని పాంట్ జేబుల్లో కుక్కుకొని తిరుగుతాడు. నా భార్య, నా కొడుకు పనిచేసే నూలు ఒడికే పెద్ద మిల్లుల్లోనైతే యజమానులెప్పుడు కనిపించరు. యజమానులెవరో, ఎలా ఉంటారో కూడా పనివాళ్లకు తెలియనే తెలియదు. వారి నీడ కూడా ఎవరికి కనిపించిన దాఖలాలు లేవు. ఈ పరిశ్రమ 'డీ లిమిటెడ్' కంపెనీది. ఒకవేళ నువ్వు నేను ఓ 500 ఫ్రాంకులు (సొమ్ము) ఆదా చేసుకోగల్గితే, మనం కూడా కంపెనీలో వాటాదార్లం అయి యజమానులైపోవచ్చు! అలా, అసలు మనం ఫ్యాక్టరీలో కాలు మోపకుండానే యజమానులై పోగలం తెలుసా?

సోషలిస్ట్ : ఐతే, ఒక్క ప్రశ్న. వాటాదారుల లిమిటెడ్ కంపెనీ యజమానులకు చెందిన మిల్లుల్లో గాని, నువ్వు పని చేస్తున్న సొంత వ్యక్తి యాజమాన్య కర్మాగారంలో గాని రోజు వారి పనులు ఎవరు తనిఖీ చేస్తారు? ఎవరు ఈ పనులు నిర్వహిస్తారు? నిర్వహణ వ్యవహారాలు ఎవరు చూస్తారు?

కార్మికుడు : ఇంకెవరు ఫార్మెన్లు, మేనేజర్లు.

సోషలిస్ట్ : పనివారు కర్మాగారాన్ని కడితే, యంత్రాలను తయారు చేస్తే, వాటిని నడిపిస్తుంటే, ముడిపదార్థాలు వెలికితీస్తే, మేనేజర్లు, ఫార్మెన్లు పని పురమాయింపు, తనిఖీ, నిర్వహణ బాధ్యతలు చేపడుతుంటే మీ మాస్టర్, మీ యజమాని పని ఏమిటి మరి!

కార్మికుడు : ఆ! ఏమి లేదు! ఉత్తనే చేతులూపుకుంటూ లెక్చర్లు దంచటమే!

సోషలిస్ట్ : ఇక్కడి నుండి చంద్రమండలానికి రైలు మార్గముంటే (1903 నాటికి చంద్రమండలంపై మానవుడు కాలు మోపలేదు) ఈ యజమానులను తిరుగు టిక్కెట్ లేకుండా అక్కడకు పంపించేస్తే కొంపమునిగేదేమైనా ఉందా? నీ భార్య పని చేసే నూలు మిల్లుకు కానీ, నీ కొడుకు పనిచేసే ఫౌండ్రికీ గాని వచ్చే నష్టమేమి ఉండదు సరిగదా, అవన్నీ సజావుగానే నడుస్తాయి. క్రితం ఏడాది నీ యజమాని సొమ్ము చేసుకున్న లాభమెంతో నీకు తెలుసా?

కార్మికుడు : మా లెక్క ప్రకారం ఓ లక్ష ఫ్రాంకులను అతను గడించి ఉంటాడు.

సోషలిస్ట్ : ఎంతమంది పురుషులను, స్త్రీలను, పిల్లలను మీ యజమాని పనిలోకి తీసుకున్నట్టు?

కార్మికుడు : ఓ 100 మందిని

సోషలిస్ట్ : వారికిచ్చే సాలుసరి కూలీ సొమ్మెంత?

కార్మికుడు : మేనేజర్లు, ఫార్మెన్లు వేతనాలు కూడా లెక్క కడితే సాలుకు సరాసరి మనిషికి కూలి ఓ 1000 ఫ్రాంకులు ఉంటుంది. (ఇది 1903 సంగతని గుర్తుంచుకోవాలి)

సోషలిస్ట్ : అంటే, ఏడాది పొడుగునా రెక్కలు ముక్కలు చేసుకుంటే మీ 100 మందికి కలిపి వచ్చే మొత్తం కూలి వేతనం లక్ష ఫ్రాంకులు. ఘటాఘటిన పొట్ట నింపుకోడానికైతే, ఆకలితో చావకుండా బ్రతికి వుండడానికైతే, ఏ ఉత్పత్తి శ్రమా చేయని మీ యజమాని సునాయాశంగా ఓ లక్ష ఫ్రాంకులు నొక్కేసాడు గదా! అసలు ఈ రెండు లక్షల ఫ్రాంకులు ఎక్కడి నుంచి వచ్చాయి?

కార్మికుడు : ఆకాశంనుండైతే కాదు. డబ్బు వాన కురవడం నేనైతే ఎప్పుడు చూడలేదు.

సోషలిస్ట్ : కర్మాగారంలో పనిచేసే కార్మికులు జీతాలుగా పొందిన లక్ష, యజమాని జేబులోకి చేరిన లక్ష మొత్తం కలిపి రెండు లక్షల ఫ్రాంకులు కార్మికుల శ్రమ ఫలితమే కదా! యజమాని అయాచితంగా గడించిన లక్ష ఫ్రాంకుల సొమ్ము నుండే కొంత భాగం తిరిగి కొత్త యంత్రాలు కొనడానికి వినియోగిస్తాడు.

కార్మికుడు : అంతేకదా మరి! ఇందులో కాదనేదేముంది?

సోషలిస్ట్ : కార్మికుడు సొమ్మే నూతన యంత్రాలు, పరికరాలు కొనడానికి వినియోగించి వాటిని నడిపిస్తుంటే, మీలానే వేతన బానిసలైన ఫార్మెన్లు, మేనేజర్లు ఉత్పత్తిని నిర్వహిస్తుంటే మరటువంటప్పుడు ఈ యజమాని ఎక్కడి నుండి ఊడిపడ్డాడు? ఇక దేనికోసమతను?

కార్మికుడు : దేనికోసమంటే, శ్రామికులను మరింత పిండటానికే.

సోషలిస్ట్ : అలా అనకు, అది సరికాదు. కార్మికున్ని నిలువెల్లా దోచుకోవటానికి అను, అదే సరైన ఖచ్చితమైన పదం మరి.

(రచనా కాలం : సెప్టెంబర్, 1903, 'ది సోషలిస్ట్' అనే పత్రికలో ముద్రితం.
సేకరణ : మార్క్సిస్ట్ ఇంటర్నెట్ పత్ర గ్రంధాలయం నుండి) ❑

ప్రజాసాహితి సౌజన్యంతో...

# మార్క్సిజం-సాంస్కృతిక-సిద్ధాంతాలు

## రావు కృష్ణారావు గారు

పుస్తక సమీక్ష

**వి. విజయకుమార్**

చదివారా ఈ గ్రంథాన్ని?

ఎన్నో రోజులుగా ఒక గొప్ప పుస్తకాన్ని పరిచయం చేయడం కోసం మాటలు వెతుక్కుంటూ రోజులు గడుపు తున్నాను...

పుస్తకం అంతా వాక్యాల కింద గీతలు గీసుకొని ఇంక రాద్దామని పుస్తకం మూసి గూగుల్ కీ బోర్డ్ మీద చూపుడువేలితో ఇంక అలవోకగా వాక్యాల్ని మెలితిప్పి ముందుకు వెళదామని చూస్తే.... ఊహూ....

చూపుడువేలు కదలదు...

రావు కృష్ణారావు గారి కథలు గానీ, కథనాలు గానీ...

ప్రతివాక్యం వెనకా నీడలా కదిలే వారి సైద్ధాంతిక పరిపుష్టి గానీ నాకేవీ కొత్తకాదు!!

వారి చారిత్రిక భౌతికవాదం గానీ మార్క్సిస్ట్ మూల సూత్రాలు గానీ బతుకుపోరు కథలు గానీ...

ఇంగ్లండ్‌లో కార్మిక వర్గ పరిస్థితులు గానీ బేతాళ కథలు గానీ... మార్క్సిస్ట్ వాచకాలు...

ఇవన్నీ హాయిగా చదువుకు పోయాను..




చెప్పొద్దూ ! ...

సాంస్కృతిక సిద్ధాంతాలు..నన్ను నిలబెట్టింది !

నేనెక్కడ ఉన్నానో గుర్తు చేసింది..

ఓ సారి...

ఈ పుస్తకం ఇంకా వెలుగులోకి రాకముందు కొన్ని పేజీలు పంపి నన్ను చూడమన్నారు కృష్ణారావు గారు...

నాకప్పుడు రావు గారు ఏ విషయం మీద రాస్తూ వున్నారో దాన్ని రిలేట్ చేసుకోవడమే కష్టం అయింది.

అలా అని ఈ పాఠ్య గ్రంథాన్ని ఇంకా లోతుగా అధ్యయనం చేసిన తరువాతనే పూర్తిగా అర్థం చేసుకోగలం అనికూడా చెప్పలేను..

మనం ఏదైనా ఎలా అర్థం చేసుకుంటాం ?

అంతకుముందు దానికి సంబంధించిన జ్ఞానంతో ముడిపెట్టి...

మార్క్సిస్టు గ్రంథాల పరిచయం

మాత్రమే అయితే కొద్దిగా పరవాలేదు..

జార్జ్ లుకాక్స్, గ్రాంసీ, ఫ్రాంక్ఫర్ట్ స్కూల్, ఆల్తూజర్, రేమండ్ విలియమ్స్ లాంటి పేర్లు అయినా వినివుండాలి..

అప్పుడే ఈ పుస్తకం తొందరగా కనెక్ట్ అవుతుంది.

సాంస్కృతిక సిద్ధాంతం అన్న పదం ముందు కనెక్ట్ కావాలి.. తర్వాత దాన్ని మార్క్సిజంతో ముడిపెట్టి అర్థం చేసుకోవచ్చు...

సంస్కృతిపై స్పష్టత వచ్చాక పెట్టుబడిదారీ సంస్కృతి బాగా అర్థం అవుతుంది.

నయా ఉదారవాదులుగా ఉండటమేమిటో, బలత్కరించే వినిమయవాదం ఏమిటో తెలిశాక.....

మనం రోజూ చేసే, చూసే పనులు ఎంత స్పష్టంగా అర్థం చేసుకునే అవకాశం వుందో మీకే అర్థమవుతుంది...

సరుకు ఒక మోక్ష ప్రదాత ఎలా అవుతుందో,

దాతృత్వం వెనుక తాత్విక త...ఏమిటో...

బిల్ గేట్స్ లాంటి వారి సేవా కార్యక్రమాలు పేదరికాన్ని పరిష్కరించే నటన వెనుక అసలు రహస్యం ఏమిటో? అర్థం కావాలీ అంటే ఈ వ్యాసం బాగా వంటపట్టించుకోవాలి.

కొన్ని భావాలకు అనుగుణంగా మనకు తెలిసిన రీతిలో మనం నిజం అని కొన్నిటిని ప్రతినిత్యం అవే భ్రమల్లో కొట్టుకుపోతాం..

మదర్ థెరిసా, బిల్ గేట్స్.... యింకా ఇలాంటి వ్యక్తులపై మన అవగాహన సరైన రీతిలో లేనప్పుడు మనమాటలు ఒకోసారి చెరుపు చేస్తాయి..

ఇందులో ఇచ్చిన కొన్ని ఉదాహరణలు ముఖ్యంగా మీడియాపై, సాంస్కృతిక పెట్టుబడి పేరుతో కొందరు ధనికులు పేదవర్గాల పిల్లలతో కలిసి దిగిన ఫోటో గ్యాలరీలు (ఘనా లాంటి పేద దేశాలు వెళ్లి చేసే హడావుడి వెనుక వున్న) మర్మం తెలుసుకోవాలి అంటే ఈ పుస్తకం చదవాలి..

ఇందులో వున్న 16 అధ్యాయాలు చదివాక ఈ ప్రపంచాన్ని మీరు అర్థం చేసుకొనే విస్తృతి పెరుగుతుంది.

ప్రతి వ్యాసం వెనకా ఒక Ph.D scholar ఎంత పరిశోధించి విషయ సంగ్రహణ చేసి మనకు అర్థం కావడం కోసం సారాన్ని వడగట్టి పొందికగా అందించడానికి ఎంత శ్రమించి ఉంటారో పుస్తకం చదివే సమయంలో ప్రతి గీతా చెబుతుంది..రావు కృష్ణారావు గారి కృషి ఏ పాటిదో....

కొన్ని సందర్భాల్లో కొన్ని పదాలకోసం ఎంత తంటాలు పడి వుంటారో, ఆపదం అక్కడ పెట్టిన తర్వాత ఎంత రిలాక్స్ అయి ఉంటారో వారి పుస్తకం చెబుతుంది.

అనేక కొత్త పదాలు , ఏ పదకోశాలు చెప్పని, సంకలనం చేయని ఎన్నింటినో నిర్మలమైన పదాల్లో తెలియజేయటం వెనుక కఠోరమైన శ్రమదాగివుంది.

భాష గురించి....

ఇది సరళం కాదూ, గ్రాంధికం అంతకంటే కాదు !!

అది సమ్మోహనం !!!!

చిన్న తప్పుకూడా దొరకని సంశ్లేషనాత్మక వాక్య విన్యాసం...ఒక గంభీర నదీ ప్రవాహగతి...

ఎందుకు చదవాలి ఈ పుస్తకం ?

జ్ఞానం వికసించడం కోసం...కానీ ఆ జ్ఞానం ఇప్పటిదాకా మనకున్న తప్పుడు సూత్రీకరణలను ఎన్నింటినో బదా బద్దలు చేసుకోవడం కోసం..

మనం అర్థం చేసుకోవాల్సిన నవీన భావజాలాన్ని, మార్క్సిజాన్ని పరిపుష్టం చేస్తూ మార్క్స్ తదనంతర కాలంలో జరిగిన కృషిని, అలా ఆ రంగంలో జరిగిన విశేష కృషిని రేఖా మాత్రంగా పరిచయం చేసి మనకు మనం ఎక్కడ వున్నామో, ఇంక ఎంత ముందుకు నడిస్తే కాలంతో పాటూ నడవగలమో, సమకాలీన సమాజ అధ్యయనంలో పాత పుస్తకాలతో పాటూ మారుతున్న సమాజాన్ని చదవడానికి ఎవర్ని చదవాల్సిన అవసరం వుందో కూడా ఈ పుస్తకం చెబుతుంది.

ఏదైనా పుస్తకం చదివాక కొన్ని పాత విషయాలు మెరుగు పడతాయి. కొన్ని పుస్తకాలు చదివాక కొత్త విషయాలు కొన్ని యాడ్ అవుతాయి..

కొన్ని పుస్తకాలు తోడవుతాయి.. జీవితాంతం... కొన్ని పుస్తకాలు మాత్రం మనకు ఏమి తెలియదో చెప్పి ఏమి చేయాలో చెబుతాయి...

ఒకే సారి ఎన్నో ద్వారాలను తెరుస్తూ జ్ఞాన దీపాలు వెలిగిస్తాయ్...

ఆ కోవలోకి వస్తుంది "మార్క్సిజం- సాంస్కృతిక సిద్ధాంతాలు"

సమకాలీన ప్రపంచాన్ని అర్థం చేసుకునే సందర్భంలో కొన్ని అయోమయాలు విశ్లేషణకు అందవు అందరికీ...

అలాంటప్పుడు ఇలాంటి గ్రంధాలు చేసే మహోన్నత ఉపకారం మాటల్లో చెప్పలేనిది.

నిజంగా నా మాటల్లో ఈ పుస్తకం తాలూకూ గొప్పదనాన్ని చెప్పలేదు..

అది నన్ను ఏ విధంగా ప్రభావితం చేసిందో చెప్పడానికి మాత్రమే ప్రయత్నం...

దీన్నొక పాఠ్యగ్రంథంగా మాత్రమే చదువుకోండి.. ఒక పుస్తకం ఎలానో చదివాం అని మాత్రం చదవకండి !

రావు కృష్ణారావు గారు రాసిన ఈ విలువైన పుస్తకం గురించి ఇంతకంటే ఏమీ రాయలేక... ❑



# గ్రాంసీ వెలుగులో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై విశ్లేషణ

**పుస్తక సమీక్ష**

**డి. సోమ సుందర్**

ఒకప్పుడు తెలుగునాట అత్యంత తీవ్ర ప్రభావాన్ని చూపి, విప్లవ ప్రభంజనాన్ని సృష్టించిన కమ్యూనిస్టు ఉద్యమం ఒక రాజకీయ శక్తిగా ఆవిర్భవించిన వాస్తవం చరిత్ర పుటల్లో భద్రంగా ఉంది.

కమ్యూనిస్టు ఉద్యమం నాలుగు దశాబ్దాల పాటు రాష్ట్ర రాజకీయ జీవితాన్ని అమితంగా ప్రభావితం చేసింది. అన్ని జీవన రంగాల్లో తనదైన ముద్ర వేసింది.

1952 నాటి తొలి సార్వత్రిక ఎన్నికల్లోనే రాజ్యాధికారం దిశగా అడుగులు వేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్యనే ఆనాటి రాజకీయ పోరాటం కేంద్రీకృతం అయ్యింది.

వేరే రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ సమాజం రెండు ప్రధాన శిబిరాలుగా మోహరించింది. ఆ పరిస్థితి చాలా కాలం పాటు తరతమ స్థాయిల్లో అలాగే కొనసాగింది.

1930 వ దశకం నుండి 70వ దశకం వరకూ తెలుగు సామాజిక జీవితంపై కమ్యూనిస్టు ఉద్యమం వేసిన అపార ప్రభావం అనంతర కాలంలో ఎందుకు బలహీనమై పోయింది?




రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీల మధ్య కొనసాగిన వర్గ పోరాటం కాస్తా అనంతర కాలంలో ఒక జాతీయ పార్టీకి, మరో ప్రాంతీయ పార్టీకి మధ్య అధికార పోరాటంగా ఎలా మారి పోయింది?

అంతిమంగా నేడు రెండు ప్రాంతీయ పార్టీల మధ్య అధికార మార్పిడి క్రీడగా ఎలా మారిపోయింది?

ఇవి కీలకమైన ప్రశ్నలు. ఆసక్తికరమైన ప్రశ్నలు. రాష్ట్ర సామాజిక, రాజకీయ చరిత్రను అధ్యయనం చేసే వారు సమాధానాలు వెతకాల్సిన ప్రశ్నలు.

ఈ ప్రశ్నలు రాజకీయ చరిత్రను అధ్యయనం చేసే విద్యార్థులకే కాక రాష్ట్రంలో రాజకీయ, సామాజిక, విప్లవం కోసం కృషి చేస్తున్న శక్తులకు అత్యంత కీలకమైనవి.

రాష్ట్ర రాజకీయాల్లో గత 70 సంవత్సరాలుగా వచ్చిన మార్పులను విశ్లేషించే అధ్యయనాలు గతంలో అనేకం వచ్చాయి.

ముఖ్యంగా మార్క్సిస్ట్ దృక్పథంతో తెలుగు సామాజిక పరిణామాలను అధ్యయనం చేసిన వారు చాలా మంది ఉన్నారు.

కమ్యూనిస్టు పార్టీల అధికారిక డాక్యుమెంట్లు, విశ్లేషణలు చాలా ఉన్నాయి. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, ట్రాట్ స్కీ, మావో, వంటి పేర్లతో ముడి పెడుతూ వచ్చిన పరిశీలనలు కూడా చాలా ఉన్నాయి.

ఇటాలియన్ మార్క్సిస్ట్ మేధావి ఆంటోనియో గ్రామ్ సీ ప్రతిపాదించిన "హెజిమొని" సిద్ధాంత దృక్పథంతో తెలుగు సామాజిక, రాజకీయ పరిణామాలను విశ్లేషించే ప్రయత్నం పెద్దగా జరగలేదు.

గతంలో అకడమిక్ బృందాలకు మాత్రమే పరిమితమైన అటువంటి అధ్యయనాన్ని ఇప్పుడు ఆచరణాత్మక రాజకీయాల రంగస్థలం మీదికి తెచ్చిన ఖ్యాతి శ్రీ డి.వి.వి.ఎస్. వర్మకు దక్కుతుంది.

**"ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిణామాలు 1950- 2020" పుస్తకం ద్వారా శ్రీ డి.వి.వి.ఎస్. వర్మ అటువంటి ప్రయత్నాన్ని అత్యంత ప్రతిభావంతంగా చేశారు.**

ప్రముఖ మార్క్సిస్ట్ మేధావిగా, రాజకీయాలను ఆచరణాత్మక దృష్టితో విశ్లేషించే సృజనాత్మక శక్తి కలిగిన ఆలోచనా శీలిగా, గత ఆరు దశాబ్దాలుగా తెలుగు సామాజిక పరిణామాలను తనదైన సొంత గొంతుతో వివరిస్తూ వచ్చిన సామాజిక కార్యకర్తగా డి.వి.వి.ఎస్. వర్మ మరోసారి గ్రామ్ సీ పరిశీలనా పద్ధతిలో కొత్త ఆలోచనతో మన ముందుకు వచ్చారు.

"ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ పరిణామాలు 1952 -2020" పేరుతో వర్మ రాసిన 70 పేజీల అత్యంత ఆసక్తి దాయక మైన, ప్రతిభావంతమైన చిన్ని పుస్తకం మొన్న ఆగస్టు నెలలో వెలువడింది.

ఈ పుస్తకం చిన్నదే అయినప్పటికీ సైద్ధాంతిక రంగంలో దీర్ఘ కాలిక ప్రభావాన్ని చూపగలిగే లోతైన అధ్యయనం, పరిశీలన, అన్వయం, అందులో కనిపిస్తాయి.

రాష్ట్రంలోని వివిధ కమ్యూనిస్ట్ పార్టీల వెనుక ఉన్న శ్రేణులు, తమ తమ సామాజిక అస్తిత్వం కోసం పోరాడుతున్న ఉపశ్రేణుల ఉద్యమ కారులు, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న దళిత, బహుజన శక్తులు ప్రస్తుత పరిస్థితుల్లో తమ పోరాట వ్యూహాలను

మూల్యాంకనం చేసుకునేందుకు వర్మ రాసిన ఈ చిన్ని పుస్తకం ఒక కరదీపికగా పనికొస్తుందని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఇటాలియన్ కమ్యూనిస్టు మేధావి ఆంటోనియో గ్రామ్ సీ ప్రతిపాదించిన "హెజిమోని" సిద్ధాంత దృక్పథం నుండి డెబ్భై ఏళ్ళ ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలను వర్మ ఈ పుస్తకం లో పరిశీలించారు.

తొలుత రాష్ట్రంలో ఏర్పడిన కమ్యూనిస్టు హెజిమోని అనంతర కాలంలో సమ్మోహక శక్తుల సీజర్ హెజీమనిగా రూపాంతరం చెందిన విధానాన్ని వర్మ విశ్లేషించారు.

ఆ తర్వాత రాష్ట్రంలో దళిత బహుజన హెజీమని కోసం జరిగిన విఫల ప్రయోగం గురించి వర్మ వివరించారు.

అనంతర కాలంలో రాష్ట్రం లో రెండు ప్రాంతీయ పార్టీల మధ్య రూపొందిన బాస్టర్డ్ హెజీమని గురించి వర్మ వివరించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో "ప్రజా హెజీమని" సాధించడానికి ప్రయత్నం జరగాలని వర్మ తన పుస్తకంలో ప్రతిపాదించారు.

మన రాష్ట్ర రాజకీయాలను సంప్రదాయక మార్క్సిస్ట్ దృష్టితో చూసే మన అవగాహనలో వర్మ పరిశీలన ఒక నూతన దృష్టి కోణాన్ని మనకి అందిస్తుంది.

రాష్ట్రంలో 1930 వ దశకం నుండి రాజ్యాధికార సాధన కోసం కమ్యూనిస్టులు సాగిస్తూ వచ్చిన ఉద్యమం తొలి దశలో ఒక వెల్లువలా తెలుగు సమాజాన్ని పట్టి వూపేసిన సంగతి అందరికీ తెలుసు.

దాని జయాపజయాల గురించిన అనేక విశ్లేషణలు గతం నుంచి మనం చూస్తూనే ఉన్నాం.

వర్గ పోరాట విప్లవ పంథాలో సాగిన నాటి కమ్యూనిస్టు ఉద్యమం ఆనాటి తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో సైతం కష్ట నష్టాలకు ఓర్చి గట్టిగా నిలదొక్కు కుంది.

తెలుగు సమాజం లో ఒక ప్రభావ శక్తిగా ఆవిర్భవించింది.

ఓ పక్క బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, మరో పక్క ఫ్యూడల్ భూస్వామ్య పెత్తందారీ సమాజాన్ని కూకటి వేళ్లతో పెళ్లగించే పోరాటం, ఇంకో పక్క సమస్త మానవాళిని దోపిడీ నుండి విముక్తి చేసి, ప్రగతి ఫలాలని సమానంగా అంద చేసే సోషలిస్ట్ వ్యవస్థ ఏర్పాటు వంటి లక్ష్యాలను మేళవించి కమ్యూనిస్టు పార్టీ ఆనాడు పని చేసింది.

ఈ మూడు పాయల అద్భుత సమ్మేళనం కమ్యూనిస్టు ఉద్యమానికి తెలుగు సమాజం లో గొప్ప పునాదిని ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా ప్రజల సమ్మతిని పొందటానికి కమ్యూనిస్టు ఉద్యమం చేసిన ప్రయత్నం, సాగించిన కృషి అపారమైనది.

ఈ వివరాలను వర్మ విస్తృతంగా మన ముందు ఉంచారు.

స్వాతంత్ర్యోద్యమంలో ఎత్తుగడల రీత్యా కమ్యూనిస్టు పార్టీ చిన్న చిన్న తప్పటడుగులు వేసినా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం కమ్యూనిస్టులు నికరంగా పోరాడుతున్నారని నాటి సమాజం గట్టిగా భావించింది. నిరంతరం ప్రజల్లో ఉంటూ కమ్యూనిస్టులు సాగించిన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలు అందుకు కారణం.

దున్నే వానికి భూమి నినాదం ద్వారా గ్రామీణ ఫ్యూడల్ పెత్తనాన్ని దెబ్బ కొట్టడం కోసం కమ్యూనిస్టు పార్టీ గట్టి పోరాటాన్ని నిర్మించింది.

జమీందార్లు, ఎస్టేట్ యజమానులు, మొఖాసాదారులు, ఇనాందార్లు వంటి వారికి భూమి పై వున్న ఆధిపత్యాన్ని బద్దలు కొట్టేందుకు కమ్యూనిస్టు ఉద్యమం పెద్ద పెద్ద పోరాటాలు చేసింది.

కుల వివక్ష నుండి, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం, పేదల, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆత్మ గౌరవం కోసం, కమ్యూనిస్టు పార్టీ పోరాడింది.

ఆ విధంగా గ్రామీణ సమాజం లో గొప్ప విప్లవానికి బాటలు పరిచింది.

సామాజిక దురాచారాలకు, మూఢ నమ్మకాలకు, సాంఘిక అన్యాయాలకు, వెనుకబాటుతనానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ గట్టిగా పోరాడింది.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆనాటి మానవ శాస్త్రాల పురోభివృద్ధిలోని ప్రగతిశీల అంశాలన్నిటికీ కమ్యూనిస్టు ఉద్యమం ప్రాతినిధ్యం వహించింది. ఆదర్శ భావాల మొనగాడుగా నిలిచింది.

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పాదుకొల్పడానికి విశేష కృషి చేసింది. హేతువాద, నాస్తిక భావాల వ్యాప్తికి వెన్ను దన్నుగా నిలిచింది. అందువల్లనే కమ్యూనిస్టు ఉద్యమం విశాల ప్రజా రాశుల విశ్వాసాన్ని చూరగొన్నది.

ఎస్టేట్ ఎబోలిషన్ చట్టం ద్వారా కమ్యూనిస్టు ఉద్యమం తెచ్చిన గొప్ప విప్లవం గ్రామాలను ఒక కుదుపు కుదిపింది.

రాష్ట్రం నలుమూలల జమీందారీలు రద్దు అయ్యాయి. వేలాది గ్రామాల్లో లక్షలాది మంది రైతులు తాము దున్నే భూమికి తామే యజమానులయ్యారు. వెట్టి చాకిరీ రద్దు అయ్యింది.

కమ్యూనిస్టు ఉద్యమ పోరాటం వల్లనే గ్రామీణ ఆస్తి సంబంధాలలో ఈ మార్పు వచ్చిందన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించారు. అదో గొప్ప విప్లవం.

నిజానికి చట్టం చేసింది ప్రకాశం పంతులు గారి నేతృత్వం లోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే అయినప్పటికీ దానికోసం అశేష త్యాగాలు చేసి పోరాడింది కమ్యూనిష్టులే నన్న వాస్తవాన్ని ప్రజలు కళ్ళారా చూశారు.

సార్వత్రికంగా కమ్యూనిస్టు ఉద్యమం పట్ల తెలుగు ప్రజల్లో వచ్చిన సమ్మతి, కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన ప్రజా ఆమోదం ఆనాటి ఎన్నికల ఫలితాల్లో ప్రతిఫలించింది.

అందుకే ఆంధ్ర ప్రాంతంలో 140 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్‌కు 40 స్థానాలు రాగా కేవలం 60 స్థానాల్లో పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీకి 41 స్థానాలు దక్కాయి.

వర్గ పోరాటంలో "వార్ ఆఫ్ పొజిషన్" సాధించడంలో వివిధ మిత్ర వర్గాల పొందికను రూపొందించడంతో పాటు, ప్రజల విస్తృత సమ్మతిని పొందడం కీలకం అవుతుందని ఆంటోనియో గ్రామ్ సీ అంటారు. దీనినే "హెజిమొని" అంటారని గ్రామ్ సీ ప్రతిపాదించారు.

ఆంధ్రలో కమ్యూనిస్టులు 1936 నుండి 1952 వరకూ చేసిన విస్తారమైన కృషి ఫలితంగా సమాజంలో "కమ్యూనిస్టు హెజిమొని" ఏర్పడిందని అందువల్లనే కమ్యూనిస్టు ఉద్యమం ప్రజామోదం పొందిన రాజకీయ శక్తిగా ఆవిర్భవించిందని వర్మ తన పుస్తకంలో విశ్లేషిస్తారు.

ఆనాటికి గ్రాంసి ఎవరో తెలియక పోయినా ఆంధ్ర కమ్యూనిస్టులు గ్రాంసీ ప్రతిపాదించిన హెజిమొని సిద్ధాంతాన్ని తమకు తెలియకుండానే అమలు చేశారని, అది సద్యోజనితమని వర్మ అంటారు.

అయితే అనంతర కాలంలో "రాష్ట్రంలో కమ్యూనిస్టులు రాజ్యాధికారాన్ని సాధించుకోలేక పోగా, అంతకు ముందు అపార కృషితో, అశేష త్యాగాలతో సాధించిన కమ్యూనిస్టు హెజిమొనిని నిలబెట్టు కోలేక పోయారని" వర్మ వివరిస్తారు.

తెలుగు సమాజంలో ప్రాంతీయ పెట్టుబడి దారీ వర్గం ఆవిర్భవించిన నేపథ్యంలో వచ్చిన పరిస్థితుల కారణంగా ప్రజల ఆకాంక్షలలో మార్పులు వచ్చాయని, వర్గ పొందికల్లో మార్పులు వచ్చాయని, పర్యవసానంగా కమ్యూనిస్టు హెజిమొని చేజారి పోవడానికి దారి తీసిందని వర్మ వివరించారు.

ఈ పరిణామం ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో ప్రాంతీయ పెట్టుబడి దారీ వర్గ పాలనకు దారి తెరిచిందని వర్మ వివరించారు.

అధికార వ్యవస్థలో సంక్షోభం ఏర్పడిన సమయంలో రాజ్యాధికారాన్ని కాపాడుకునేందుకు పెట్టుబడి దారీ వర్గం చేసే ప్రయత్నాలు రాజకీయాల్లో అనివార్యంగా సమ్మోహక శక్తులకు ద్వారాలు తెరుస్తాయని గ్రామ్ సీ చేసిన సూత్రీకరణ అనంతర కాలంలో ఎన్.టి.ఆర్. రూపంలో వాస్తవ రూపం ధరించిందని వర్మ పేర్కొన్నారు.

బూర్జువా వర్గం అధికారం కోసం సాగించే పెనుగులాటలో పుట్టుకొచ్చే సమ్మోహక శక్తుల పాత్ర ను "సీజర్ హెజిమొని" గా గ్రామ్ సీ పేర్కొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో "కమ్యూనిస్టు హెజిమొని" చేజారిన తర్వాత వచ్చిన" సీజర్ హెజిమొని" కూడా బూర్జువా వర్గ అంతర్గత సంక్షోభాన్ని పరిష్కరించలేకపోయిందని వర్మ వివరిస్తారు.

అనంతర కాలంలో ఎన్.టి.ఆర్. ఓడిపోవడానికి సమ్మోహక శక్తులు తమ ప్రజాకర్షక శక్తిని కోల్పోవడమే కారణమని వర్మ విశ్లేషిస్తారు.

ఆ నేపథ్యంలో రాష్ట్రంలో దళిత, బహుజన, ఎస్.సి.ఎస్.టి, మైనారిటీ, ఆదివాసీ శక్తుల "దళిత, బహుజన హెజిమొని" కోసం జరిగిన ప్రయత్నం పూర్వా పరాలను వర్మ ఈ పుస్తకంలో లోతుగా విశ్లేషించారు.

"దళిత, బహుజన హెజిమొని" ప్రయత్నం కూడా ఒక విఫల ప్రయోగంగా మిగిలిపోవడానికి దారి తీసిన పరిస్థితుల్ని వర్మ ఆలోచనాత్మకంగా వివరించారు. దళిత, బహుజన శక్తులు మొత్తం సమాజ ఆకాంక్షలను ప్రతిబింబించే ఒక హిస్టారికల్ బ్లాక్‌గా ఏర్పడే లోగానే అందులో చీలికలు వచ్చాయని వర్మ వివరించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీల మధ్య అధికారం కోసం జరుగుతున్న వికృత రాజకీయ క్రీడను "బాస్టర్డ్ హెజిమొని" గా వర్మ అభివర్ణిస్తారు.

గ్రామ్ సీ హెజిమొనిని రెండుగా వర్గీకరిస్తారు. అవి ప్రత్యక్ష హెజిమొని, పరోక్ష హెజిమొనిగా గ్రామ్ సీ పేర్కొన్నారు.

ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో ఇష్ట పూర్వకంగా, విశాల ప్రజా రాసుల విస్తృత సమ్మతితో ఏర్పడేది ప్రత్యక్ష హెజిమొని కాగా, వక్ర మార్గాలలో, వివిధ ఉపశ్రేణుల కృత్రిమ పొందికల ద్వారా ఏర్పడే హేజిమోని ని "బాస్టర్డ్ హెజిమొని" గా గ్రామ్ సీ అభివర్ణిస్తారు.

ప్రస్తుతం రాష్ట్రంలో "బాస్టర్డ్ హెజీమని" ఏర్పడి ఉందని వర్మ విశ్లేషించారు. ఇది శాశ్వతం కాదని వర్మ అంటారు.


ఒకే ప్రయోజనాలు, ఆకాంక్షలు కల ప్రాంతీయ పెట్టుబడి దారీ వర్గం కుల విభజన ద్వారా, ధన రాజకీయం ద్వారా, ఓట్లు కొనుగోలు చేసే వికృత రాజకీయం ద్వారా రాష్ట్రంలో "బాస్టర్డ్ హెజీమని" సాధించిందని వర్మ విశ్లేషించారు.

బాస్టర్డ్ హెజిమొని ని బద్దలు చేసి, దాని స్థానంలో విశాల ప్రజానీకపు విస్తృత ఆకాంక్షలను ప్రతిబింబించే "ప్రజా హెజీమని" సాధించడానికి రాష్ట్రం లో ఒక పెద్ద సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పోరాటం జరగాలని వర్మ కోరుకుంటారు.

అందుకోసం కార్ల్ మార్క్స్, డా.బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిబా పూలే, ఆలోచనలతో పాటు ఆంటోనియో గ్రామ్ సీ ఆలోచనలను కూడా ప్రాతిపదికగా స్వీకరించాలని వర్మ తన పుస్తకంలో ప్రతిపాదించారు.

డెబ్బై ఏళ్ళ ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలను ఆంటోనియో గ్రామ్ సీ దృష్టి కోణంలో విశ్లేషించడం ద్వారా డి.వి.వి.ఎస్. వర్మ తెలుగు సమాజానికి ఒక తిరుగులేని, బలమైన సైద్ధాంతిక ఆయుధాన్ని అంద చేశారు. మరింత గాఢ మైన, లోతయిన అధ్యయనానికి వర్మ విశ్లేషణ దారి చూపుతుందని, దాని నుండి లాల్, నీల్ శక్తుల ఐక్య రాజకీయ కార్యాచరణకు మార్గం లభిస్తుందని ఖచ్చితంగా చెప్ప వచ్చు. ❑

# రాష్ట్రంలో రాజకీయ ప్రయోగాలు ప్రత్యామ్నాయ ఆధిపత్య అన్వేషణ



ఎం.సి.వెంకటేశ్వర్లు

కామ్రేడ్ డివివియస్ వర్మగారు రాసిన ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు (1952-2020) పుస్తకం కమ్యూనిస్టు ఉద్యమ శ్రేణులు, శ్రేయోభిలాషులలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. రాష్ట్ర రాజకీయ పరిణామక్రమాన్ని గ్రాంసీ ఆలోచనా విధానంతో విశ్లేషణ చేయడం గ్రాంసీ (ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ) సిద్ధాంతాన్ని అధ్యయనం చేయవలసిన ప్రాధాన్యతను తెలియజేసింది. ప్రస్తుతం దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితుల్లో అటు భాజపాకు, ఇటు వైఎస్‌ఆర్‌సిపి రాజకీయ, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం పోరాడే శక్తులు, వ్యక్తులు, వివిధ పార్టీలు, కార్యకర్తలు ప్రత్యేకించి కమ్యూనిస్టు ఉద్యమ శ్రేణులు పుస్తకాన్ని అధ్యయనం చేయడం అవసరం.

**పుస్తక సమీక్ష**

స్థూలంగా ఈ పుస్తకంలో వర్మగారు 1952 నుండి 2020 వరకు జరిగిన రాష్ట్ర రాజకీయ పరిణామక్రమాన్ని భిన్న కోణాల నుండి విశ్లేషణ జేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో 1952 ఎన్నికల్లో కాంగ్రెస్‌పై స్వల్ప ఆధిక్యం సంపాదించిన సిపిఐ 1955లో ఘోర పరాజయాన్ని చవిచూడడం, తదనంతర కాలంలో రాష్ట్ర రాజకీయాలలో నిర్మాణాత్మక పాత్రను కోల్పోవడం; సినీనటుడు ఎన్‌టి రామారావు అధికారాన్ని చేపట్టడం; కారంచేడు, చుండూరు ఘటనలతో రాష్ట్రంలో సంచలనం కలిగించిన దళిత ఉద్యమం కనుమరుగకావడం; 2020 నాటికి రెండు ప్రాంతీయ పెట్టుబడిదారీ పార్టీలు రాజ్యాధిపత్య స్థానంలో ఉండటమే గాక రాష్ట్రంలో రెండు పార్టీల వ్యవస్థ ఏర్పాటు జరిగిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఈ సంక్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో దోపిడీ లేని, కుల వివక్షలేని ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణం జరగాలని పౌర సమాజంతో ప్రజా హెజిమనీని (ఆధిపత్యాన్ని) నిర్మించాలంటూ గ్రాంసీ సైద్ధాంతిక భావజాలాన్ని ఉదహరించారు. అదే సందర్భంలో రాజ్యాధికారం కోసం దళిత, బహుజన వర్గాలలో పెరుగుతున్న చైతన్యాన్ని పరిగణలోకి తీసుకొని అంబేద్కర్, పూలే రచనలతో పాటు గ్రాంసీని, మార్క్సిజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్ర రాజకీయాలలో ప్రజా హెజీమనీని సాధించడానికి మార్క్స్ భావజాలం; అంబేద్కర్, పూలేల భావజాలాల సమన్వయం జరగాలన్న అభిప్రాయం వ్యక్తం జేశారు. ఈ ఆలోచనను విమర్శనాత్మక దృష్టితో చూడవలసి అవసరం ఉంది.

రాష్ట్ర రాజకీయాలలో ప్రాంతీయ పెట్టుబడిదారీ పార్టీలకు ప్రత్యామ్నాయ రాజకీయవేదికను నిర్మించడం అవసరమన్న ఆలోచనను స్వాగతించాలి. సీపీఐ గతంలో తిరుపతి మహాసభలో.. ఆ తరువాత కడప మహాసభలోనూ దానిపై తీర్మానాలు చేసింది. గతంలోకి వెళితే 1989లో గిరిప్రసాద్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సందర్భంలో టీడీపీ నుండి బయటకు వచ్చిన వ్యక్తులతో కలిసి కాంగ్రెస్, టీడీపీలకు ప్రత్యామ్నాయం తీసుకురావాలనే ప్రయత్నం చేసి చివర నిమిషంలో దానిని ప్రక్కకు పెట్టారు. అప్పటి నుండి రాష్ట్ర రాజకీయాలలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నా ప్రత్యామ్నాయ నినాదం నినాదంగానే మిగిలి పోయిన మాట కాదనలేని సత్యం.

అయినప్పటికి ప్రత్యామ్నాయంపై మరోసారి చర్చను తీసుకురావడం ఆహ్వానింపదగినదే. దీనిపై వామపక్ష పార్టీలు, ప్రజాస్వామిక శక్తుల స్పందన ఏ విధంగా ఉంటుందన్నది వేచి చూడవలసిందే. అయితే వర్మగారు చర్చకు పెట్టిన అంశాలను, గ్రాంసీ, అంబేద్కర్, పూలేల ఆలోచనా విధానాలను లోతుగా చర్చించవలసిన అవసరం ఉంది. ఏ అంశమైనా కాలమాన పరిస్థితులతో పాటు, స్థానిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

రాజకీయ ప్రయోగాలకు సంబంధించి అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రజాసంఘాల నిర్మాణం, ఎన్.టి.రామారావు సమ్మోహన శక్తి, రాజకీయాధికారం కొరకు దళితుల ప్రయత్నం, ఎన్నికల్లో కులం, డబ్బు పాత్ర తదితర అంశాలను చర్చించినప్పటికి ప్రధానంగా గ్రాంసీ సైద్ధాంతిక ఆలోచన అన్వయం, అంబేద్కర్, పూలే, మార్క్సిజం భావజాలాల సమన్వయంపై విస్తృత చర్చ జరగాలి.

మొదటగా గ్రాంసీని తీసుకుందాం. ఆయన సూచించిన పౌర సమ్మతి, ప్రజా హెజిమనీ (ఆధిపత్యం) భావాలు కొంత గందరగోళాన్ని కలిగిస్తాయి. ఫాసిస్టులు హిట్లర్, ముస్సోలినీలైనా, 1917లో లెనిన్ అక్టోబర్ విప్లవంతో అధికారంలోకి రావడంలో పౌరసమ్మతి ఉంది. కాని అధికారం చేపట్టడానికి రూపాలు వేరు కావచ్చు. కాని ఇక్కడ పౌరసమ్మతి అంటే మొత్తం పౌరసమాజం కాదు, అత్యధిక ప్రజానీకం అని చెప్పుకోవాలి. సమాజంలో విప్లవ

అనుకూల, వ్యతిరేక లేక మార్పుకు అనుకూల, వ్యతిరేక వర్గాలుంటాయి. ఆ వర్గాల మధ్య ఉన్న విభజన రేఖను గుర్తించకపోతే పొరపాట్లకు దారితీస్తుంది. దీనికి సంబంధించి కామ్రేడ్ లెనిన్ విప్లవ అనుకూల, వ్యతిరేక, ఊగిసలాడే వర్గాలను స్పష్టంగా నిర్వచించిన విషయాన్ని విస్మరించరాదు.

గ్రాంసీ ప్రధానంగా ఇటలీలో ఫాసిజం అధికారం చేపట్టిన కాలంలో ఆ దేశ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాలను విశాల దృక్పధంతో ఆలోచించాడు. పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలు, ఫాసిస్టు వ్యతిరేక పోరాటాల రూపాలు వేరుగా ఉంటాయనుట వాస్తవం. ఫాసిజంలో వర్గరీత్యా గాకుండా విశాల ప్రజానీకం బాధితులవుతారు. ప్రజాస్వామిక హక్కులు పూర్తిగా ధ్వంసమవుతాయి. ఫాసిజం వ్యతిరేక పోరాటంలో పరస్పర వ్యతిరేక వర్గాలన్నీ ఐక్యంకాక తప్పదు. అందువలన ఆ వర్గాలన్నిటిని ఐక్యం చేయవలసిన అవసరం దృష్టితో పౌరసమ్మతి, ప్రజా హెజిమని భావజాలాన్ని ముందుకు తెచ్చాడు. పెట్టుబడిదారీ విధానంలో అలా ఉండదు.

రెండవది ఉపశ్రేణుల చారిత్రకసంఘటనపై వివరణఇస్తూ, దోపిడీని అంతం చేసే మార్క్స్ భావజాలాన్ని, కులవివక్షను నిర్మూలించే అంబేద్కర్, ఫూలేల భావ జాలాల సమన్వయంతోనే ఈ సంఘటన ఏర్పడే అవకాశం ఉంది. ప్రాంతీయ పెట్టుబడి దారీ దోపిడీని ప్రతిఘటించడానికి, కుల సమీకరణల రాజకీయాన్ని వ్యతిరేకించడానికి ఇలాంటి భావసమన్వయం తప్పనిసరి అవుతుంది." (పేజీ 67, పేరా2). భావసమన్వయం అనే దానికి ఎలాంటి ఔచిత్యంలేదు. మార్క్సిజం, లెనినిజం శాస్త్రీయ సోషలిస్టు భావజాలం కలిగినది. అంబేద్కర్ భావజాలం ఫేబియన్ సోషలిస్టు భావజాలం కలిగినది. మార్క్సిజం వర్గ పోరాటం దృక్పధం కలిగిన సిద్ధాంతం. అంబేద్కర్ వర్గాలను గుర్తించినా ఆయన ఆలోచన విధానం వర్గపోరాటానికి వ్యతిరేకం. ప్రజాస్వామ్యాన్ని గురించి అంబేద్కర్ మాట్లాడుతూ" అది విఫలమయితే నియంతృత్వశక్తులు, కమ్యూనిజం ప్రమాదముంటుందని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేసుకుంటే మార్క్సిజం, అంబేద్కర్ భావజాలాల మధ్య ఉన్న వైరుధ్యం స్పష్టమవుతుంది.

అంతమాత్రాన గ్రాంసీ, అంబేద్కర్ ఆలోచనలకు కాలం చెల్లిందని, అవి పనికిరావని చెప్పటం కాదు. భారతదేశంలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు, అంటే కుల వ్యవస్థను పరిగణనలోకి తీసుకోకుండా అది ప్రజాస్వామిక విప్లవమయినా, సోషలిస్టు విప్లమయినా తీసుకురావడం అసాధ్యం. జాతీయంగా లేదా ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ హెజిమనీని సాధించడానికి మార్క్సిజంతో పాటు, గ్రాంసీ, అంబేద్కర్ రచనలను తప్పనిసరిగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నదనుట నిర్వివాదాంశం.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌టీలు, బీసీలు, ఎస్‌టీలు, ముస్లిం మైనారిటీలు సుమారు 80 శాతం పైగా ఉన్నారు. అగ్రవర్ణాలు 20 శాతంలోపుగానే ఉన్నారు. ప్రతి కులంలో ఉపకులాలున్నాయి. ఒక్క ఎస్‌సి కులంలోనే 56 ఉపకులాలు న్నాయి. సమాజంలో ఉన్న కులవైరుధ్యాలు, అనైక్యత అగ్రవర్ణాల ఆధిపత్యానికి సోపానంగా ఉన్నదన్న చైతన్యం దళిత బహుజనుల్లో కలగాలి. ఎందుకంటే ఉత్పత్తిరంగంలో ప్రధాన పాత్ర వహిస్తున్నది ఈ వర్గాలే. వీరితో పాటు అగ్రవర్ణ పేదలున్న విషయాన్ని మరిచిపోరాదు. ఈ సందర్భంగా అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తుచేసుకోవడం సముచితంగా వుంటుంది. భారతదేశంలో శ్రమ విభజనే కాదు, శ్రామికుల విభజన జరిగిందన్నారు.

కాబట్టి శ్రామికుల విభజనను అధిగమించడంద్వారానే రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పెట్టుబడిదారుల పార్టీల ఆధిపత్యానికి గండిపడుతుంది. దీనికి వర్గపోరాటాలను, కులవివక్ష వ్యతిరేక పోరాటాలను సమన్వయం చేయాలి. అదే సందర్భంలో ఉపశ్రేణులు సమీకరణకు, వారిని చైతన్యవంతులను చేయడానికి గ్రాంసీ చెప్పిన సాంస్కృతిక ఉద్యమం ప్రధాన పాత్ర వహిస్తుంది. దళిత బహుజన, ఇతర శ్రామికవర్గాలు రాజ్యాధికారం సాధించ డానికి ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక, సామాజిక ఉద్యమాలను నిర్మించడం ప్రధాన కర్తవ్యం. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంత ప్రాతిపదికగా నిర్మాణయుతమైన పార్టీ లేకుండా ఆ లక్ష్యం సాధ్యం కాదన్నది ప్రపంచవిప్లవాల అనుభవాలు తెలియ జేస్తున్నాయి.

కమ్యూనిస్టు ఉద్యమ ఉద్ధాన పతనాలను, ప్రజాసంఘాల బలహీనతలను, దళిత ఉద్యమ వైఫల్యాలను, ఎన్నికల్లో కులం, డబ్బు పాత్రను గురించి వర్మ గారు చాలా వరకు వాస్తవాలను వెల్లడించారు. వాటికి గల కారణాలపై లోతైన చర్చ జరగాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత (ఉమ్మడి రాష్ట్రం) ఇప్పటివరకు జరిగిన సామాజిక, ఆర్థిక మార్పులపై అధ్యయనం జరగాలి. సంక్షేమ పథకాల అవసరాన్ని తెలియజేస్తూనే ఓట్‌బ్యాంక్ రాజకీయాలలో భాగంగా మార్చుకున్న బూర్జువా రాజకీయ పార్టీల కుతంత్రాలను బహిర్గతం చేయాలి. కులతత్వం, కుల ఉన్మాదం, కులవివక్షతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు, కుల వ్యతిరేక పోరాటాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని దళిత, బహుజనులకు వివరించాలి. కమ్యూనిస్టులపై ఉన్న వ్యతిరేకతను పోగొట్టాలి. ప్రజల తక్షణ, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యమాలు నిర్మించడం ద్వారా ప్రత్యామ్నాయ రాజకీయ ఆధిపత్యానికి అవకాశాలు ఏర్పడతాయి. ❑

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**